అనుదినం... జనస్వరం

నవతెలంగాణ


www.navatelangana.com

మంగళవారం 13-2-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 356 | Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam | 12 పేజీలు వెల : 6.50

రేషన్ షాపుల్లో మోడీ పోస్టర్లు, బ్యానర్లు పెట్టం



కేరళ సీఎం విజయన్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కేరళలోని రేషన్ షాపుల్లో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పోస్టర్లు, బ్యానర్లు ఏర్పాటు చేయాలని కేంద్రం జారీ చేసిన ఆదేశాలు సరైనవి కాదని, వీటి అమలు కష్టమని సీఎం పినరయి విజయన్ తెలిపారు. కేరళలో రేషన్ వ్యవస్థ దీర్ఘకాలంగా ఉందని, గతంలో ఎన్నడూ...

11లో

జలదోపిడీని అడ్డుకుంటాం

కేసీఆర్ అసమర్థతతోనే తెలంగాణకు తీరని నష్టం

- కేఆర్ఎంబీకి ప్రాజెక్టులు అప్పగించేది లేదంటూ అసెంబ్లీలో తీర్మానం

- అధికార,విపక్షాల మధ్య మాటల యుద్ధం
- తప్పు మీదంటే మీదేనని పరస్పర విమర్శలు
- పద్మారావుకు ప్రతిపక్ష బాధ్యతలు ఇవ్వండి:రేవంత్
- సభకు రాకుండా..నల్లగొండకు వెళతారా ?:భట్టి
- ప్రభుత్వ తీర్మానానికి బీఆర్ఎస్ మద్దతు
- నేడు మేడిగడ్డకు సర్కారు

కృష్ణాజలాల వాటా, కేఆర్ఎంబీకి ప్రాజెక్టుల అప్పగింతపై తెలంగాణ అసెంబ్లీలో మాటల తూటాలు పేలాయి. ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. సభ్యుల మధ్య యుద్ధం నడిచింది. అధికార, విపక్షాలు తప్పు మీదంటే మీదేనని వాగ్వివాదానికి దిగాయి. తమ దగ్గర ఉన్న ఫైళ్లు, కాగితాలు, వీడియో క్లిప్పింగ్‌లను సాక్షాల కింద చూపే ప్రయత్నం ఇరుపార్టీలు చేశాయి. మొత్తం వ్యవహారంపై సర్కారు అసెంబ్లీలో పవర్‌పాయింట్ ప్రజేంటేషన్ ఇచ్చింది. మంత్రులు, ఎమ్మెల్యేల ప్రసంగాలను అడ్డుకునే ప్రయత్నాలు ఇరుపక్షాల నుంచి జరిగింది. మధ్యలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ జోక్యం చేసుకుని సభను అదుపుచేసే ప్రయత్నం చేశారు. పదే పదే జోక్యం చేసుకుని సభ్యులు సభకు సహకరించాలనీ, ఎవరైనా చైర్‌ను ఉద్దేశించి మాట్లాడాలని సూచించారు. ఇందుకోసం సభ్యుల సౌకర్యార్థం రెండు స్క్రీన్లు సైతం సర్కారు ఏర్పాటు చేసింది.




నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

అసెంబ్లీలో 'కృష్ణా ప్రాజెక్టులపై వాస్తవాలు..బీఆర్ఎస్ ప్రభుత్వ తప్పిదాలు' పేరుతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సర్కారు శ్వేతపత్రం విడుదల చేసింది. చర్చ అనంతరం సభ తీర్మానాన్ని ఆమోదించింది. కేసీఆర్ పదేండ్ల పాలనలో జరిగిన తప్పుడు విధానాలే, ఇప్పుడు తెలంగాణకు శాపాలయ్యాయని పేర్కొంటూ కృష్ణానదీపై ఉన్న ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించే ప్రసక్తే లేదనీ, రాష్ట్రానికి దక్కాల్సిన వాటా కోసం గట్టి ప్రయత్నం చేస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇరుపక్షాల ప్రసంగాలను అడ్డుకునే ప్రయత్నాలు జరిగాయి..

రాష్ట్ర సాగునీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పవర్‌పాయింట్ ప్రజేంటేషన్(పీపీటీ) ఇచ్చారు. గత ప్రభుత్వ నిర్ణయాలతో జరిగిన జలదోపిడిని అడ్డుకునేందుకు చిత్తశుద్ధితో కృషిచేస్తామని చెప్పారు. ' తెలంగాణ ఎన్నికల రోజున ఏపీ ప్రభుత్వం నాగార్జునసాగర్‌పై పోలీసులను పంపింది. రోజుకు మూడు టీఎంసీల నీటిని అక్రమంగా తరలించుకుపోయింది.కేసీఆర్ ఓడిపోతున్నారనే సాగర్‌పైకి జగన్ పోలీసులను పంపినట్టు అనిపిస్తోంది..ఎలాంటి పరిస్థితుల్లోనూ షరతులకు అంగీకరించకుండా...

11లో

కృష్ణా జలాలపై లాభం కలిగేలా చర్చ ఉండాలి



- బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

వివరాలు 3లో

అవన్నీ అవాస్తవాలు : హరీశ్‌రావు

పీపీటీ అనంతరం స్పీకర్ బీఆర్ఎస్ సభ్యులు హరీశ్‌రావుకు మాట్లాడేందుకు అవకాశమిచ్చారు. ప్రభుత్వం అబద్ధాలను పీపీటీ ద్వారా చెప్పిందని విమర్శించారు. పీపీటీ అవకాశం తమకూ ఇవ్వాలని కోరినా, ఇవ్వకపోవడం దారుణమన్నారు. కేఆర్ఎంబీకి ప్రాజెక్టులను అప్పగించబో మని ప్రభుత్వం ప్రకటన చేయడం తెలంగాణ ప్రజలు, బీఆర్ఎస్ విజయమని అన్నారు. నల్లగొండలో సభ పెడుతున్నందునే మంత్రి ఈ ప్రకటన చేశారనీ, తప్పులను సవరించుకుంటున్నారని వ్యాఖ్యానించారు. హరీశ్‌రావు వ్యాఖ్యపై కోమటిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నల్లగొండ జిల్లాను మోసం చేసినందునే ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌ను ఓడించారని చెప్పారు. ఏపీ అసెంబ్లీలో జగన్ ఇచ్చిన స్టేట్‌మెంట్ వినలేదా ? అని ప్రశ్నించారు. ఏపీ సీఎం చెప్పిన తర్వాత కూడా తామే తప్పుచేసినట్టు మాట్లాడితే ఎలా ? అని నిలదీశారు. కేసీఆర్, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి తమ జిల్లాను మోసం చేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ పుణ్యమా అని వ్యవసాయం సంగతి అటుంచితే, తాగునీటికి నీళ్లు లేక ట్యాంకర్లు పెడుతున్నామని అన్నారు. జగదీశ్‌రెడ్డికి ముఖం చెల్లకే ఈరోజు సభకు రాలేదని అని విమర్శించారు. కృష్ణాజలాల విషయంలో కేసీఆర్ ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆ తర్వాతే నల్లగొండ సభకు రావాలని వ్యాఖ్యానించారు.



సీఎం వర్సెస్ హరీశ్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ మంత్రి హరీష్‌రావు మధ్య అసెంబ్లీలో మాటల యుద్ధం జరిగింది. సీఎం రేవంత్‌రెడ్డి చర్చలో జోక్యం చేసుకుంటూ తెలంగాణ ఉద్యమం జరిగిందే నీళ్ల కోసమనీ, అలాంటి చర్చ సందర్భంగా ప్రతిపక్ష పార్టీ లీడర్ కేసీఆర్ సభలో లేకుండా ఫామ్‌హౌస్‌లో దాచుకోవడం సరికాదని వ్యాఖ్యానించారు. కరీంనగర్ ప్రజలు తరిమితే మహబూబ్‌నగర్ ఎంపీగా గెలిపించారని పరోక్షంగా కేసీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. దక్షిణ తెలంగాణ కృష్ణాజలాలపై ఆధారపడి ఉందని అన్నారు. సభలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు పచ్చి అబద్ధాలు చెబుతున్నారని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమం గురించి రేవంత్‌రెడ్డి మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించడమే అవుతుందన్నారు. 'మిమ్మల్నీ కొడంగల్ ప్రజలు తరిమితే మల్కాజ్‌గిరికి వచ్చారని భావించాలా అంటూ హరీశ్ కౌంటర్ ఇచ్చారు.

పానీ పట్టు యుద్ధం..



- అసెంబ్లీలో పై చేయి సాధించేందుకు అధికార, ప్రధాన ప్రతిపక్షం తహతహ
- పవర్ పాయింట్ ప్రజంటేషన్‌పై సందర్భంగా వాగ్బాణాలు
- సభలో తీర్మానించటం మేం సాధించిన విజయమే : హరీశ్‌రావు
- ప్రతిపక్ష నేత సమాజాన్ని అవమానపరుస్తున్నారు : సీఎం రేవంత్

వివరాలు 10లో


రాచకొండ కమిషనర్ ఆకస్మిక బదిలీ

మరో 11 మంది ఐపీఎస్‌లకు స్థాన చలనం

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి :

రాష్ట్రంలో 12 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో ముఖ్యంగా, రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్‌బాబు ను ఆకస్మికంగా బదిలీ చేయటమే కాక, మరో ఇద్దరు కమిషనర్లకు ఇటీవలన ఇచ్చిన నియామక పత్రాలను రద్దు చేసి వేరే పోస్టుకు మార్చారు. రాచకొండ నూతన కమిషనర్‌గా మల్టీజోన్-2 ఐజీ తరుణ్ జోషిని నియమించి, ఇక్కడున్న కమిషనర్ సుధీర్‌బాబును మల్టీజోన్-2 ఐజీగా పోస్టింగ్ ఇచ్చారు. అలాగే, మల్టీజోన్-1ను కూడా అదనంగా సుధీర్‌బాబుకు అప్పగించారు.

పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న డీఐజీ ఎం శ్రీనివాసులును రామగుండం కమిషనర్‌గా నియమించి..



ఇటీవలనే ఇక్కడి కమిషనర్‌గా నియమితులైన డీఐజీ ఎల్.ఎస్ చౌహాన్ పోస్టింగ్‌ను రద్దు చేసి తిరిగి ఆయనను జోగులాంబ గద్వాల్ జోన్-7 డీఐజీగా నియమించారు. గతంలో జోగులాంబ డీఐజీగా పోస్టింగ్ పొందిన జోయెల్ డేవిస్‌ను ఆ పోస్ట్ నుంచి మార్చి సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ పోలీస్ కమిషనర్‌గా బదిలీ చేశారు. ఈ పోస్ట్‌లో ఉన్న జాయింట్ పోలీస్ కమిషనర్ కె. నారాయణ్ నాయక్‌ను సీఐడీ ఎస్పీఆర్బీగా ట్రాన్స్‌ఫర్ చేశారు. రాష్ట్ర మహిళా భద్రతా విభాగం ఎస్పీ కె. అపూర్వ రావును టీఎస్ఆర్టీసీ విజిలెన్స్ ఎస్పీగా, టీఎస్ ట్రాన్స్‌కో ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డిని నగర సౌత్ వెస్ట్ జోన్ డీసీపీగా, రాచకొండ ఎస్ఓటీ డీసీపీ ఆర్.గిరిధర్‌ను నగర తూర్పు మండలం డీసీపీగా నియమించారు. పోస్ట్...

11లో

కార్పొరేట్ శక్తుల కోసమే సాగు నల్ల చట్టాలు

రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు సాగర్, వెంకట్రాములు

- 16న గ్రామీణబంద్ కరపత్రాల పంపిణీ

నవతెలంగాణ- యాచారం

ర్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసమే కేంద్ర ప్రభుత్వం కావ్యవసాయ నల్ల చట్టాలను తీసుకొచ్చిందని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు అన్నారు. 16న గ్రామీణ భారత్ బంద్‌పై రంగారెడ్డి జిల్లా యాచారం మండల పరిధిలోని మాల్, తమ్మలోనిగూడ గ్రామాల్లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం కరపత్రాల ద్వారా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నూతన వ్యవసాయ నల్ల చట్టాలను తెచ్చి వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు



అప్పజెప్పే ప్రయత్నం చేసిందన్నారు. ఈ చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీ సరిహద్దుల్లో 12 నెలలపాటు రైతాంగం పెద్దఎత్తున ఉద్యమాలు చేసిందని గుర్తు చేశారు. ఉద్యమంలో 600 మంది చనిపోయారని, దీంతో కేంద్ర ప్రభుత్వం చట్టాలను తాత్కాలికంగా...

11లో

అడుగడుగునా నిర్బంధం

ఎక్కడ చూసినా యుద్ధ వాతావరణం

- పలు రాష్ట్రాల నుండి 'ఢిల్లీ ఛలో'కు అన్నదాతలు
- అరెస్టులతో అడ్డుకుంటున్న పోలీసులు
- సరిహద్దుల మూసివేత
- రాజధానిలో నెల రోజుల పాటు సెక్షన్ 144 విధింపు

న్యూఢిల్లీ : డిమాండ్ల సాధన కోసం అన్నదాతలు చేపట్టిన 'ఢిల్లీ ఛలో' కార్యక్రమానికి అడుగడుగునా ఆంక్షలు ఎదురవుతున్నాయి. ఎక్కడ చూసినా రైతన్నలపై నిర్బంధాలు కొనసాగుతున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే అనేక ప్రాంతాల్లో యుద్ధ వాతావరణం కన్పిస్తోంది. రైతులను ఎలాగైనా అడ్డుకోవాలన్న ఉద్దేశంతో ఢిల్లీ పోలీసులు రాజధానిలో 144వ సెక్షన్ కింద నిషేధాజ్ఞలు విధించారు. ప్రదర్శనలు, సమావేశాలను ఏకంగా నెల రోజుల పాటు నిషేధించారు. ఈ ఉత్తర్వులు సోమవారం నుండే అమలులోకి వచ్చాయి. మార్చి 12వ తేదీ వరకూ అమలులో...

11లో





అన్నదాతల్ని దేశ శత్రువులుగా భావించొద్దు

- రైతుల ఆందోళనపై నియంతృత్వ విధానాలను విడనాడాలి : ఎస్కేఎం


11లో..

ఎక్సైజ్ శాఖలో భారీగా బదిలీలు

14 మంది ఈఎస్‌లకు స్థానచలనం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా 14 మంది ఎక్సైజ్ సూపరింటెండెంట్లను (ఈఎస్) ప్రభుత్వం బదిలీ చేసింది. ఈమేరకు ఆ శాఖ ముఖ్య కార్యదర్శి సునిల్ శర్మ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఇద్దరు ఉప కమిషనర్లు, తొమ్మిది మంది సహాయ కమిషనర్లకు స్థాన చలనం కల్పించారు. మల్టిజోన్-1లో 64 మంది, మల్టి జోన్-2 లో 85 మంది సీఐలను బదిలీ చేశారు. 2024 పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సొంత జిల్లాలో పనిచేస్తున్న వారితో పాటు, ఒకే రెవెన్యూ జిల్లాలో మూడేండ్లుగా విధులు నిర్వహిస్తున్న వారిని ఈసీ మార్గ దర్శకాలకు అనుగుణంగా బదిలీ చేసినట్టు పేర్కొన్నారు.



150 మంది జెడ్పీ సీఈఓ, డిప్యూటీ సీఈఓ, డీపీఓల బదిలీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో అధికారుల బదిలీల పరంపర కొనసాగుతున్నది. తాజాగా పంచాయతీరాజ్ శాఖలోని 105 మంది జెడ్పీ సీఈఓలు, డిప్యూటీ సీఈఓలు, డీపీఓలను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు సోమవారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేశారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సొంత జిల్లాలతో పాటు మూడేండ్ల నుంచి ఒకే చోట పనిచేస్తున్న అధికారులను బదిలీ చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ బదిలీలు జరిగాయి. ఇప్పటికే రాష్ట్రంలో 395 మంది ఎంపీడీఓలు బదిలీ అయిన విషయం తెలిసిందే.

గవర్నర్ వాకౌట్

తమిళనాడు అసెంబ్లీ నుంచి అర్థంతరంగా బయటకు..

- కేంద్రాన్ని విమర్శించే ప్రసంగం చదవనంటూ వ్యాఖ్యలు
- రాష్ట్ర ప్రభుత్వంతో క్షీణించిన సంబంధాలు



వివరాలు 3లో..

మోడీ 3.0 వెనుక..?

అయోధ్య పూర్తయినా.. హిందూత్వతోనే రాజకీయం




- రానున్న ఎన్నికల్లో బీజేపీ ఎత్తుగడలు
- కాశీ, మథురపై ఆ పార్టీ నేతల 'కీలక' వ్యాఖ్యలు
- మూడోసారి అధికారంలోకి వస్తామని మోడీ విశ్వాసం
- లోక్‌సభలో 370 సీట్లపై గురి
- ఆరెస్సెస్ సిద్ధాంతాల అమలే లక్ష్యం
- రాజకీయ విశ్లేషకుల అంచనా



న్యూఢిల్లీ : యూపీలోని అయోధ్యలో రామ మందిర నిర్మాణ అంశం బీజేపీకి రాజకీయంగా ఎదుగుదలకు దోహదం చేసింది. దేశంలో 1990వ దశకం వరకు ఆ పార్టీ ఉనికి, బలం అంతగా లేదు. అయితే, రామ మందిర నిర్మాణ డిమాండ్‌తో ఆ పార్టీ అగ్రనేత ఎల్.కె అద్వానీ దేశంలో చేపట్టిన రథయాత్ర ఆ పార్టీని రాజకీయంగా బలంగా తయారు చేసింది. ఆ తర్వాత దేశవ్యాప్తంగా జరిగిన పలు లోక్‌సభ ఎన్నికల్లో వందకు పైగా స్థానాలు, అనేక రాష్ట్రాల్లో ఆ పార్టీకి అధికారాన్ని సాధించేలా చేసింది. 'హిందూత్వ' అనే భావోద్వేగ సిద్ధాంతాన్ని నమ్ముకున్న ఆ పార్టీ ఆ సెంటిమెంట్‌ను పలు ఎన్నికల్లో...

10లో

బల పరీక్ష నెగ్గిన నితీశ్ సర్కార్



పాట్నా : బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం సోమవారం విశ్వాస పరీక్షలో నెగ్గింది. ప్రతిపక్ష మహాఘట్‌బంధన్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. దీంతో విశ్వాస పరీక్ష సమయంలో ప్రతిపక్షం 'అంకెల గారడీ' కి ప్రయత్నిస్తుందంటూ కొన్ని రోజుల నుంచి వెలువడుతున్న ఊహాగానాలు పటాపంచలయ్యాయి.

మెజారిటీ ఓటుతో ప్రభుత్వం నెగ్గిందని జనతాదళ్ (యునైటెడ్) కి చెందిన డిప్యూటీ స్పీకర్ మహేశ్వర్ హజారి సభలో ప్రకటించారు. 243 మంది సభ్యులు గల సభలో మహాఘట్‌బంధన్ సభ్యులందరూ వాకౌట్ చేయడంతో జేడీయూ-బీజేపీ కూటమికి...

11లో



విద్యార్థినుల మరణాలపై సిట్టింగ్ జడ్జిచే విచారణ జరపాలి

- వైష్ణవి కుటుంబానికి న్యాయం చేయాలి :కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జాన్‌వెస్లీ, స్కైలాబ్ బాబు

నవతెలంగాణ-సూర్యాపేట

రాష్ట్రంలో సంక్షేమ హాసళ్ల, గురుకుల పాఠశాలలో జరుగుతున్న విద్యార్థినుల మరణాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జాన్‌వెస్లీ, స్కైలాబ్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సూర్యాపేటలోని ఇమాంపేట గురుకుల కళాశాలలో మృతిచెందిన వైష్ణవి కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ కాలనీలోని వైష్ణవి కుటుంబాన్ని కేవీపీఎస్ రాష్ట్ర బృందం పరామర్శించింది. విద్యార్థిని మృతికి సంబంధించిన వివరాలను తల్లిదండ్రులతో మాట్లాడి తెలుసుకుంది.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గురుకుల కళాశాలలో వైష్ణవి మృతిపై అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. ఉరేసుకుందని పాఠశాల ప్రిన్సిపాల్, హాస్టల్ సిబ్బంది చెబుతున్నారు కానీ.. విద్యార్థిని శరీరంపై గాయాలు ఎలా అయ్యాయని ప్రశ్నించారు. కలెక్టర్, ఎస్పీ చొరవ తీసుకొని విద్యార్థిని గదిని, గురుకుల కళాశాలను సందర్శించేందుకు తల్లిదండ్రులకు, సామాజిక సంఘాల నాయకులకు అవకాశం కల్పించాలని కోరారు. వైష్ణవి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్నారు. స్పష్టమైన ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

సూర్యాపేటలో గురుకుల విద్యార్థిని, భువనగిరిలో సంక్షేమ హాస్టల్‌లో విద్యార్థినుల మరణాలపై సమగ్ర వివరాలు తెలియాలంటే సిట్టింగ్ జడ్జిచే సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. ఎస్పీ, కలెక్టర్ ఇప్పటివరకు వైష్ణవి కుటుంబాన్ని పరామర్శించక పోవడం సరికాదన్నారు. విద్యార్థినుల ఆత్మహత్యలపై ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ బృందంలో కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతివేల మాణిక్, జిల్లా కార్యదర్శి కోట గోపి, అధ్యక్షులు మర్రి నాగేశ్వరరావు, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎల్గూరి గోవింద్, రాష్ట్ర నాయకులు బొట్ల శేఖర్, పల్లెర్ల లలిత, దేవదానం, అశోక్, సుభాష్, కొలారి నర్సింహులు, నాయకులు నందిగామ సైదులు, టేకుల సుధాకర్, వెంకటరమణ, భాగ్యమ్మ దుర్గయ్య తదితరులు ఉన్నారు.

బావిలో పడి ఇద్దరు యువకుల మృతి

నవతెలంగాణ-చింతలమానేపల్లి

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండల కేంద్రంలో బావిలో పడి ఇద్దరు యువకుల మృతిచెందడం కలకలం రేపింది. మృతులు తుమిడే హరీశ్(22), కంబాల మహేష్(22)గా పోలీసులు గుర్తించారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కంబాల మహేష్ సోదరుడి ప్రేమ వివాహం ఆదివారం జరిగింది. అదే రోజు సాయంత్రం తన స్నేహితుడు తుమిడే హరీశ్‌తో కలిసి బయటకు వెళ్లారు. రాత్రి అయినా ఇద్దరూ ఇంటికి రాలేదు.

దీంతో కుటుంబీకులు చుట్టుపక్కల వెతికారు. సోమవారం వెకువ జామున గ్రామ సమీపంలోని పొలాల్లో హరీశ్ ద్విచక్ర వాహనం కనిపించింది. ఆ తర్వాత వ్యవసాయ బావుల్లో వెతికారు. రౌత్ లింగయ్య వ్యవసాయ బావిలో ఇద్దరి చెప్పులు నీటిలో తేలాయి. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. కౌటాల సీఐ సాదిక్ పాషా, ఎస్ఐ సురేష్ ఘటన స్థలానికి చేరుకొని ఈతగాళ్ల సాయంతో ఇద్దరి మృతదేహాలను వెలికి తీశారు. అక్కడ చీకటిగా ఉండటంతో ప్రమాదవశాత్తూ జారి పడ్డారా...? లేక ఎవరైనా చంపి పడేశారా..? అన్నది తేలాల్సి ఉంది. బావి సమీపంలో మద్యం బాటిళ్లు ఉండటంతో.. వారు తాగి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. హరీశ్ తండ్రి తుమిడే శంకర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో కానిస్టేబుల్ మృతి

- వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగలు తగిలి..

నవతెలంగాణ-భూపాలపల్లి



వన్యప్రాణుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు తగిలి కానిస్టేబుల్ మృతిచెందాడు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి జిల్లా కాటారం మండల పరిధి నస్తూర్‌పల్లి గ్రామ అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తున్నారనే సమాచారంతో స్థానిక పోలిసులతో కలిసి కానిస్టేబుల్ ప్రవీణ్(32) కూంబింగ్‌కు వెళ్లారు.

ఈ క్రమంలో వణ్యప్రాణులు వేట కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్లు తగిలి ప్రవీణ్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు. అనంతరం కుటుంబీకులకు అప్పగించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టారు. విద్యుత్ వైర్లు అమర్చిన వారి కోసం గాలింపు ముమ్మరం చేశారని, ప్రవీణ్ మృతికి కారణమైన వేటగాళ్లను పోలీసులు అదుపులో తీసుకొని విచారిస్తున్నట్టు తెలిసింది.

పలు కొలువులకు వయోపరిమితి 46 ఏండ్లకు పెంపు

- ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగులకు శుభవార్త చెప్పింది. వారి వయోపరిమితిని రెండేండ్లు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. దాంతో సర్వీస్ కమిషన్, డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రభుత్వ ఉద్యోగాల గరిష్ఠ వయోపరిమితి 44 ఏండ్ల నుంచి 46 ఏండ్లకు పెరగనుంది. నిరుద్యోగులు, యువకుల నుంచి వచ్చిన పలు విజ్ఞప్తుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రభుత్వం పేర్కొంది. అయితే ఈ సడలింపు పోలీస్, ఎక్సైజ్, ఫైర్, అటవీ, జైళ్ల తదితర యునిఫాం సర్వీసులకు వర్తించబోదని తెలిపింది.





జిల్లా అభివృద్ధే లక్ష్యంగా పనిచేద్దాం

ప్రజల అర్జీలను పరిష్కరిస్తాం

- ఐటీడీఏల బలోపేతంతో ఉపాధి అవకాశాలు విస్తృతం
- తరచూ వస్తూ ఉంటా.. అండగా ఉంటా..: పంచాయతీరాజ్ శాఖ, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క
- నాగోబా దర్బార్‌కు తరలివచ్చిన గిరిజనం



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

అటవీ ప్రాంతంలో పుట్టిన బిడ్డను.. ఉద్యమాల్లో పని చేశాను. ఈ ప్రాంత బిడ్డల కష్టాలు తెలిసిన వ్యక్తిగా చెబుతున్నా.. ఉమ్మడి జిల్లా సమగ్ర అభివృద్ధికి అంకితమవుదామని పంచాయతీరాజ్ శాఖ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి దనసరి అనసూయ(సీతక్క) అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం జిల్లా అభివృద్ధికి ముఖ్యమంత్రి కట్టుబడి ఉన్నారని.. ఇక్కడ అందరితో కలిసిపోతాననే తనకు జిల్లా ఇన్‌చార్జి బాధ్యతలు సీఎం అప్పగించారని అన్నారు. కల్మషం లేని జాతులు, పోరాట చరిత్ర, చారిత్రక ప్రాంతాలు కలిగిన ఈ జిల్లాకు ఇన్‌చార్జి మంత్రిగా పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో సోమవారం నాగోబా దర్బార్‌ను అధికారికంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అధ్యక్షత వహించిన ఈ దర్బార్‌కు ఎంపీ సోయం బాపురావు, కలెక్టర్ రాహుల్‌రాజ్, ఐటీడీఏ పీఓ ఖుష్బుగుప్తా, ఎస్పీ గౌస్‌ఆలం, డీఎఫ్ఓ ప్రశాంత్ బాజీరావు పాటిల్, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడారు.

తాను ఇన్‌చార్జి మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఐదు సార్లు జిల్లాకు వచ్చానని.. ఇక నుంచి తరచూ వస్తూనే ఉంటానని జిల్లా వాసులకు తోడు..అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. తొలిసారి దర్బార్‌కు రావడం ఆనందంగా ఉందన్నారు. ఇక్కడ కుమురంభీం, హైమన్‌డార్ఫ్ వంటి మహనీయుల చరిత్రను భావి తరాలకు అందించేందుకు శిలాఫలకంపై ముద్రించాలని ఇందుకు తన నిధులు కేటాయిస్తానని హామీనిచ్చారు. దర్బార్‌లో వచ్చిన అర్జీలను తప్పకుండా పరిష్కరిస్తామని.. లేనిపక్షంలో అవి ఎందుకు పరిష్కారం కావడం లేదో సంబంధిత వ్యక్తులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. ఆదివాసీ గిరిజన ప్రాంతాల్లో రోడ్లు, కరెంటు, పోడు పట్టాలు, నిరుద్యోగ సమస్యలు తదితర వాటిని పరిష్కరించేందుకు శాయశక్తులా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఐటీడీఏలను బలోపేతం చేయడంతోపాటు వాటి ద్వారా యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు నేర్పించి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేలా దృష్టిసారిస్తామని చెప్పారు. పోరాట వారసత్వం, చారిత్రక ప్రదేశాలు, సహజ వనరుల ప్రాంతాలను గుర్తించి టూరిజం అభివృద్ధి చేస్తామన్నారు. జోడేఘాట్, మార్లవాయి తదితర ప్రాంతాల్లో స్వయం ఉపాధి కేంద్రాలను నిర్మించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. రాజకీయాలకు అతీతంగా జిల్లా అభివృద్ధికి అంకితమవుదామని పిలుపునిచ్చారు. అధికారులు చిత్తశుద్ధితో కష్టాన్ని ఇష్టంగా మలుచుకొని పనిచేయాలని సూచించారు. జిల్లాను అన్ని రంగాల్లో అగ్రభాగాన నిలిపేందుకు సమన్వయంతో కృషిచేయాలని కోరారు. అంతకుముందు మంత్రి నాగోబాకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ గోడం నగేష్, మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్, జడ్పీటీసీ అర్క పుష్పలత, ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావు, మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి, మాజీ సర్పంచ్ మెస్రం నాగ్‌నాథ్, నాయకులు శ్యాంనాయక్, అడె గజేందర్ పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనమివ్వాలి

తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమ

6న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపు

నవతెలంగాణ-ఆమనగల్

మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా ఆమనగల్ పట్టణంలోని విద్యావనరుల కేంద్రంలో సోమవారం మధ్యాహ్న భోజన కార్మికుల ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 16న దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సమ్మెలో అందరూ భాగస్వాములై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్మికుల హక్కులను కాలరాసే విధంగా కేంద్రం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రయివేట్ స్వచ్ఛంద సంస్థలకు అప్పగించే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నూతన విద్యా విధానం-2022 చట్టాన్ని రద్దు చేయాలని కోరారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించి గుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించి, వంటకు సరిపోయే సిలిండర్లు, సరుకుల కొనుగోలుకు సబ్సిడీ రుణాలు అందజేయాలన్నారు. రాజకీయ వేధింపులు, అక్రమ తొలగింపులు అరికట్టాలన్నారు. వంట షెడ్లు, వంట పాత్రలు, కాటన్ దుస్తులు, సామాజిక భద్రతతో పాటు ప్రమాద బీమా, పీఎఫ్, ఈఎస్ఐ తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షులు స్వప్న, రాష్ట్ర నాయకులు ఆంజనేయులు, ప్రజాసంఘాల నాయకులు కాన్గుల వెంకటయ్య, పిప్పళ్ల శివశంకర్, మండల అధ్యక్షులు పద్మ, గోజీ, లక్ష్మమ్మ, అలివేలు, ఆమనగల్, కడ్తాల్ మండలాల మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.



అభివృద్ధి మాటున అవినీతి

- బీఆర్ఎస్‌కు కౌన్సిలర్ల మూకుమ్మడి రాజీనామా
- త్వరలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడి

ప్రశ్నించినందుకే టీఆర్ఎస్ నుంచి బహిష్కరణ



నవతెలంగాణ-సూర్యాపేట

సూర్యాపేట జిల్లా కేంద్రంలో అభివృద్ధి మాటున జరిగిన అవినీతిని ప్రశ్నించినందుకే తనను పార్టీ నుంచి బహిష్కరించారని 31వ వార్డు కౌన్సిలర్ కొండపల్లి నిఖిల దిలీప్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ నుంచి బహిష్కరణకు గురైన జిల్లా నాయకులు కొండపల్లి దిలీప్‌రెడ్డి, కౌన్సిలర్ నిఖిలకు మద్దతుగా 15 మంది అసమ్మతి కౌన్సిలర్స్ ఆ పార్టీకి రాజీనామా చేశారు. సోమవారం సూర్యాపేట పట్టణంలోని కొండపల్లి నిఖిల దిలీప్‌రెడ్డి నివాసంలో వారు విలేకర్లతో మాట్లాడారు. బీఆర్ఎస్‌లో కష్టపడి పనిచేసే వారికి విలువ లేదన్నారు. జనంలో మంచిగా ఓ వ్యక్తి ఎదిగితే ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డికి నచ్చదని, ఎలాగైనా అణచివేస్తారని ఆరోపించారు. అవినీతిని ప్రశ్నిస్తే పార్టీ నుంచి బహిష్కరిస్తారా పదేండ్ల నుంచి పని చేసిన తమకు ఇచ్చే గౌరవం ఇదా అని ప్రశ్నించారు. కనీసం మా వార్డుల్లో జరిగిన అభివృద్ధి పనుల శిలాఫలకాలపై కౌన్సిలర్ల పేరు పెట్టేందుకు కూడా అంగీకరించలేదన్నారు. జగదీశ్‌రెడ్డి మూడుసార్ల గెలుపులో తాము కీలకపాత్ర పోషించామని, మున్సిపాలిటీలో తప్ప ఆయనకి ఎక్కడా ఓట్లు పడలేదన్నారు. తాము వార్డులో ఉంటామని, ప్రజల మనుషులుగా చలామణి అవుతామని ప్రజా సమస్యలపైనే అవిశ్వాసానికి వెళ్లామన్నారు. బీఎస్పీలో చేరిన కృపాకర్‌ను దగ్గరకు తీసుకున్న జగదీశ్‌రెడ్డి తమని దూరంపెట్టి పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్టు ప్రకటించడం విచారకమన్నారు. తామంతా కలిసికట్టుగా ఉంటామని భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు బచ్చలకూరి శ్రీనివాస్, జహీర్, ఎలిమినేటి అభినయ్, అనపర్తి రాజేష్, అనంతుల యాదగిరి, రాపర్తి శ్రీనివాస్, మామిడి గౌరయ్య, జ్యోతి కరుణాకర్, రవినాయక్, నాయకులు గండూరి రమేష్, లింగానాయక్, సిరివెళ్ల శబరి, కుంభం రాజేందర్, మకట్‌లాల్ తదితరులు ఉన్నారు.

'గురుకుల' ఆత్మహత్యలపై అసెంబ్లీలో చర్చించాలి

- వరుస ఘటనలపై సీఎం స్పందించాలి: డాక్టర్ ఆర్ఎస్. ప్రవీణ్‌కుమార్
- దామోదరం సంజీవయ్య సంక్షేమ భవన్ వద్ద ధర్నా



నవతెలంగాణ-బంజారాహిల్స్

వసతి గృహాల్లో విద్యార్థినుల వరుస ఆత్మహత్యలకు ప్రభుత్వం బాధ్యత వహించాలని, అసెంబ్లీలో చర్చించాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని దామోదరం సంజీవయ్య సంక్షేమ భవన్ వద్ద సోమవారం బీఎస్పీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగానే విద్యాసంస్థల్లో చదువుతున్న 60 లక్షల మంది పేద విద్యార్థులు బాల్యంలోనే సమాధులయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. విద్యార్థినుల వరుస ఆత్మహత్యలపై సీఎం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. మృతుల తల్లిదండ్రులు రోడ్డుపై బైటాయించి ధర్నా చేస్తున్నా ప్రభుత్వ స్పందించక పోవడం సిగ్గుచేటన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖలకు మంత్రులను నియమించి, విద్యార్థినుల కుటుంబాలకు రూ.కోటి ఎక్స్‌గ్రేషియా, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమండ్ చేశారు. ఆధిపత్య వర్గాల పిల్లలు చదివే అంతర్జాతీయ స్థాయి పాఠశాలల్లో వందమంది విద్యార్థులకు ఒక సైకాలజిస్టు ఉంటారని.. పేద విద్యార్థులు చదివే విద్యాలయాల్లో కౌన్సెలర్లను ఎందుకు నియమించడం లేదని ప్రశ్నించారు. గురుకులాలు జైలుకన్నా దారుణంగా తయారయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో విద్యార్థులకు మెస్‌చార్జీలు పెంచుతామన్న హామీ ప్రకటనలకే పరిమితమైందని.. కొత్త ప్రభుత్వమూ అలాగే మోసం చేస్తోందన్నారు. గురుకులాల ఉద్యోగులకు వేతనాలు రాక పోవడం శోచనీయమన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖలకు మంత్రులను ఎందుకు కేటాయించలేదని ప్రశ్నించారు. డబ్బున్న శాఖలకే మంత్రులను కేటాయిస్తారా అని నిలదీశారు. ప్రభుత్వం ఆరు గ్యారంటీల హామీల కంటే సంక్షేమ గురుకులాల్లో చదివే పేద బిడ్డల ప్రాణాలకు గ్యారంటీ ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో విద్యార్థినుల వరుస ఆత్మహత్యలపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించి బాధ్యులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎంపీఎఫ్ జాతీయ కన్వీనర్ ఆర్. వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ..విద్యార్థినుల ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హతలుగానే భావించాలన్నారు. సంక్షేమ గురుకులాలు, వసతి గృహాలపై ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న బడ్జెట్, ఖర్చు చేస్తున్న నిధులపై సోషల్ ఆడిట్ జరపాలని డిమాండ్ చేశారు. ధర్నాలో బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్ ఆర్య, నాయకులు రుద్రవరం సునీల్, చరణ్ దాస్, లింగం, ప్రవీణ్ పాల్గొన్నారు.

మురళీధర్ రాజీనామాకు ఆమోదం

- కొత్త ప్రతిపాదనకు ఆదేశం .. సర్కారు జీవో జారీ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్ర సాగునీరు ఆయకట్టు అభివృద్ధి శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ సి. మురళీధర్‌రావు చేసిన రాజీనామాను సర్కారు ఆమోదించింది. ఈమేరకు సోమవారం ఆ శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా ఉత్తర్వులు జారీచేశారు. అలాగే ఈఎన్సీ జనరల్ పోస్టు నియామకానికి కొత్త ప్రతిపాదన పంపాలని ఈఎన్సీ(పరిపాలన) అనిల్‌కుమార్‌కు జీవో ద్వారా ఆదేశాలు ఇచ్చారు.

వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ నేపథ్యంలో ఈఎన్సీ జనరల్ పోస్టు భర్తీకి మరింత సమయం పట్టే అవకాశముందని ఆ శాఖ అధికారవర్గాలు చెప్పాయి.

చెరువు మీద అలిగి..!

ఆరెస్టీ



తన ప్రియ శిష్యుడైన వెంకటేశం సీరియస్‌గా ఏదో ఆలోచనలో ఉండే సరికి గిరీశానికి ఒకింత ఆశ్చర్యంతో పాటు ఆనందం కూడా కలిగింది. వాడి ఆలోచనకి కారణం ఏమైయుంటుంది చెప్మా అనుకుంటూ...

గిరీశం : "ఏమ్ వాయ్, మైడియర్ షేక్స్‌పియర్ ! " వాక్యం పూర్తి కాకుండానే

వెంకటేశం : " మీరసలు నాతో మాట్లాడకండి! " అని కఠినంగా అనే సరికి

గిరీశం : (మనసులో) వీడి తండ్రి ఏవైనా కర్ర పట్టుకుని చమ్డా లెక్కగొట్టాడా? అనుకున్నాడు. అయినా ఇప్పుడు పరీక్ష లేమీ లేవు కదా! అపుడెప్పుడో ఫెయిల్ అయిన దాన్ని ఇప్పుడెవరైనా మోసుంటారా? ఆలోచించగా దానికి దాదాపు నో చాన్స్! ముప్పూట్లా దొరుకుతున్న తిండికీ, ఠికాణాకు ఏమైనా ఎసరొస్తుందేమోనని గిరీశం గుండె వేగంగా కొట్టుకుంది. ఆ దాన్తో పాటు మళ్ళీ ఆ పూటకూళ్ళ దాని దగ్గరికి పోవాల్సి వస్తుందేమో నన్న భయమూ పట్టుకుంది. కొంపదీసి వాడక్కకి గాలం వేస్తున్నాన్న సంగతేమైనా పసిగట్టాడా అనే డౌటొచ్చినా వాడికంత నాలెడ్జీ ఎక్కడుందిలే అని తనకి తానే సమాధానం చెప్పుకున్నాడు ఈ లోపు వెంకటేశం ప్రశ్నతో ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చాడు.

వెంకటేశం : " పాజిటీవ్ అభొరెన్స్ " అంటే ఏమిటండీ?


గిరీశం : అదెవరు చెప్పారోయ్ ? సడెన్‌గా ఆ మాటకర్థం అడుగుతున్నావ్? (మనసులో) తాను బుచ్చెమ్మ వంటి యంగ్, ఇన్నోసెంట్, అన్‌ఫార్చ్యునేట్, వర్జిన్, విడోని చూసిన తర్వాత టొన్ లొసూ, డాన్సింగ్ గరల్సూ మీదా, చివరికి తనని 'యాస్'ని చేసిన మధురవాణి పై కూడా " పాజిటివ్ అభొరెన్స్" వచ్చిందని అనుకుంటూండగానే వీడొచ్చి ఆ ప్రశ్న అడిగే సరికి) నీకెవరైనా టెలిపతి నేర్పారా? అని అడిగాడు.

వెంకటేశం : టెలీపతీ లేదు! నా పిండాకూడూ లేదూ! ముందు ఆ మాటకర్థం చెప్పండి బాబూ!

గిరీశం : "అసహ్యించుకోవడం. పూర్తి స్థాయిలో అసహ్యించుకోవడం " అన్నాడు.

వెంకటేశం : హమ్మయ్య ! ఇప్పుడింకో వివరణ ఇవ్వండి. కెసిఆర్ దేన్ని బాగా అసహ్యించుకుంటున్నాడు? రేవంత్ రెడ్డినా? శాసన సభనా? ఇప్పటికి జరిగిన రెండు శాసనసభ సమావేశాలకు హాజరు కాకపోయినా,తనకు చిన్న రూము కేటాయించారనా? ఆయన " పాజిటివ్ అభొరెన్స్" దేనిపైనండీ?

గిరీశం : ఏమ్ వాయ్ ! నిన్ను సురేంద్రనాథ్ బెనర్జీ చెయ్యాలనుకుంటే భగత్‌సింగ్‌లా దేవుడి ఉనికినే ప్రశ్నిస్తున్నావ్? అయినా నువ్వడిగావు కాబట్టి చెప్తున్నాను విను. అయినా, ఇంతకు ముందొకసారి చెప్పినట్టున్నా, ఆ చేగోడీల గోల్లో పడి మరిచి పోయినట్టున్నావ్. చాలా కాలం నుండి జనం తెలంగాణ కోసం ఉద్యమించినా, చివర్లో డ్రైవింగ్ సీట్‌లో నుండి మన తాజా మాజీ గారే దిగారు. బండి చక్రం మీద కూచున్న ఈగలా తానే ఆ బండిని నడిపాననుకుంటే ఎలా అనేదే ప్రశ్న. సిద్ధాంతం ఏమీ లేక పోయినా సెంటిమెంటు చుట్టూ పోగేసిన జనంతో నెట్టుకొచ్చాడు పదేళ్ళు. ఆంధ్రజనమందర్నీ కలిపి నానా తిట్లూ తిట్టిన వ్యక్తి ఇపుడు ఆంధ్రాలో భారత రాష్ట్ర సమితి బ్రాంచాఫీసు ఓపెన్ అన్నాడు. ఆంధ్రా నుండి అదానప్రధానాలు ప్రారంభమయ్యాయి. మూడోసారి ముఖ్యమంత్రి అయితే వాడుకునేందుకు ల్యాండ్ క్రూయిజ్ కార్లు కొని విజయవాడ ఆటోనగర్‌లో భద్రపరిచిన సంగతి విని రాష్ట్రం నోరెళ్ల పెట్టింది. అధికారం బెల్లమ్ముక్క. దాని చుట్టూ మూగిన ఈగలు అధికారం అటు మారేసరికీ ఆ ఈగలూ అటుదిక్కుకే పోయాయి. 'సీజన్' మారే సరికి వలస పక్షులూ ఎవరి గూటికి వారు చేరుకుంటున్నారు. కేసీఆర్ పేరు చెబితే తెలంగాణలో గడ్డిపోచైనా గెలిచి తీరుతుందన్న భరోసా కామారెడ్డిలో అధినేతే ఓడిన తర్వాతనైనా వాస్తవ జగత్తులోకి రావాలి కదా! తాను సీయ్యెమ్మ్‌గా, 'రాజు వెడలెరవితేజములలరగ, కుడి ఎడమల డాల్‌కత్తులు మెరవగ' అంటూ వంధిమాగధులు తన భజన చేస్తూండగా, తానొక్కడే తెలంగాణలో సింహాసనానికి అర్హుడన్నట్లు ప్రవర్తిస్తే ఎలా అనేదే ప్రశ్న.



వెంకటేశం : ఇప్పటికి రెండు సెషన్స్ నుండీ సభకే రాని వ్యక్తికి "పాజిటివ్ అభొరెన్స్" దేనిపైనండీ? చిన్న రూమ్ కేటాయించారనా? 'తెల్ల కాగితా'ల్తో కొడ్తున్నారనా? కనీసం లెజిస్లేటివ్ పార్టీ సమావేశం కూడా జరపకుండానే అప్పటికి ఆసుపత్రి బెడ్ మీదున్న అధినేతనే తమ నేతగా "ఎన్నుకుని" పాదుకా పట్టాభిషేకం చేసినా ఇల్లు సర్దుకోలేకపోతున్నాననా? పార్లమెంటు ఎన్నికల ముందు ఇదే ఆఖరి సమావేశమని తెల్సినా సభకి రాకపోవడానికి కారణమేమిటి? ఆయన 'అభొరెన్స్ ' దేనిపైనండీ!?

గిరీశం : చివరాఖరికి నాకు కన్పడే సత్యమేమిటంటే జనం ఆ పార్టీని గెలిపించలేదని!

వెంకటేశం : చెరువు మీద కోపంతో... దేన్నో ఎండబెట్టుకుంటున్నట్టా?

కృష్ణా జలాలపై లాభం కలిగేలా చర్చ ఉండాలి : కడియం శ్రీహరి

కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు అన్యాయం జరిగేలా కాకుండా లాభం చేకూరేలా అసెంబ్లీలో చర్చ జరగాలని బీఆర్ఎస్ సభ్యులు కడియం శ్రీహరి సూచించారు. కృష్ణాజలాలపై చర్చ సందర్భంగా ఆయన సోమవారం అసెంబ్లీలో మాట్లాడారు. తమ నాయకుడు సభకు రాలేదని పదేపదే అనటం సరిగాదన్నారు. తాము మాట్లాడుతున్నదంతా బీఆర్ఎస్ పార్టీ తరఫుననే అని స్పష్టం చేశారు. 'ఏ ఊకోవయ్యా..ఎందుకొర్లుతున్నవ్..నీవు హోం మినిష్టర్ అయ్యేది లేదు..చచ్చేది లేదు' అంటూ మధ్యలో జోక్యం చేసుకున్న రాజగోపాల్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తున్నామని తెలిపారు. బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్‌పై పలు సూచనలు చేస్తామని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన 811 టీఎంసీలను రెండు రాష్ట్రాల మధ్య విభజించటానికి బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌కు అప్పగించిన విషయాన్ని గుర్తుచేశారు. త్వరలో మన ప్రభుత్వ వాదనలను వినే అవకాశముందని చెప్పారు. ట్రిబ్యునల్ అవార్డు ఉండగానే రాష్ట్రాలు కొత్తగా ప్రాజెక్టులు కట్టుకుంటాయనీ, నిర్మాణంలో ఉన్న, అనుమతి ఉన్న, అనుమతిలేని ప్రాజెక్టులకు క్లయిమ్ చేసుకునే అవకాశం ఉంటుందని గుర్తుచేశారు. ట్రిబ్యునల్ ముందు మన వాదనలను పెట్టాలనీ, ఎక్కువ వాటా కోసం పట్టుబట్టాలని సూచించారు. రెండు రాష్ట్రాల పంచాయతీని అడ్డం పెట్టుకుని కేంద్రం పెత్తనాన్ని తన గుప్పిట్లోకి తీసుకోవడానికి బోర్డులను ఏర్పాటు చేసిందన్నారు. త్వరగా బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ తీర్పును ఇవ్వాలనీ, నీళ్ల కేటాయింపులు చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

సార్..ఆ రెండ్రోజులు అసెంబ్లీ పెట్టొద్దు : మల్లారెడ్డి

'నాదేం లేదు సార్. ఒకటే నిమిషం సార్. సార్ సార్ ఒకటే సెకండ్. అధ్యక్షునికి విన్నపం చేస్తున్నా. ఈ నెల 14, 15 తేదీల్లో వసంత పంచమి ఉంది. ఆ రోజు 26 వేల పెండ్లీండ్లు ఉన్నాయి. దయచేసి ఆ రెండ్రోజులు అసెంబ్లీ పెట్టొద్దు సార్. ఇంతేసార్' అని బీఆర్ఎస్ సభ్యులు చామకూర మల్లారెడ్డి స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు విన్నవించారు.

గవర్నర్ వాకౌట్

చెన్నై : తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్, గవర్నర్ ఆర్.ఎన్.రవి మధ్య సంబంధాలు మరింత క్షీణించాయి. సోమవారం అసెంబ్లీ సమావేశాల నుండి గవర్నర్ రవి అర్థంతరంగా లేచి వెళ్లిపోయారు. కేంద్రాన్ని విమర్శించేలా తమిళనాడు ప్రభుత్వం సిద్ధం చేసిన ప్రసంగాన్ని చదివేందుకు ఆయన తిరస్కరించారు. మధ్యలోనే ప్రసంగాన్ని ఆపివేసి, జాతీయ గీతాన్ని ఆలపించేవరకు కూడా వేచి చూడకుండానే సభ నుండి వెళ్ళిపోయారు.

2024 సంవత్సరానికి అసెంబ్లీ సమావేశాల ప్రారంభోత్సవ ప్రసంగం చేయడం తన గౌరవంగా భావిస్తున్నానని తొలుత వ్యాఖ్యానిస్తూ కేవలం నాలుగు నిమిషాల పాటు మాత్రమే ఆయన మాట్లాడారు. తనను చదవమని డీఎంకే ప్రభుత్వం ఇచ్చిన ప్రసంగంలో కొన్ని పేరాలతో తాను ఏకీభవించలేనని, వాస్తవిక, నైతిక ప్రాతిపదికన వాటితో విభేదిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. అటువంటి ప్రసంగాన్ని తాను చదివినట్లైతే రాజ్యాంగాన్ని అపహాస్యం చేసినట్లవుతుందన్నారు. అందువల్లే ఈ సభా గౌరవాన్ని దృష్టిలో వుంచుకుని తాను ప్రసంగాన్ని ముగిస్తున్నానని చెప్పారు. ప్రజల ప్రయోజనాల కోసం, వారి మంచి కోసం ఈ సభలో ఆరోగ్యకరమైన చర్చ జరగాలని కోరుకుంటున్నా అంటూ ఆయన సెలవు తీసుకున్నారు.

సభా ప్రారంభానికి ముందుగా, తర్వాత జాతీయ గీతాన్ని ఆలపించాలని తాను చేసిన అభ్యర్ధనను అసెంబ్లీ పదే పదే నిర్లక్ష్యం చేస్తోందని గవర్నర్ పేర్కొన్నారు. జాతీయ గీతానికి తగిన గౌరవం ఇవ్వాలని కోరారు. తమిళ భాషను ప్రశంసిస్తున్న గీతాన్ని సభా ప్రారంభానికి ముందుగా ఆలపించడం, సమావేశాల ముగింపులో జాతీయ గీతాన్ని ఆలపించడం తమిళనాడులో సంప్రదాయంగా వస్తోంది.

గవర్నర్ వెళ్లిపోవడంతో ఆ తర్వాత ఆ ప్రసంగాన్ని స్పీకర్ ఎం.అప్పవు చదివి వినిపించారు. బీజేపీ ఎంఎల్ఎలతో సహా పాలక, ప్రతిపక్ష సభ్యులందరూ సమావేశం ముగిసేవరకు సభలోనే వున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పట్ల కేంద్రం అనుసరిస్తున్న విధానాలు, చర్యలను విమర్శిస్తూ ఆ ప్రసంగం సాగింది. జీఎస్టీ, చెన్నై మెట్రో రైల్ ప్రాజెక్టుకు నిధులు విడుదల చేయకపోవడం వంటి అంశాలను ప్రస్తావించింది.

పైగా తమిళనాడు పౌరసత్వ సవరణ చట్టాన్ని (సీఏఏ) అమలు చేసేందుకు అనుమతించేది లేదని ప్రభుత్వం తేల్చి చెప్పింది. దీనివల్ల భిన్నత్వంలో ఏకత్వం అన్న ఉద్దేశ్యానికే తీవ్రమైన ముప్పు ఏర్పడుతుందని వ్యాఖ్యానించింది. గతేడాది బడ్జెట్ సమావేశాల ప్రారంభంలో కూడా గవర్నర్ రవి కొన్ని పేరాలను వదిలేసి చదివారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితులు, ద్రవిడ తరహా పాలన, అంబేద్కర్, ద్రవిడ నేతలు గురించి వున్న భాగాలను ఆయన వదిలేశారు. ఈ వైఖరిని ఆనాడు స్టాలిన్ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది.

కేంద్రంపై విమర్శల హోరు !

48పేజీల ఈ ప్రసంగంలో, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో తమిళనాడు సాధించిన విజయాలతో పాటూ రాష్ట్రం పట్ల కేంద్రం అనుసరిస్తున్న వైఖరిని కూడా సవివరంగా పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో తమిళనాడులో సంభవించిన తీవ్రమైన వరదల వల్ల కలిగిన నష్టాన్ని ఎదుర్కొనేందుకు మరిన్ని నిధులు అవసరంగా వుందని కూడా ప్రభుత్వం పేర్కొంది.

రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఆర్థిక స్వయంప్రతిపత్తిని కూడా వదులుకుని, జీఎస్టీని అమలు చేయడానికి అంగీకరించాయని, రాష్ట్రాలకు తగిన నష్టపరిహారం అందుతుందని, చట్టబద్ధంగా తమకు రావాల్సిన రెవిన్యూ వస్తుందని ఆశించాయని, కానీ అలా జరగలేదని, కేంద్రం 2022 జూన్‌లో నష్టపరిహార నిబంధనలను రద్దు చేసిందని, దాంతో రాష్ట్రం ఏటా రూ.20వేల కోట్ల రెవిన్యూ లోటును ఎదుర్కొంటోందని ఆ ప్రసంగం పేర్కొంది. ఇకపై నష్టపరిహారం ఇచ్చేలా నిబంధనలు తిరిగి కొనసాగించాలని కేంద్రాన్ని కోరుతున్నామని ఆ ప్రసంగం పేర్కొంది.

చెన్నైన మెట్రో రైలు ప్రాజెక్టుకు కూడా సమానంగా ఖర్చు భరిస్తామని తొలుత ఇచ్చిన హామీ నుంచి కేంద్రం వెనక్కి మళ్ళిందని, దాంతో రెండేండ్లకు పైగా ఈ ప్రాజెక్టులో జాప్యం జరుగుతోందని విమర్శించింది. ఇటువంటి ప్రాజెక్టులకు ఇతర రాష్ట్రాల్లో అనుమతులు మంజూరు చేస్తున్నారని ఇక్కడ కూడా పూర్వం అనుకున్న రీతిలో పరిస్థితులను పునరుద్ధరించాలని కోరింది.

రాష్ట్రంలో మత సామరస్యతను పరిరక్షించాలన్నది తమ ప్రభుత్వ లక్ష్యమని, దానికే కట్టుబడి వున్నామని తమిళనాడు ప్రభుత్వం స్పష్టం చేసింది. సీఏఏను అమలు చేసే ప్రసక్తే లేదని స్పష్టం చేసింది. 2021 నుంచి ఆలస్యమవుతూ వస్తున్న జాతీయ జన గణనతో పాటూ కుల గణన కూడా చేపట్టాల్సిందిగా ముఖ్యమంత్రి స్టాలిన్, ప్రధాని మోడీకి విజ్ఞప్తి చేశారు.

పోరుసభకు పోతందుకు కాలునొప్పి లేదా?

- ప్రజాసమస్యలపై చర్చించేందుకు అసెంబ్లీకి ఎందుకు రారు!
- బీఆర్ఎస్ఎల్పీ నేత కేసీఆర్‌కు కాంగ్రెస్ సభ్యులు రాజగోపాల్‌రెడ్డి ప్రశ్న

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నల్లగొండలో మంగళవారం జరిగే పోరుసభకు పోతందుకు కాలునొప్పి లేదా? ప్రజా సమస్యల పరిష్కారంపై చర్చించే అసెంబ్లీకి రావడానికి మాత్రం కాలునొప్పి వచ్చిందా? అని బీఆర్ఎస్ఎల్పీ నేత కేసీఆర్‌ను కాంగ్రెస్ సభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రశ్నించారు. కృష్ణా జలాలు, కేఆర్ఎంబీ అంశాలపై సోమవారం అసెంబ్లీలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన తీర్మానంపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్‌కు ఎంతసేపు ముఖ్యమంత్రి సీటే కావాలా? అధికారం లేకుంటే సభకు రారా? ఇటువైపున్న సీటులో కూర్చోరా? ప్రజాస్వామ్యయుతంగా ప్రజలు అప్పగించిన ప్రతిపక్ష పార్టీ బాధ్యతను ఎందుకు నెరవేర్చడం లేదు? ప్రజాసమస్యలపై చర్చించడానికి తీరికలేకపోతే ఆ పదవి ఎందుకు? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. కారు షెడ్డుకుకాదు..గ్యారేజీకి పోయిందని ఎద్దేవా చేశారు. తాము చెప్పే మాటలనుమ బీఆర్ఎస్ సభ్యులు వింటే ప్రజలు క్షమిస్తారనీ, లేకుంటే ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వరని హెచ్చరించారు. మాజీ మంత్రి హరీశ్‌రావు చాలా కష్టపడుతారనీ, బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఇరిగేషన్ మంత్రిగా ఉన్నా.. ఆయన మామ కేసీఆర్ నిర్ణయాలకు తలొగ్గి పనిచేశారని అన్నారు. ఇప్పటికే కేసీఆర్‌ను నమ్ముకుని తెలంగాణ ఆగమైందనీ, ఆయన్ను నమ్ముకున్న హరీశ్‌రావు కండ్లు తెరిచి తమ ప్రభుత్వానికి సహకరించాలని సూచించారు. నల్లగొండ పోరు బహిరంగ సభకు వెళ్లొద్దని ఆయన్ను కోరారు. తమ ప్రభుత్వం తక్కువ ఖర్చుతో పూర్తయ్యే ప్రాజెక్టులకు తొలిప్రాధాన్యం ఇస్తోందనీ, ప్రజాధనం దుర్వినియోగం చేయబోమని స్పష్టం చేశారు. ఆర్థికంగా చితికిపోయిన రాష్ట్రాన్ని ఇప్పుడు గాడిన పెట్టాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. పదేండ్లలో తీసుకురాలేని సీడబ్ల్యూసీ అనుమతులను తాము ఆరు నెలల్లో తీసుకొచ్చి ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్తామని నొక్కిచెప్పారు. పదేండ్ల కాలంలో 10 కిలోమీటర్ల శ్రీశైలం సొరంగ మార్గానికి రూ.2 వేల కోట్లు కేటాయిస్తే 5 లక్షల ఎకరాల భూమి సాగయ్యేదన్నారు. ఉదయసముద్రం పూర్తి చేస్తే మరో లక్ష ఎకరాలు సాగయ్యేదని తెలిపారు. వీటిపై గొంతుపోయేదాకా అరిచినా గత ప్రభుత్వం చెవికెక్కలేదని విమర్శించారు. డిండి ప్రాజెక్టు కింద సేకరించిన భూములకు భూసేకరణ చట్టం ప్రకారం కాకుండా నాలుగైదు లక్షల రూపాయలిచ్చి రైతులను గత ప్రభుత్వం రోడ్డు పాలు చేసిందని విమర్శించారు. మాజీ సీఎం కేసీఆర్ తన ఫామ్‌హౌజ్‌కు నీళ్ల కోసం రింగులాగా కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టు కట్టుకున్నారని ఆరోపించారు. కుర్చీ వేసుకుని మరీ శ్రీశైల సొరంగమార్గం, శివన్నగూడెం ప్రాజెక్టులు పూర్తిచేస్తానన్నాయన్న కేసీఆర్ మళ్లీ అటువైపు చూడలేదనీ, అదే కాళేశ్వరం ప్రాజెక్టుకు వేల కోట్ల రూపాయలను ఖర్చుచేశారని విమర్శించారు.

హుక్కా పార్లర్లపై ఉక్కుపాదం

- శాసనసభ, శాసన మండలిలో నిషేధిస్తూ బిల్లు
- ఏకగ్రీవంగా ఆమోదించిన ఉభయ సభలు

నవతెలంగాణ-హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో హుక్కా పార్లర్లపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపనుంది.ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం 'సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తుల సవరణ బిల్లు -2024 'ను శాసనసభ, శాసనమండలిలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి తరపున శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఉభయ సభల్లో ఈ బిల్లును ప్రవేశ పెట్టారు. ఉభయ సభలు ఆ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదం తెలిపాయి. .ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మాట్లాడుతూ సిగరెట్ కంటే హుక్కా పొగ మరింత హానికరమని ఆందోళన వ్యక్తం చేశారు. దీని తయారీలో బొగ్గును ఉపయోగించటం వల్ల కార్బన్‌మోనాక్సైడ్ విడుదలవుతుందని తెలిపారు. హుక్కాను సేవించే వారి వల్ల చుట్టుపక్కల వారికి కూడా ప్రమాదం ఏర్పడుతుందని వివరించారు. విద్యార్థులు, యువత దీని బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సిగరెట్‌తో పోలిస్తే ఇది వంద రెట్లు ప్రమాదకరమని చెప్పారు. ఈ బిల్లుపై సభ్యులు వాణీదేవి, మహేశ్‌కుమార్‌గౌడ్, అలుగుబెల్లి నర్సిరెడ్డి, కల్వకుంట్ల కవిత, జీవన్‌రెడ్డి, భానుప్రకాశ్, తాతా మధు మాట్లాడుతూ యువతను పెడదారి పట్టిస్తున్న ఈ మహమ్మారి పట్ల కఠినంగా ఉండాలని సూచించారు. బిల్లు తేవటంతోనే సరిపెట్టొద్దనీ, దాని అమలుకు చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. కిరాణ షాపుల్లో నిత్యావసర సరుకులతోపాటు మత్తుపదార్థాలు కూడా దొరుకుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిపై తగిన విధంగా నిఘా పెట్టాలని కోరారు. పాఠశాలలు, కాలేజీల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాలనీ, ప్రకటనల ద్వారా ప్రచారం నిర్వహించాలని సూచించారు. బిల్లు తీసుకొచ్చినందుకు ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. శాసనసభ, శాసన మండలి దీనికి ఏకగ్రీవ ఆమోదం తెలిపాయి.

ఏపీ రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ కడుతుంటే...

- పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ఎందుకు కట్టలేదు? : మంత్రి జూపల్లి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్


అనుమతుల్లేకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృష్ణా నదిపై రాయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్టు కడుతుంటే..బీఆర్ఎస్ ప్రభుత్వం ఇక్కడ పాలమూరు రంగారెడ్డి పథకాన్ని ఎందుకు కట్టలేదని ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రశ్నించారు. కృష్ణా జలాలు, కేఆర్ఎంబీ అంశాలపై సోమవారం అసెంబ్లీలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన తీర్మానంపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. విభజన చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు ఎంత హక్కుందో తెలంగాణకూ అంతే హక్కు ఉంటుందనీ, బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ప్రకారం నీటికి ఎందుకు వాడుకోలేకపోయామో చెప్పాలని నిలదీశారు.

ప్రజలను మోసం చేసి..మొఖం చాటేశారు

- కేసీఆర్ నల్లగొండలో సభ పెట్టడం సిగ్గుచేటు
- ప్రాజెక్టుల పేరుతో వేల కోట్ల దోపిడీ
- అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ ప్రజలను తొమ్మిదేండ్లు మోసం చేసి, చేతగాని దద్దమ్మ మాదిరి అసెంబ్లీకి రాకుండా మొఖం చాటేసిన నీవు.. నేడు నల్లగొండలో సభ పెట్టడం సిగ్గుచేటు అని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మాజీ సీఎం కేసీఆర్‌నుద్దేశించి విమర్శించారు. సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద కాంగ్రెస్ పరిగి ఎమ్మెల్యే రాంమోహన్ రెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు బీఆర్ఎస్ సాగునీటి విషయంలో మోసం చేసిందని, పాలమూరు- రంగారెడ్డి పూర్తి చేయలేదన్నారు. రావాల్సిన నీళ్లు రాకుండా చేశారని, అందుకే వికారాబాద్ జిల్లాలో నాలుగు సీట్లలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టం కట్టారన్నారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు మాట్లాడుతూ.. గ్రావిటీతో వెళ్ళే నీటిని ఉల్టా చేసి రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని, మురళీధర్‌రావును అడ్డం పెట్టుకొని కోట్లు దండుకున్నారని ఆరోపించారు. డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్ మాట్లాడుతూ.. రాజకీయ ప్రయోజనాల కోసం కృష్ణా జలాలను ఆంధ్రప్రదేశ్‌కు తాకట్టు పెట్టారని, కేసీఆర్‌కు



ధైర్యముంటే చట్టసభకు వచ్చి మాట్లాడాలని అన్నారు. వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని అప్పుల గుదిబండగా మార్చిన ప్రాజెక్టు కాళేశ్వరం అన్నారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. అసెంబ్లీకి రాకుండా కేసీఆర్ మొఖం చాటేసి.. వారి పార్టీ ఎమ్మెల్యేలతో మాట్లాడిస్తున్నారని విమర్శించారు. ఏడు లక్షల కోట్ల రూపాయలు అప్పు చేసి.. ఉద్యోగులకు వేతనాలు ఇవ్వలేని పరిస్థితికి రాష్ట్రాన్ని తెచ్చారన్నారు. నల్లగొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలను ఎడారి చేసిన కేసీఆర్.. ముందు ముక్కు నేలకు రాసి నల్లగొండ సభకు బయలుదేరాలన్నారు. మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్యేలు బీర్ల అయిలయ్య, ఏ.లక్ష్మణ్ కుమార్, సంజీవ రెడ్డి, రాందాస్ నాయక్ ఉన్నారు.

దేశంలో ఉద్యోగాలు లేవు

ప్రజల జేబులు కొల్లగొడుతున్నారు : కేంద్రంపై రాహుల్ మండిపాటు

కార్బా (ఛత్తీస్‌గఢ్) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. దేశంలోని యువతకు ఉద్యోగాలు లేవని, ద్రవ్యోల్బణం కారణంగా ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. భారత్ జోడో న్యాయ్ యాత్రలో భాగంగా ఆయన సోమవారం ఛత్తీస్‌గఢ్‌లోని కార్బాలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టించి వారి జేబులు కొల్లగొడుతోందని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వ కుటిల యత్నాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. దేశ జనాభాలో వెనుకబడిన తరగతులు, దళితులు, గిరిజనులు 74% మేర ఉన్నారని అంటూ భారత్‌లో అగ్రస్థానంలో ఉన్న 200 కంపెనీల్లో ఏ ఒక్కటీ వారి యాజమాన్యం కింద లేదని రాహుల్ గుర్తు చేశారు. కానీ దేశంలోని సొమ్మునంతటినీ ఆ కంపెనీలకే ధారాదత్తం చేస్తున్నారని విమర్శించారు. దేశాన్ని హిందూ రాష్ట్రమని బీజేపీ పిలుస్తోందని, అయితే జనాభాలో 74% మందికి మాత్రం ఏమీ దక్కడం లేదని చెప్పారు. వారు కేవలం స్టీలు ప్లేట్లు కడగడానికి, గంట కొట్టడానికి, మొబైల్ ఫోన్లు చూపించడానికి, ఆకలితో అలమటించి చనిపోవడానికి మాత్రమే పరిమితమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుస్థితికి కేంద్రమే కారణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నాకు చెప్పండి. గత నెలలో జరిగిన రామమందిర ప్రాణప్రతిష్ట కార్యక్రమంలో మీరు పేదలు, కార్మికులు, నిరుద్యోగులు లేదా చిన్న చిన్న వ్యాపారులను చూశారా? నేను అదానీ, అంబానీ, అమితాబ్ బచ్చన్, ఐశ్వర్యారాయ్, బడా వ్యాపారవేత్తలను మాత్రమే చూశాను.

నవతెలంగాణ

ఆధునిక విప్లవాలన్నీ అధికారాన్ని హస్తగతం చేసుకోవటంతో ముగిశాయి

- ఆల్బర్ట్ కామూ

మంగళవారం 13 ఫిబ్రవరి 2024
www.navatelangana.com

సంపాదకీయం

"వ్యూహ రత్నాలు"

దేశం కోసం వివిధ రంగాల్లో విశేష సేవలందించిన విశిష్ట వ్యక్తుల గౌరవార్థం ఇచ్చే సర్వోన్నత పురస్కారం "భారతరత్న" సైతం రాజకీయాధికారానికి సోపానాలుగా మారిపోతుండటం అవాంఛనీయం. ఈసారి "భారత రత్న"ల ప్రకటనలో ఎక్కువగా ఆ వాసనలే ఉండటం ఆక్షేపణీయం. వీటిలోకి రాజకీయాలు చొరబడి చాలాకాలమే అయింది. కాకపోతే "కమలాలు" అధికారంలోకొచ్చాక "రత్నాలు" వన్నె మరింత తగ్గుతోంది.

ఈ ఏడాది ఒకేసారి అయిదుగురికి భారతరత్న ప్రకటించడంలో మోడీ ఓ పద్ధతిని కూడా అనుసరించారు. అందరి కన్నా ముందు ఇతర వెనుకబడిన కులాల వారికి 26 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన కర్పూరీ ఠాకూర్‌పేరును ప్రకటించారు. తద్వారా బీసీల, జాట్ల ఓట్లు దండుకునే ప్రయోజనాన్ని ఆశించారు. ఇది బీజేపీ 'మండల్‌' రాజకీయాలలో భాగమే. ఆ తర్వాత బీజేపీ అగ్రనేత, రామమందిర ఉద్యమం, రథయాత్ర ద్వారా బీజేపీ క్రమంగా అధికారంలోకి రావడానికి బాటలు వేసిన అద్వానీకి ప్రకటించారు. 'భూమి పూజకో, ప్రాణప్రతిష్టకో పనికిరాని 'పెద్ద మనిషిని' రత్నంతో సరిపుచ్చారు. వారం గడవక ముందే మాజీ ప్రధాన మంత్రులు పీవీ.నరసింహారావు, చౌదరి చరణ్‌సింగ్‌, వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.ఎస్‌.స్వామినాథన్‌లకు కూడా భారత రత్న ప్రకటించారు. తెలంగాణ బిడ్డ పీవీకి గౌరవం ఇచ్చిన పేరుతో తెలుగువారందరినీ, హరితవిప్లవ పితామహుడు స్వామినాథన్‌, చరణ్‌సింగ్‌ల పేరుతో రైతుల ఓట్లను కొల్లగొట్టడానికే అనేది స్పష్టం.

ప్రతిదీ రాజకీయ కోణంలోనే చూడకూడదన్నది నిజమేగానీ, ఇందులో రాజకీయాలు తప్ప మరో కోణమే కనిపించడంలేదన్నది అంతకన్నా నిజం...! అసలు వీటి ప్రకటనలోనే విచిత్రమైన రాజకీయ పరిణామాలకు దారితీసిన సందర్భాలూ ఉన్నాయి. కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న



ఇచ్చిన వెంటనే దాదాపు అదే భావధారకు చెందిన బీహార్‌ సీఎం నితీశ్‌ ఆర్జేడీ చేయి వదిలి మరోసారి ఎన్డీఏ గూటికి చేరారు. చౌదరీ చరణ్‌సింగ్‌ రైతు పక్షపాతి కనక ఈ సత్కారం అందజేస్తున్నామని మోడీ చెబుతున్న మాటల వెనుక ఆంతర్యం మాత్రం ఆర్‌ఎల్‌డీని ఎన్డీఏలోకి లాగేందుకే అనేది స్పష్టం. ఇంతకాలం అఖిలేశ్‌ యాదవ్‌తో జత కట్టిన జయంత్‌సింగ్‌ తాతకు భారతరత్న దక్కడమే మహాదానందం అన్నట్టు మోడీకి 'జీ హుజూర్‌' అనేందుకు సిద్ధమనే సంకేతాలిచ్చారు. పీవీకి భారతరత్న ఇవ్వడం ద్వారా అటు తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌ను, పీవీ శతజయంతిని అధికారికంగా చేసి, ఆయన విగ్రహం పెట్టి, ఆయన బిడ్డను ఎమ్మెల్సీని చేసి రాజకీయ లబ్దిపొందిన కేసీఆర్‌ (బీఆర్‌ఎస్‌)ను ఇరుకున పెట్టడానికే. సార్వత్రిక ఎన్నికల ముందు ప్రజానీకాన్ని ప్రభావితం చేయడానికి ఉపకరిస్తుంది.

రాజకీయ దృక్కోణంతో చూస్తేనే కొన్ని విషయాలు బోధపడతాయి. గతంలోనూ కాంగ్రెస్‌ అసమ్మతి గ్రూప్‌ నాయకుడైన గులాంనబీ అజాద్‌కు పద్మభూషణ్‌ ఇచ్చి కాశ్మీర్‌లో కాషాయ ప్రయోజనాలకు అతడినో పావుగా మార్చిన సంగతి తెలిసిందే. బాబ్రీ విధ్వంసానికి కారకుల్లో ఒకరైన కళ్యాణ్‌సింగ్‌కు పద్మవిభూషణ్‌ ప్రకటించడం.. ఇప్పుడు దానికి కొనసాగింపే ఈ భారతరత్నాలు అన్న అభిప్రాయాలు సర్వత్రా వెల్లువెత్తడంలో ఆశ్చర్యమేముంటుంది? అప్పుడు ప్రణబ్‌ముఖర్జీ, ఇప్పుడు పీవీలకు ఇవ్వడం ద్వారా కాంగ్రెస్‌ను దెబ్బతీయాలన్నది బీజేపీ కుచిత రాజకీయం. పీవీ హయాంలోనే బాబ్రీ మసీదు కూల్చివేత జరగడం, రామమందిర నిర్మాణంతో ఆ వివాదం ముగియడం కూడా ప్రధాని మనసులో ఉంటుంది. కానీ, ఒక ప్రభుత్వాధినేతగా దేశభద్రతను గాలికొదిలి, తన రాజకీయ ప్రయోజనాల కోసం పోలీసుల చేతులు కట్టేసి, కరసేవకుల మసీదు కూల్చివేతకు పరోక్షంగా అవకాశం కల్పించినవాడికి ఇంతటి సర్వోన్నత పురస్కారమివ్వడమేమిటి? అన్న వాదనలు వినిపిస్తున్నాయి.

ఎవరికి ఎందుకు భారతరత్న ఇచ్చారో అన్న విషయంలో మోడీ ఎన్ని కబుర్లు చెప్పినా సార్వత్రిక ఎన్నికలలో ఓటమి భయమో లేక "అబ్కీ బార్‌ 400 పార్‌" అన్న నినాదం సఫలం కాదనే కించిత్తు అనుమానమో కానీ, టోకున ఇచ్చిన ఈ పురస్కారాల వెనుక ఆయన రాజకీయ ప్రయోజనాలు, ఎన్నికల్లో లబ్ధిపొందాలన్న లక్ష్యమూ అడుగడుగునా కనిపిస్తున్నాయి. ఏ అంశాన్ని అయినా ఎన్నికల దృష్టిలో చూడగలిగిన చక్షువులు మోడీకి ఉన్నాయి. పనిచేసి జనం మద్దతు సంపాదించడం కన్నా జనాన్ని ఆశ్చర్యచకితుల్ని చేసి ప్రయోజనం పొందడంలో వీరిని మించినవారు ఎవరుంటారు గనక! రాజస్థాన్‌, పశ్చిమ ఉత్తర ప్రదేశ్‌, హర్యానాలలో రైతుల్లో మోడీ ప్రభుత్వంపై వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తోంది. కనకే చరణ్‌సింగ్‌, వ్యవసాయ శాస్త్రజ్ఞుడైన స్వామినాథన్‌లకు ఈ సత్కారం దక్కింది. మొత్తంగా మోడీ భారత రత్న సత్కారాన్నే తాయిలంగా మార్చేశారు. మాజీ ఉపరాష్ట్రపతి "ఎం.వెంకయ్య నాయుడు", ప్రముఖ సినీనటుడు "చిరంజీవి"లను పద్మాలంకృతలను చేయడం కూడా మోడీ విరచిత స్కీం'లో భాగమే! ముందే చెప్పుకున్నట్టు పురస్కారాల్లో రాజకీయాలు ఈ దేశానికి కొత్తేమీకాదు గానీ, వీటిని సైతం ఎన్నికల ప్రయోజనాలకు వాడుకోవడం మోడీ ఏలుబడిలో పరిపాటిగా మారింది. ఈ ఎంపికలో బీజేపీ మార్క్‌ రాజకీయాలు స్పష్టంగా కనిపిస్తుండటం కాదనలేని సత్యం.

> ఎవరికి ఎందుకు భారతరత్న ఇచ్చారో అన్న విషయంలో మోడీ ఎన్ని కబుర్లు చెప్పినా సార్వత్రిక ఎన్నికలలో ఓటమి భయమో లేక "అబ్కీ బార్‌ 400 పార్‌" అన్న నినాదం సఫలం కాదనే కించిత్తు అనుమానమో కానీ, టోకున ఇచ్చిన ఈ పురస్కారాల వెనుక ఆయన రాజకీయ ప్రయోజనాలు, ఎన్నికల్లో లబ్ధి పొందాలన్న లక్ష్యమూ అడుగడుగునా కనిపిస్తున్నాయి. ఏ అంశాన్ని అయినా ఎన్నికల దృష్టిలో చూడగలిగిన చక్షువులు మోడీకి ఉన్నాయి. పనిచేసి జనం మద్దతు సంపాదించడం కన్నా జనాన్ని ఆశ్చర్యచకితుల్ని చేసి ప్రయోజనం పొందడంలో వీరిని మించినవారు ఎవరుంటారు గనక!



మొక్క-నిరీక్షణ!

మొన్నటి వానకిది
కొత్త చిగుళ్ళతో మారాకు వేసింది
నిన్నటి చిరు మొగ్గలు
పూలై నవ్వుతున్నాయి.

దీని ఆకులన్నీ
కండ్లలా నన్నే చూస్తాయి
నా రాక కోసం
నిలువెత్తు పచ్చదనాన్ని నింపుకొని
ఆరుబయటే
అమ్మలా నిరీక్షిస్తుంటాయి

కాసిన్ని నీళ్లు చిలకరిస్తానా
చాక్లెట్‌ ఇచ్చినప్పటి
మా బుజ్జి మనవడి లాగే కేరింతలు
కొడుతుంది

రాత్రి నిశ్శబ్దంగా నిద్రిస్తూనే..
తెల్లారే లోగా పువ్వులనే కాదు
నాకు నవ్వులనూ ప్రసాదిస్తుంది

ఈ మొక్క భాష నేను బాగా
ఎరుగుదును..
బయట పడదు గానీ,
నాలాగే దీనికీ
లోలోన బలీయమైన ఉద్వేగాలు
మిట్ట మధ్యాహ్నం చూడాలి
మాట్లాడేందుకు నేనుండనని
చిన్నగా కునుకు తీస్తూంటుంది

ఈ కుసుమ కోమల
హరిత సుందరి మా ఇంటికి వచ్చాకే
మా కుటీరమ్‌
వెన్నెల పూలూ వెలుగు ముచ్చట్లతో
నిండిపోయింది.!

అన్నట్టిది..
నిరుటి నా పుట్టినరోజున
నన్నూ నా మనసును చదివిన
ఓ జిగిరీ దోస్త్‌
ఏరి కోరి నాకు బహూకరించింది..!
ఇప్పుడది నన్నే ప్రేమిస్తూ
నాతో భాషిస్తూ
నా నిండా నిండిపోయింది.!

- నాంపల్లి సుజాత, 9848059893

కేంద్ర బడ్జెట్‌ - తిరగబడిన తర్కం



ప్రభాత్‌ పట్నాయక్‌



మోడీ ఏం చెప్తే అదే సత్యం అన్నది బీజేపీ విధానం. ఒకవేళ మోడీ చెప్పినది తప్పు అని నిర్ధారించే ఆధారాలు ఏమైనా ఉంటే అటువంటివి తప్పుడు ఆధారాలై వుండాలి. కనుక వాటిని కప్పిపుచ్చాలి. తన పదేండ్ల పాలనలో ఉన్నంత గొప్పగా భారత దేశం గతంలో ఏనాడూ లేదని మోడీ చెప్తున్నారు. కాని అధికారిక గణాంకాలు దానికి భిన్నంగా ఉన్నాయి. కాబట్టి ఆ గణాంకాలు తప్పు అని, అసలు గణాంకాలను సేకరించే విధానాన్నే మార్చాలని బీజేపీ అంటోంది. మూడవ ప్రపంచ దేశాల్లోకెల్లా పేరు గాంచిన గణాంక వ్యవస్థ మనది. పి.సి. మహల్‌నోబిస్‌ రూపొందిన జాతీయ శాంపిల్‌ సర్వే విధానం మనకుంది. ఎంతో కృషి చేసి శ్రద్ధతో రూపొందించిన గణాంక వ్యవస్థను ప్రస్తుత ప్రభుత్వం ధ్వంసం చేస్తోంది. 2011-12తో పోల్చినప్పుడు 2017 - 18లో గ్రామీణ ప్రజల తలసరి వినియోగం అన్ని విధాలా తీవ్రంగా పడిపోయిందని శాంపిల్‌ సర్వే వెల్లడించింది. అందుకు ఏకంగా ఆ సర్వే ఫలితాలను తొక్కిపెట్టారు. మనకి స్వాతంత్య్రం రాకముందు నుంచీ దేశంలో జనాభా లెక్కల సేకరణ ప్రతీ పదేళ్ళకోమారు జరుగుతోంది. మోడీ చెప్పేవన్నీ వట్టి డాబులేనని ఆ జనాభా లెక్కలు ఎక్కడ బయట పెట్టేస్తాయో అన్న భయంతో ఆ జనాభా లెక్కల ప్రక్రియనే నిలిపివేశారు. నిరుద్యోగాన్ని లెక్కించేటప్పుడు వేతనం లేని పనిని కూడా నిరుద్యోగంగానే పరిగణించాలని ఐఎల్‌ఓ ప్రకటించింది. దానిని అనుసరిస్తే దేశంలో నిరుద్యోగం ఎంత తీవ్ర స్థాయిలో ఉందో బయట పడుతుంది. అందుచేత ఐఎల్‌ఓ విధానాన్ని పక్కన పెట్టేశారు.

> మోడీ ప్రవచించిన "సత్యం" కారణంగా ఈ బడ్జెట్‌ ఎందుకూ కొరగాకుండా పోయింది. అలాగాక, ఏ దేశమైనా ప్రజల వాస్తవ పరిస్థితులను గనుక బడ్జెట్‌ పరిగణనలోకి తీసుకుని వున్నట్టైతే అది ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి చర్యలు తీసుకుని వుండేది. నేరుగా ప్రజలకు నగదు బదిలీ చేయడం కాని, కనీస వేతనాల స్థాయిని పెంచి చట్టబద్ధంగా అమలు చేయడం కాని ప్రతిపాదించి వుండేది. ఈ రెండింటిలో రెండూ కాని, ఏ ఒక్కటి కాని చేసినా ప్రజలకు నేరుగా ప్రయోజనాలు లభి స్తాయి. అంతేగాక దేశ ఆర్థిక వ్యవస్థకు ఒక ఊపు వచ్చి వుండేది. మార్కెట్‌ బలపడి, ప్రయివేటు పెట్టుబడులు పెరిగి, ఉపాధి అవకాశాలు కూడా పెరిగివుండేవి.

వాస్తవానికి వేతనం లేని పని మాత్రమే కాదు. వేతనం చెల్లించే పనుల్లో కూడా అన్ని రకాల పనులనూ ఉపాధిగా లెక్కించ కూడదు. 1930 దశకంలో మహా మాంద్యం నెలకొన్న కాలంలో బ్రిటన్‌లో చాలామంది నిరుద్యోగులు రోడ్ల పక్కన బూట్లు పాలిష్‌ చేయడానికి తయారయ్యారు. వారేమీ ఆ పనిని ఉచితంగా చేయలేదు. కాని అలాంటి వారినందరినీ ఉద్యో గులుగా లెక్కిస్తే నిరుద్యోగం అంత సంక్షోభ కాలంలో కూడా చాలా తక్కువ స్థాయిలో ఉన్నట్టే నిర్ధారణ వస్తుంది. ఇటువంటి తరహాను "ప్రచ్ఛన్న నిరుద్యోగులు"గా పరిగణించారు. అయితే ఆనాటి సమాజం సంక్షోభాన్ని తీవ్రమైన విషయంగా పరిగణిం చింది. బాధాకరమైనది ఏమంటే ప్రస్తుతం దేశంలో పాలకులు సంక్షోభాన్ని కూడా తీవ్రమైన విషయంగా పరిగణించడంలేదు.

ఒకవేళ మోడీ కొట్టుకునే సెల్ఫ్‌ డబ్బాయే వాస్తవం అయితే బడ్జెట్‌ గతంలో చెప్పినదాన్నే మళ్ళీ చెప్పడం అన్నది ఆశ్చ ర్యం కలిగించదు. ఈ బడ్జెట్‌ నిరుద్యోగాన్ని మరింత పెంచుతుంది. శ్రామిక ప్రజలను మరింత దారిద్ర్యంలోకి నెడుతుంది. సమా జంలో ఇప్పటికే వికృత రూపం దాల్చుతున్న ఆర్థిక అసమానతలను మరింత పెంచుతుంది. కాని ఈ వాస్తవాలను ప్రభుత్వం ఒప్పుకోదు. మీడియాలో ఉన్న భజంత్రీలూ ఒప్పుకోరు. ఎందుకంటే, వారి నాయకుడు అటువంటి సమస్యలేవీ లేనేలేవని ప్రకటించారు కదా! ఫిబ్రవరి 1న పార్లమెంటులో ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌ ఈ సంగతిని స్పష్టం చేసింది. ఆర్థిక మంత్రి ప్రసంగాన్ని చూద్దాం. సగటు నిజ ఆదాయాలు 50 శాతం పెరిగాయని ఆమె ప్రకటించారు. బహుశా గత దశా బ్దంతో పోల్చి ఆమె చెప్పి వుండాలి. కాని ఆమె చెప్పినది తలసరి ఆదాయం గురించి. అంతే తప్ప దేశంలో అత్యధిక సంఖ్యాకుల ఆదాయాల గురించి మాత్రం కాదు. జాతీయ సగటు ఆదాయం పెరిగింది కాబట్టి దేశంలో అందరి ఆదాయాలూ పెరిగినట్టే అని, దేశ ఆర్థిక పరిస్థితి చాలా బాగుందని ఆమె చెప్పుకోవడంలో మేధో పరమైన నిజాయితీ లోపించింది.

2011-12, 2017-18ఏండ్ల మధ్యకాలంలో దేశంలో పౌష్టికాహార లేమి పెరిగింది. ముఖ్యంగా గ్రామీణ భారతంలో రోజుకు కనీసం 2200 కేలరీల శక్తినిచ్చే ఆహారాన్ని పొందలేని జనాభా (గ్రామీణ ప్రాంతంలో పేదరికాన్ని నిర్ధారిం చేందుకు ప్రణాళికా సంఘం నిర్ధారించిన ప్రమాణాల ప్రకారం) 68 శాతం నుండి 80 శాతానికి పెరిగింది. మరి ఈ కాలంలో దేశంలో అత్యధికుల ఆదాయాలు మెరుగుపడ్డాయని ఏ ప్రాతిపదికన చెప్తున్నారు? ఈ కాలంలో దేశంలో ఏం జరిగిందనేది ఇక్కడ పరిశీలించడం ముఖ్యం. ప్రజలు చేసే వినిమయాన్ని అంచనా వేయడానికి గతంలో జాతీయ శాంపిల్‌ సర్వే ఐదేళ్ళకోమారు గణాంకాలు సేకరించేది. ఇప్పుడు దానికి స్వస్తి చెప్పారు. కాని కొన్ని ఇతర గణాంకాల ఆధారంగా మనం కొన్ని నిర్ధారణలకు రావచ్చు. వాటిలో ఒకటి గ్రామీణ ప్రాంతాల్లో వాస్తవ ఆదాయాలకు సంబంధించి గత ఐదేండ్ల డేటా. వ్యవసాయ పనుల్లో గాని, వ్యవసాయేతర పనుల్లో గాని ఉన్నవారి నిజ ఆదాయాలు గత ఐదేండ్లలోనూ పడిపోయాయి. పట్టణ ప్రాంతాల్లో సైతం అదే పరిస్థితి ఉండే అవకాశాలున్నాయి. ఆయా నిర్ణీత వ్యవధుల్లో నిర్వహించే శ్రామిక సర్వే (పీరియాడిక్‌ లేబర్‌ ఫోర్స్‌ సర్వే) తాజా వివరాల ప్రకారం దేశం మొత్తం మీద, అటు పట్టణాల్లో గాని, ఇటు గ్రామాల్లోగాని సగటు నెలవారీ ఆదాయాలు 2017-18కి, 2022-23కి మధ్య 20 శాతానికి పైగా పడిపోయాయి! అంటే 2017-18 తర్వాత నిజ ఆదాయాలు పడిపోతున్నాయనేది నిస్సందేహం.

స్వాతంత్య్రం వచ్చినది మొదలు ఎన్నడూ లేనంత తీవ్ర స్థాయిలో నేడు నిరుద్యోగం ఉంది. సిఎంఐఇ (సెంటర్‌ ఫర్‌ మోనిటరింగ్‌ ది ఇండియన్‌ ఎకానమీ) ప్రకారం దేశంలో ఉన్న ఉద్యోగాల సంఖ్యలో గత ఐదేండ్లలో నికరమైన పెరుగుదల ఏమీ లేదు. ఒకపక్క నిజ వేతనాలు పడిపోతూ, మరొక పక్క ఉద్యోగాల సంఖ్యలో పెరుగుదల లేకపోవడం చూస్తే శ్రామికులుగా పనిచేస్తున్న వారి తలసరి నిజ ఆదాయాలు పడిపోతున్నట్టు స్పష్టమవుతోంది. శ్రామికుల ఆదాయాలు తరిగిపోతున్నప్పుడు రైతుల, కూలీల ఆదాయాలు వేరే దిశలో ఎలా ఉంటాయి? రైతుల ఆదాయాలు పెరిగితేనే డిమాండ్‌ పెరుగుతుంది. అప్పుడు అదనంగా కార్మికులు అవసరమౌతారు. దాని వలన ఉపాధి అవకాశాలు బాగా పెరుగుతాయి. పైగా కార్మికుల నిజ వేతనాలు కూడా పెరుగుతాయి. ఇప్పుడు కార్మికుల నిజ వేతనాలు పడిపోతున్నాయంటే దానిని బట్టి రైతుల, కూలీల ఆదాయాలు కూడా పడిపోతు న్నాయని - అంటే మొత్తం శ్రామిక ప్రజలందరి ఆదాయాలూ (వ్యవసాయ, వ్యవసాయేతర కూలీలు, రైతులు, చిన్న ఉత్పత్తి దారులు) గత ఐదేండ్లలో పడిపోయాయని నిర్ధారణ అవుతోంది. దేశ జనాభాలో ఈ శ్రామిక ప్రజలే అత్యధిక భాగం. అంటే దేశ జనాభాలో అత్యధిక భాగం గత ఐదేండ్ల కాలంలో దిగజారిన జీవన పరిస్థితులను అనుభవిస్తున్నారన్నది తిరుగులేని సత్యం. 2011-12 నుంచి 2017-18 మధ్య కాలంలో వీరి వినిమయం బాగా పడిపోయిందని ధ్రువపరిచే గణాంకాలను కూడా దీనికి తోడు చేస్తే శ్రామిక ప్రజల దుర్భర జీవితాలు మనకి దర్శనమిస్తాయి.

ఈ కారణంగానే మోడీ హయాంలో ప్రయివేటు పెట్టుబడులు ఎదుగుదల లేకుండా స్తంభించిపోయాయి. బడా పెట్టుబడిదారులకు, అందునా ఎంపిక చేసిన కొద్దిమంది క్రోనీ పెట్టుబడిదారులకు బీజేపీ ప్రభుత్వం ఎంత కొమ్ముగాసినా, ఇదే పరి స్థితి. ఇక ప్రయివేటు చిన్న పెట్టుబడిదారుల పెట్టుబడులూ స్తంభించిపోయాయి. లేదా తరిగిపోయాయి. పెద్ద నోట్ల రద్దు, జిఎస్‌ టి అమలు, నిరంకుశమైన లాక్‌డౌన్‌లతో ఈ రంగం నడుము విరిగిపోయింది. కార్పొరేట్‌ సంస్థల లాభాలలో పెరుగుదల ఉన్నా, వారి పెట్టుబడులలో మాత్రం స్తంభనే కొనసాగుతోంది. తనకు వచ్చిన లాభాలను బట్టి కాకుండా, మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌ను బట్టి పెట్టుబడులు పెట్టడం జరుగుతుందన్నది వాస్తవం.

అయితే పెట్టుబడుల వ్యయం ఏటికేడూ పెరుగుతోందని ప్రభుత్వం వాదించవచ్చు. తన బడ్జెట్‌ ప్రసంగంలోనూ ఆర్థిక మంత్రి ఇదే వాదన చేశారు. ఇలా పెరగడం వలన ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రయివేటు పెట్టుబడిదారులకు కావలసిన మార్కెట్‌ విస్తరణ జరుగుతుందని, అప్పుడు వారినుండి పెట్టుబడులు కూడా పెరుగుతాయని ఆ వాదన అంటుంది. అయితే ఇక్కడ జరిగిందేమంటే ప్రభుత్వం వైపు నుండి పెరిగిన పెట్టుబడుల వ్యయం ప్రభావం దేశీయ మార్కెట్‌లో కన్నా అంతర్జాతీయ మార్కెట్‌లో ఎక్కువగా వ్యక్తమవుతోంది. అందుచేత దేశీయ మార్కెట్‌లో పెట్టుబడుల పెరుగుదల లేదు. ఇక ప్రభుత్వం అను సరిస్తున్న వ్యూహంలోని మరో భాగం ప్రభుత్వరంగ బ్యాంకుల ద్వారా ప్రయివేటు పెట్టుబడిదారులకు భారీగా రుణాలివ్వడం. ఇలా రుణాలు పొందినవారిలో క్రోనీ పెట్టుబడిదారులు కూడా ఉన్నారు. "మౌలిక వసతుల కల్పన రంగం" లో పెట్టుబడులు పెట్టడానికి గాను వారికి ఈ రుణాలు ఇస్తున్నట్టు ప్రభుత్వం చెప్తోంది. దీని పర్యవసానంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల దగ్గర పాత బకాయిలు పెద్ద మొత్తాల్లో పేరుకుపోయాయి. అంటే ప్రయివేటు పెట్టుబడిదారులు తీసుకోవలసిన రిస్క్‌ను ప్రభుత్వ రంగ బ్యాంకులు తీసుకోవలసి వస్తోందన్నమాట. ఇలా రిస్క్‌ తీసుకున్నా, ఆ పెట్టుబడులలో అధిక భాగం విదేశీ మార్కెట్‌లోని డిమాండ్‌ను పెంచడానికే దోహదపడుతోంది.

మోడీ ప్రవచించిన "సత్యం" కారణంగా ఈ బడ్జెట్‌ ఎందుకూ కొరగాకుండా పోయింది. అలాగాక, ఏ దేశమైనా ప్రజల వాస్తవ పరిస్థితులను గనుక బడ్జెట్‌ పరిగణనలోకి తీసుకుని వున్నట్టైతే అది ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి చర్యలు తీసుకుని వుండేది. నేరుగా ప్రజలకు నగదు బదిలీ చేయడం కాని, కనీస వేతనాల స్థాయిని పెంచి చట్టబద్ధంగా అమలు చేయడం కాని ప్రతి పాదించి వుండేది. ఈ రెండింటిలో రెండూ కాని, ఏ ఒక్కటి కాని చేసినా ప్రజలకు నేరుగా ప్రయోజనాలు లభి స్తాయి. అంతేగాక దేశ ఆర్థిక వ్యవస్థకు ఒక ఊపు వచ్చి వుండేది. మార్కెట్‌ బలపడి, ప్రయివేటు పెట్టుబడులు పెరిగి, ఉపాధి అవకాశాలు కూడా పెరిగి వుండేవి.


> మోడీ హయాంలో ప్రయివేటు పెట్టుబడులు ఎదుగుదల లేకుండా స్తంభించిపోయాయి. బడా పెట్టు బడిదారులకు, అందునా ఎంపిక చేసిన కొద్దిమంది క్రోనీ పెట్టుబడిదారులకు బీజేపీ ప్రభుత్వం ఎంత కొమ్ముగాసినా, ఇదే పరి స్థితి. ఇక ప్రయివేటు చిన్న పెట్టుబడిదారుల పెట్టుబడులూ స్తంభించిపోయాయి. లేదా తరిగిపోయాయి. పెద్ద నోట్ల రద్దు, జిఎస్‌ టి అమలు, నిరంకుశమైన లాక్‌డౌన్‌లతో ఈ రంగం నడుము విరిగిపోయింది. కార్పొరేట్‌ సంస్థల లాభాలలో పెరుగుదల ఉన్నా, వారి పెట్టుబడులలో మాత్రం స్తంభనే కొనసాగుతోంది. తనకు వచ్చిన లాభాలను బట్టి కాకుండా, మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌ను బట్టి పెట్టుబడులు పెట్టడం జరుగుతుందన్నది వాస్తవం.

కాని మన పాలకులకు అటువంటి విధానాలు నిషిద్ధం. నిజానికి దానికి పూర్తి వ్యతిరేక దిశలో నడుస్తున్నారు. ఆహారం, ఎరువులు, ఇంధనం మీద ఇచ్చే సబ్సిడీని రూ.4.13 లక్షల కోట్ల నుండి రూ.3.81 లక్షల కోట్లకు తగ్గించారు. ఉపాధి హామీ పథకానికి కేటాయింపులు ఏ మాత్రం పెంచలేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మాదిరిగానే రూ.86,000 కోట్లకే పరి మితం చేశారు. ఈ విధంగా చేయడం "ఆర్థిక విజ్ఞత"ను సూచిస్తోందని భజంత్రీ మీడియా మెచ్చుకుంది. ఇటువంటి "ఆర్థిక విజ్ఞత"ను ప్రదర్శించినందువలన విదేశీ పెట్టుబడులు బాగా తరలి వస్తాయని ప్రభుత్వం కూడా చెప్పుకుంటోంది. అందువలన మన వృద్ధిరేటు ఇంకా పెరుగుతుందని కూడా చెప్తోంది. మన "ఆర్థిక విజ్ఞత" ఎంత గొప్పగా ఉన్నా మన క్రెడిట్‌ రేటింగ్‌ (ఆర్థిక స్తోమతను అంచనా వేసే రేటింగ్‌) మాత్రం చాలా హీనంగానే కొనసాగుతోంది. ఇండోనేషియా కన్నా ఒక మెట్టు దిగువన, థాయ్‌ లాండ్‌ కన్నా రెండు మెట్లు దిగువన మనం ఉన్నాం. జంక్‌ బాండ్లు (దివాలా ఎత్తిపోయిన కంపెనీల వాటాలకు సంబంధించినవి) కన్నా ఒక్క మెట్టు మాత్రమే మనం పైన ఉన్నాం. అంటే అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడికి మన "ఆర్థిక విజ్ఞత" అంతగా రుచించలేదన్న మాటేగా!

(స్వేచ్ఛానుసరణ)

చైనా యాప్‌లపై.. అదానీ కోసం..!

సంగిరెడ్డి హనుమంతరెడ్డి
9490204545



మన పాలకులు అమెరికా ఉచ్చులో పడి అమెరికాకు నచ్చని దేశాలతో తగవులు పెట్టుకుంటున్నారు. వాణిజ్య చట్టాలను, మార్కెట్‌ నిబంధనలను ఇష్టానుసారం, అపారదర్శకంగా అమలు చేస్తున్నారు. విదేశీ, ప్రత్యేకించి చైనా వ్యాపారాలపై కక్షకట్టారు. అంతర్జాతీయ వ్యాపార నిబంధనలను,చట్టాలను పక్షపాత ధోరణితో చూస్తున్నారు. ఉదాహరణకు మనీలాండరింగ్‌ ఆరోపణలపై చైనా స్మార్ట్‌ఫోన్‌ తయారీ సంస్థ వివో ఇండియా శాఖలో ఇద్దరు వరిష్ట ఉద్యోగులను భారత నేర నిరోధక సంస్థ 23డిసెంబర్‌2023న అరెస్టు చేసింది. అదాని కుంభకోణాన్ని వదిలేసింది. ఏ షరతులు విధించకుండా, పార్లమెంటులో చర్చించకుండా మనం ఆమోదించిన ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనల ప్రకారం దాని సభ్య దేశ వాణిజ్య సంస్థలను మరొక సభ్య దేశం ఆమోదించి తీరాలి. కమ్యూనిస్టు వ్యతిరేకులైన నేటి మన పాలకులు కమ్యూనిస్టులు పాలిస్తున్న చైనా వాణిజ్య సంస్థలను దొడ్డిదారిన అడ్డుకుంటున్నారు. తానే పట్టుపట్టి స్థాపించిన ప్రపంచ వాణిజ్య సంస్థను అమెరికా నిరుత్సాహపరుస్తోంది. ఈ సంస్థ ద్వారా అమెరికా ప్రయోజనాలు తగ్గడం, ఆ సంస్థపై చైనా పట్టు సాధించడం దీనికి కారణాలు. ఈ పేలవ వ్యాపార వాతావరణంతో విశ్వవిపణిలో ఇండియా అపఖ్యాతి పాలయింది.

వివో భారతీయ నేర నిరోధక సంస్థ ఆరోపణలను తీవ్రంగా ఖండించింది. "భారత అధికారుల ప్రస్తుత చర్యతో మేము తీవ్రంగా ఆందోళన చెందుతున్నాము. ఇటీవలి అరెస్టులు నిరంతర వేధింపులకు నిదర్శనలు." అని వివో ప్రతినిధి అన్నారు. ఇండియాలో వివో ఇలాంటి చట్టపర సవాళ్లను ఎదుర్కోవడం ఇదే మొదటిసారి కాదు. నాలుగునెల్ల క్రితమే వివోఇండియాశాఖకు చెందిన ఒక చైనా దేశీయునితో సహా నలుగురు కార్యనిర్వాహక అధికారులను ఇలాంటి అవాస్తవ ఆరోపణలపై భారత ఎన్‌ఫోర్స్‌మెంట్‌ డైరెక్టరేట్‌ అరెస్టుచేసింది. మన ప్రధాని చైనాకు వ్యతిరేకంగా అమెరికా అనుకూల సంస్థల్లో భాగస్వామి అయ్యారు. పెట్టుబడులు పెట్టారు.ఆ సంస్థలు చైనా సాంకేతిక, వాణిజ్య అభివృద్ధిని ఇండోపసిఫిక్‌ దేశాల్లో అడ్డుకోవడానికేనని అమెరికా బహిరంగంగానే ప్రకటిం చింది. అలాంటి లక్ష్యాలతోనే స్థాపించిన 13 దేశాల ఇండోపసిఫిక్‌ అభివృద్ధి ప్రణాళికలో కూడా మన దేశాన్ని చేర్చారు.

ఈ ఇండియా దుశ్చర్యలకు చైనా వేరే దారిలో స్పందించింది. 2020జూన్‌లో ఘోర సరిహద్దు సంఘర్షణ జరిగింది. ఇరువైపులా సైనికులు చనిపోయారు. ఈ సంఘటన తర్వాత ఇండియాచైనాతో దౌత్య చర్చలు జరుపలేదు. చైనా చర్యలకు విరుద్ధంగా అంతర్జాతీయ వేదికలనువినియోగించలేదు. తన సరిహద్దు వివాదాన్ని వ్యాపార రంగానికి విస్తరించాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. బహిరంగంగానే చైనా వ్యాపారాలు, పెట్టుబడులను లక్ష్యంగా చేసుకుంది. భారతదేశ భద్రత, పౌర శాంతికి ముప్పు కలిగిస్తాయన్న అవాస్తవ కారణాలతో టిక్‌టాక్‌, డజన్ల కొద్దీ ఇతర చైనా యాప్‌లను నిషేధించింది. ఈ అసమంజస కారణాలతోనే ఇండియాలో పని చేస్తున్న ప్రధాన చైనా కంపెనీలపై దాడులు చేయించింది. టెలి కమ్యూనికేషన్స్‌ పరికరాల దిగ్గజం హువాయిపై పన్ను ఎగవేత పేరుతో దర్యాప్తు, చట్టవిరుద్ధ విదేశీ మారక ద్రవ్య బదిలీల సాకుతో స్మార్ట్‌ఫోన్‌ కంపెనీ జియావొమి నుండి 72.5 లక్షలడాలర్ల సొమ్ము స్వాధీనంవీటిలో ముఖ్యమయినవి. ఈ రెండు సంఘటనలు 2022లో జరిగాయి. ఇవి ఇండియా పాలకుల ఉద్దేశాలలో ఒక భాగమే. తమకు ఇష్టంలేని విదేశీ కంపెనీల స్థానంలో,ప్రభుత్వరంగ సంస్థ బి.ఎస్‌.ఎన్‌.ఎల్‌.ను హత్యచేసి ప్రధాని శ్రేయో ఆశ్రిత సంస్థలు అదాని కమ్యూనికేషన్స్‌, అంబానీ జియో సంస్థలను ప్రోత్సహించడం ఇందులో ప్రధాన ఉద్దేశం.

జనాధరణ పెరుగుదలపై, మత ఓటర్ల సమీకరణపై స్వారీ చేస్తున్న వైదిక పాలకుల దుర్మార్గపు ఇష్టాయిష్టాలకు చైనా కంపెనీలే బాధితులు కాదు. అమెరికన్‌ బహుళరంగ సాంకేతిక సంస్థలు గూగుల్‌, అమెజాన్‌, ఫిన్లాండ్‌ టెలికమ్యూనికేషన్స్‌, సమాచార సాంకేతిక సంస్థ నోకియా, దక్షిణ కొరియా ఉత్పత్తి సంస్థ శాంసంగ్‌ వగైరా బహుళజాతి సంస్థలు ఇటీవల ఇండియాలో లక్షల రూపాయల జరిమానా చెల్లించాయి. ఏదో సందర్భంలో ఆ దేశాలలో ఎవరో ఒకరు చేసిన తమ పాలనా విధానాల విమర్శలకు ఇవి ప్రతిఫలాలు. మనపాలకులు కల్పిత ఆరోపణలతో విదేశీ వ్యాపార సంస్థలను బెదిరించడం రెట్టించారు. దీనితో మన ప్రధాని మేక్‌ ఇన్‌



ఇండియా (మా దేశ చౌకవనరులను వాడుకొని ఇక్కడ వస్తువులను ఉత్పత్తి చేసి ఏ దేశంలోనయినా అమ్ముకోండి.) పథకం కూడా ప్రమాదంలో పడింది. విదేశీ కంపెనీలకు భారతం"శ్మశానవాటిక"గా పేరు తెచ్చుకోవడంలో ఆశ్చర్యం లేదు.

2014 నుండి 2021 వరకు, ఇండియాలో నమోదుచేసుకున్న 2,800 పైగా విదేశీ కంపెనీలు తమ కార్యాలయాలను మూసివేసాయి. మన ప్రభుత్వ అధికార సమాచారం ప్రకారం ఈ మూసివేసిన కంపెనీల సంఖ్య దేశంలోని మొత్తం బహుళజాతి కంపెనీలలో ఆరో వంతు. ప్రపంచబ్యాంకు తన గ్లోబల్‌ డూయింగ్‌ బిజినెస్‌ నివేదికలో భారత్‌ను వ్యాపారం ప్రారంభించేందుకు ప్రపంచంలోని చెత్త దేశాల్లో ఒకటిగా పేర్కొంది. ప్రపంచ ఆహార కార్యక్రమం ప్రకారం, ప్రపంచంలో పోషకాహార లోపమున్న జనాభాలో 25 శాతం ఇండియాలో నివసిస్తున్నారు.సాంకేతికత, మూలధనం, ఉద్యోగ అవకాశాలను తెచ్చే అవకాశాలున్నఅత్యవసర రంగాలలోనే విదేశీ పెట్టుబడులను ఆహ్వానించడం ద్వారా ఆర్థిక అభివృద్ధిని కొనసాగించడం, స్థిరీకరించడం ఇండియా తక్షణ కర్తవ్యం. బీమా లాంటి రంగాలలో పెట్టుబడులే అక్కరలేదు.రాజకీయ లబ్దికోసం నచ్చని విదేశీ స్వదేశీ వ్యాపారాలను నాశనం చేయరాదు. మన పనులను చేయలేకపోడమే గాక తన పనుల్ని కూడా చేసుకోలేని బమ్మ దేవుని సేవలు మాని స్వదేశీ పారిశ్రామికాభివృద్ధిపై దృష్టి పెట్టడంలో భారత ప్రగతి ఇమిడి ఉంది.

> జనాధరణ పెరుగుదలపై, మత ఓటర్ల సమీకరణపై స్వారీచేస్తున్న వైదిక పాలకుల దుర్మార్గపు ఇష్టాయిష్టాలకు చైనా కంపెనీలే బాధితులు కాదు. అమెరికన్‌ బహుళరంగ సాంకేతిక సంస్థలు గూగుల్‌, అమెజాన్‌, ఫిన్లాండ్‌ టెలికమ్యూనికేషన్స్‌, సమాచార సాంకేతిక సంస్థ నోకియా, దక్షిణ కొరియా ఉత్పత్తి సంస్థ శాంసంగ్‌ వగైరా బహుళజాతి సంస్థలు ఇటీవల ఇండియాలో లక్షల రూపాయల జరిమానా చెల్లించాయి. ఏదో సందర్భంలో ఆ దేశాలలో ఎవరో ఒకరు చేసిన తమ పాలనా విధానాల విమర్శలకు ఇవి ప్రతిఫలాలు. మనపాలకులు కల్పిత ఆరోపణలతో విదేశీ వ్యాపార సంస్థలను బెదిరించడం రెట్టించారు. దీనితో మన ప్రధాని మేక్‌ ఇన్‌ ఇండియా (మా దేశ చౌకవనరులను వాడుకొని ఇక్కడ వస్తువులను ఉత్పత్తి చేసి ఏ దేశంలోనయినా అమ్ముకోండి.) పథకం కూడా ప్రమాదంలో పడింది. విదేశీ కంపెనీలకు భారతం"శ్మశానవాటిక"గా పేరు తెచ్చుకోవడంలో ఆశ్చర్యం లేదు.

మెయిల్‌ @ నవతెంగాణ

కొత్త బస్సులు కొనుగోలు చేయాలి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద కల్పిస్తున్న మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం చాలా ఊరటనిచ్చిన మాట వాస్తవం. అయితే ఉచితం వల్ల ప్రయాణికుల తాకిడి కూ డా బాగా పెరిగింది. పెండ్లిళ్లు, జాతరలు, పండగల సందర్భంగా చాలామంది మహిళలు ఈ పథకాన్ని వినియోగించుకుంటున్నారు. సరిపడా బస్సులు లేక చాలా మంది ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారు వెళ్లాల్సిన గమ్యస్థానాలకు సరైన సమయానికి వెళ్లలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైగా మహిళలు కూడా బస్సుల్లో కిక్కిరిసిపోవడం, వారు కూడా గంటలకొద్దీ నిలబడటం వల్ల నిరాశను వ్యక్తపరుస్తున్నారు. పాఠశాల, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు సకాలంలో చేరుకోలేక చదువులు నష్టపోతున్నారు. ఇప్పటికే బస్సుల్లో మహిళలు సీట్ల కోసం ఘర్షణ పడుతున్న సందర్భాలు చూస్తున్నాము. పరిమితికి మించి ప్రయాణికుల ఎక్కడంతో బస్సులు అదుపు తప్పి ప్రమాదాలు జరిగిన ఘటనలు కూడా అనేకం. ఇప్పటికే కాలం చెల్లిన బస్సులు కూడా ఉన్నాయి. అన్నింటికీ తక్షణ పరిష్కారం అదనపు బస్సులు కేటాయించడం. అలా చేయాలంటే ప్రభుత్వం కొత్త బస్సులు కొనుగోలు చేయడం. ఎందుకంటే ప్రయాణికుల రద్దీని బట్టే బస్సులు నడుపుతారు. పథకం ప్రవేశపెట్టినప్పుడే ఎన్ని బస్సులు కొత్తవి కావాలో అంచనాకు వచ్చినట్టు వార్తలు. కొత్త ప్రభుత్వం ఏర్పడి వంద రోజుల పాలన పూర్తయ్యేలోగా కొత్త బస్సులను కొనుగోలు చేసి ప్రయాణికుల సమస్యను తీర్చాలి.

- ఎం.సురేష్‌, నాగర్‌కర్నూల్‌

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కరీంనగర్
మంగళవారం ఫిబ్రవరి 13, 2024 www.navatelangana.com

కిమ్స్‌లో ఉన్నత చదువులపై అవగాహనా సదస్సు



నవతెలంగాణ - కరీంనగర్ : కరీంనగర్‌లోని కిమ్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో శివ శివాని ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఉన్నత చదువులపై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ది హిందూ హైదరాబాద్ రిటైర్డ్ ప్రాంతీయ జనరల్ మేనేజర్ పి.రంగారెడ్డి మాట్లాడుతూ..దేశంలోనే కాకుండా విదేశాలలో కూడా ఉపాధి అవకాశాల గురించి వివరించారు. అనంతరం శివ శివాని ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ హైదరాబాద్ అసిస్టెంట్ ప్రొఫెసర్ టి.సుభాష్ తేజ్ మాట్లాడుతూ.. మేనేజ్‌మెంట్ రంగం వైపు విద్యార్థులు అడుగులు వేస్తే జీవితం సక్రమంగా తయారవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ విద్యాసంస్థల వైస్ చైర్మెన్ సాకేత్ రామారావు, డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపల్ అర్జున్ రావు, హెూటల్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపల్ అనుష్ రెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

16న కార్మిక సమ్మె, గ్రామీణ బంద్ విజయవంతం చేయండి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్



నవతెలంగాణ - తిమ్మాపూర్

ఈ నెల 16న దేశవ్యాప్త కార్మిక సమ్మె గ్రామీణ బంద్ విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్ అన్నారు. చిగురుమామిడి మండల కేంద్రంలోని హమాలీ యూనియన్ ఆఫీస్‌లో సీఐటీయూ, ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘాల సమావేశం సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మారెళ్ళ శ్రీలత అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా దేశవ్యాప్త కార్మిక సమ్మె, గ్రామీణ బంద్ కరపత్రం విడుదల చేశారు. దేశవ్యాప్త కార్మిక సమ్మె, గ్రామీణ బంద్ విస్తృత ప్రచారం కోసం ప్రతి గ్రామంలో ఇంటింటికి కరపత్రం పంపిణీ చేస్తామన్నారు. 16వ తేదీన బస్టాండ్ నుంచి జెండా గద్దె, గాంధీ విగ్రహం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించాలని నిర్ణయం చేశామని తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్ మాట్లాడారు. దేశవ్యాప్త కార్మిక సమ్మెతో పాటు గ్రామీణ రైతన్న, వ్యవసాయ కార్మిక వర్గం గ్రామీణ బంద్ నిర్వహిస్తుందని, దీంట్లో కార్మిక కర్షక మైత్రిని ప్రదర్శించి కేంద్ర బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి మండలంలో పెద్దఎత్తున 16న నిరసన ర్యాలీ నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో సెకండ్ ఏఎన్ఎం యూనియన్ అధ్యక్షులు జైల్ల కవిత, ప్రధాన కార్యదర్శి స్వాతి, ఆశా వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షులు నగెల్లి పద్మ, ప్రధాన కార్యదర్శి పెద్దపల్లి శోభ, పశు మిత్ర వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభ, కల్పన, హమాలీ యూనియన్ అధ్యక్షులు సంధవేణి మల్లేశం, ప్రధాన కార్యదర్శి మల్లం శ్రీనివాస్, నాయకులు వేల్పుల రాజయ్య, గూడెం కుమార స్వామి, శ్వేత, లింగవ్వ తదితరులు పాల్గొన్నారు.





విజిట్ టు మేడిగడ్డ

ప్రాజెక్టు నిర్మాణ లోపాలను ఎత్తిచూపేందుకు
నేడు సీఎం, మంత్రులు సహా ఎమ్మెల్యేల బృందం పర్యటన

ఒకవైపు రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ నోటికి తాళం వేసే పక్కా ప్లాన్‌తో రాష్ట్ర కాంగ్రెస్ సర్కారు సిద్ధమైంది. ఇప్పటికే కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ కుంగడం, దానిలో అవినీతి, నాణ్యతాలోపాలు, కాంట్రాక్ట్ సంస్థ నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతూ నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ప్రాథమిక నివేదిక ఇచ్చింది. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు సహా ఎమ్మెల్యేలందరితోనూ మంగళవారం అసెంబ్లీ సమావేశం నుంచి నేరుగా బ్యారేజీ కుంగి ప్రాంతాన్ని సందర్శించేందుకు పయనమయ్యారు. మధ్యాహ్నం ఆ ప్రాంతాన్ని పరిశీలించి సాయంత్రం 3వేల మంది పాల్గొనేలా ఏర్పాటు చేసిన సభాస్థలిలో పవర్‌పాయింట్ ప్రజేంటేషన్ చేయనున్నారు. ఇందుకోసం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేయగా ఆ ప్రాజెక్టు ప్రాంతం అటవీ సరిహద్దు కావడం, మావోయిస్టు ప్రాబల్యమున్న ఏరియా కావడంతో భారీ పోలీసుకూంబింగ్ కూడా చేపట్టారు.

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

- లోక్‌సభ ఎన్నికలే లక్ష్యంగా కాళేశ్వరం అస్త్రంతో రంగంలోకి...
- గత బీఆర్ఎస్ సర్కారును ఇరాకాటంలో పెట్టేందుకు పక్కాప్లాన్
- అసెంబ్లీ నుంచి నేరుగా బ్యారేజీ దెబ్బతిన్న ప్రాంతానికి పయనం
- మూడువేలమంది కూర్చునేలా సమీపంలో స్థభాస్థలికి ఏర్పాటు
- సాయంత్రం 3గంటలకు పవర్‌పాయింట్ ప్రజంటేషన్
- తరలివెళ్లేందుకు సిద్ధమైన కరీంనగర్ ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ శ్రేణులు
- సరిహద్దు అంతా అటవీ ప్రాంతమవడంతో భారీ పోలీస్‌కూంబింగ్

సరిగ్గా అసెంబ్లీ ఎన్నికలకు నెల రోజుల ముందు కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ కుంగిందన్న వార్త సంచలనం రేపింది. బ్యారేజీ ఏడో బ్లాక్‌లోని 20వ పిల్లర్ కుంగిపోయి దెబ్బతినడంతో సరిహద్దులోని తెలంగాణ, మహారాష్ట్ర మధ్య అక్టోబర్ 21న అప్పటి సర్కారు రాకపోకలు నిలిపివేయించింది. కేంద్ర జలశక్తి శాఖ నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) నిపుణుల కమిటీ అక్టోబర్ 24న సందర్శించింది. ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను అప్పటి బీఆర్ఎస్ సర్కారును కోగా అప్పటికే అసెంబ్లీ ఎన్నికల వాతావరణం ఊపందుకోవడం, ఆ ప్రభుత్వం సరిగా స్పందించలేదు. దీంతో ప్రభుత్వం పూర్తి వివరాలు అందించలేదని సదరు కమిటీ ప్రాజెక్టు ప్లానింగ్, డిజైన్ నిర్మాణంలో నాణ్యత, నిర్వహణ, పరవేక్షణలోపాలతో బ్యారేజీ కుంగిందంటూ నివేదిక ఇచ్చింది. ఆ ఇష్యూ ఎన్నికల పోలింగ్ సమయానికి పొలిటికల్ ఏజెండా కావడంతో ఆ పార్టీ గెలుపును కొంత ప్రభావితం చేసింది. తరువాత డిసెంబర్3 ఫలితాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు ఆ ప్రాజెక్టు నిర్మాణలోపం, అవినీతి ఆరోపణలపై దృష్టిసారించింది. మేడిగడ్డ డ్యామేజీపై ఇప్పటికే నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ప్రాథమిక నివేదికలో రాష్ట్ర ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ ఫెయిల్యూర్స్‌తోపాటు కన్‌స్ట్రక్షన్ కంపెనీ నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపింది. స్టేట్ విజిలెన్స్ అధికారులు జలసౌధలోని ఈ-ఇన్-సీ చాంబర్లతోపాటు మహదేవ్‌పూర్, రామగుండం, మేడిగడ్డ ఇంజినీర్ల ఆఫీసుల్లో సోదాలూ చేసి ఫైళ్లను స్వాధీనం చేసుకుంది. ఈ రిపోర్టులోని అంశాల ఆధారంగానే ఈ-ఇన్-సీ (జనరల్) మురళీధర్, రామగుండం ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లును బాధ్యతల నుంచి రాష్ట్ర ప్రభుత్వం తప్పించింది.ఆయా ప్రాజెక్టు ఫైళ్లను సేకరించి పరిశీలించింది.

40బస్సులు.. 3వేలమంది కూర్చునేలా సభాస్థలి...

నిర్మాణ లోపాలు ఎత్తి చూపేందుకు మేడిగడ్డ బ్యారేజీని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలందరినీ ప్రభుత్వ ఖర్చుతో తీసుకెళ్తామని శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందుకోసం 40 బస్సులను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ నేపథ్యంలో బ్యారేజీ దెబ్బతిన్న ప్రాంతానికి చేరుకొనే విధంగా అధికారులు చదును పనులు పూర్తి చేయించారు. వ్యూపాయింట్ ప్రాంగణం వద్ద 3 వేల మంది కూర్చునే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. అక్కడే నిర్మాణ లోపాలపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్, సభ నిర్వహించనున్నారు. ఈ సభకు వెళ్లేందుకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ శ్రేణులు సిద్ధమయ్యారు. ఇప్పటికే భద్రతపరంగా ఆయా మార్గాల్లో పోలీసు అధికారులు ప్రయాణించి పరిశీలించారు. రహదారులు, కల్వర్టులను బాంబు స్క్వాడ్ తనిఖీ చేశారు.

బ్యారేజీ సరిహద్దు అడవుల్లో భారీ పోలీస్ కూంబింగ్

మేడిగడ్డ బ్యారేజీకి సీఎం, మంత్రులు సహా ఎమ్మెల్యేలు అంతా సందర్శనకు వస్తుండటంతో పరిసరాల్లోని సరిహద్దు అడవుల్లో భారీ పోలింగ్ కూంబింగ్ చేపట్టారు. మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతం కావడం, అందులోనూ అటవీ ప్రాంతం ఎక్కువగా ఉండటంతో అక్కడ మావోయిస్టు ప్రాబల్యం కూడా ఉంది.ఈ కారణంగా రెండురోజులుగా పెద్ద ఎత్తున ప్రత్యేక పోలీసు బలగాలతో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ప్రాంతానికి సరిహద్దును ఉన్న ఛతీస్‌ఘడ్‌లో మావోయిస్టులు హింసాత్మక చర్యలకు పాల్పడుతున్న నేపథ్యంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.ఇప్పటికే ఇంటిలిజెంట్ డీఐజీ ఎం శ్రీనివాస్, సీఎంఓ ఓఎస్‌డీ మేడిగడ్డ ప్రాజెక్టు వద్ద ఏర్పాట్లను సోమవారం పరిశీలించారు. భూపాలపల్లి జిల్లా కలెక్టర్ భావేష్ సహా ఆ జిల్లా అధికారులు అక్కడే మకాం వేశారు. సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు సహా వీఐపీ వాహనాల పార్కింగ్‌కు సంబంధించి సూరారం, అంబటిపల్లి వద్ద రెండు స్థలాలు ఏర్పాటు చేశారు.

సీఏం పర్యటన షెడ్యూల్ ఇలా..

- 9.30 గంటలకు ఉదయం హైదరాబాద్ నుంచి బయలుదేరుతారు..
- మధ్యాహ్నం 2గంటలకు మేడిగడ్డ బ్యారేజీ కు చేరుకుంటారు.
- 2గంటల నుంచి నుంచి 3గంటల వరకు బ్యారేజ్ ను సందర్శిస్తారు
- 3గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు నీటిపారుదల శాఖతో రివ్యూ సమావేశం
- 4గంటల నుంచి 5గంటల వరకు మీడియా సమావేశం, పవర్‌పాయింట్ ప్రజేంటేషన్
- సాయంత్రం 5గంటలకు మేడిగడ్డ నుంచి హైదరాబాదుకు రోడ్డు మార్గం గుండా తిరుగు ప్రయాణం

వైజ్ఞానిక చైతన్యానికి స్ఫూర్తినిచ్చిన ఎం.ఆదినారాయణ



నవతెలంగాణ - కరీంనగర్ : ఇటీవల మరణించిన ప్రొఫెసర్, జనవిజ్ఞాన వేదిక తెలంగాణ రాష్ట్ర బాధ్యులు ఎం.ఆదినారాయణకు కరీంనగర్ కోర్టు చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం వద్ద జనవిజ్ఞాన వేదిక తెలంగాణ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రామరాజు మాట్లాడుతూ.. వైజ్ఞానిక అభివృద్ధికి తపన పడే వ్యక్తి, సామాజిక రుగ్మతల నిర్మూలనకు సైన్సే అస్త్రంగా ముందుకు నడిచిన వ్యక్తి గురువు అన్నారు. శాస్త్రీయ దృక్పథానికి బాల్యమే మూలం కావాలని ముందుకు నడిచిన ఆచార్యుడు, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు ముంద్ర ఆదినారాయణ మృతి వైజ్ఞానిక సమాజానికి తీరని లోటని అన్నారు. అనంతరం జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి సంపతి రమేష్ మాట్లాడుతూ.. తుది శ్వాస వరకు జనవిజ్ఞాన వేదిక కార్యక్రమాలలో పాల్గొనడం వారి నిబద్ధతకు నిదర్శనమన్నారు. శాస్త్రీయ సమాజ నిర్మాణానికి తపన పడిన ప్రొఫెసర్ ఆదినారాయణ ఒక వైజ్ఞానిక గురువు అని, అంతిమ శ్వాస వరకు శాస్త్రీయ ప్రచార ఉద్యమానికి తన సమయాన్ని ఇచ్చి మనందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచారని తెలిపారు. ప్రతి ఒక్కరు ఆయన అడుగుజాడల్లో నడుస్తూ శాస్త్రీయ సమాజ నిర్మాణానికి నడుం బిగించాలన్నారు. తన ఆలోచన విధానాన్ని ముందుకు తీసుకువెళ్లడమే ఆయనకు మనమిచ్చే ఘన నివాళి అని తెలిపారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వరావు, ప్రధాన కార్యదర్శి కొడుముంజ శంకర్, జిల్లా బాధ్యులు వంతడుపుల అంజనేయులు, ఎన్.దేవేందర్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేటు భూమిలో జీపీ భవన నిర్మాణం

కలెక్టర్‌కు గ్రామస్తుల ఫిర్యాదు

నవతెలంగాణ - కరీంనగర్ : కరీంనగర్ రూరల్ మండలంలోని బొమ్మకల్ గ్రామపంచాయతీ పాలకవర్గం కోసం ఇటీవల నూతన భవనం నిర్మించింది. అయితే ఆ భవనం నిర్మించిన స్థలం ప్రైవేటు వ్యక్తిది కావడంతో, ఈ భవనం ఎవరి పాలు కానుందోనని ఆందోళనతో సోమవారం ప్రజావాణిలో ఆ గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. బొమ్మకల్ గ్రామ సర్వే నెంబరు సేవంటిన్ బై ఏ లో 12384/2021 అనే డాక్యుమెంట్ అవాన్పు ఆర్తీక రెడ్డి అనే మహిళ పేర రిజిస్ట్రేషన్ అయి ఉన్నది. ఇదే ప్లాట్‌లో గ్రామ పంచాయతీ ఏకగ్రీవంగా తీర్మానం చేసి, ఇటీవల మూడంతస్తుల భవనం నిర్మించారు. ఈ భవన నిర్మాణానికి లక్షలాది రూపాయలు ఖర్చు చేయగా, కొద్దిరోజుల క్రితం రూ. 8 లక్షల నిధులు కూడా విడుదల చేసినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మాజీ సర్పంచ్‌పై విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని కోరారు.

'బడ్జెట్‌లో విద్యారంగం, యూనివర్సిటీలపై చిన్న చూపు'

నవతెలంగాణ - భగత్‌నగర్ : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మొట్టమొదటి ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 7.75శాతం నిధులే కేటాయించడం విద్యారంగంపైన చిన్నచూపని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్యాల రాకేష్ అన్నారు. సోమవారం ప్రెస్‌భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాతవాహన యూనివర్సిటీకి రూ.100కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. జిల్లా కన్వీనర్ పూసాల విష్ణు, లా ఫోరం రాష్ట్ర కో కన్వీనర్ నక్క ప్రమోద్ కుమార్, నగర కార్యదర్శి బామండ్ల నందు, వంగపెల్లి నితీశ్‌రెడ్డి, తదతరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సేవలు మరువలేనివి

మున్సిపల్ చైర్మన్ తక్కల్లపల్లి

టీడబ్ల్యూజేఎఫ్ కార్యాలయం ప్రారంభం



నవతెలంగాణ - జమ్మికుంట : అనునిత్యం ప్రజా సమస్యలను వెలికి తీయడానికి తపిస్తూ, వార్తలను సేకరించి సమాజ నలుమూలకు అందిస్తున్న జర్నలిస్టుల సేవలు మరువలేనివని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కలపల్లి రాజేశ్వరరావు అన్నారు. సోమవారం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ కార్యాలయాన్ని ఆయన జమ్మికుంటలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటున్నారని అన్నారు. అలాగే తెలంగాణ ఉద్యమ సమయంలో కూడా అనేక జర్నలిస్టుల కథనాల వల్ల ఉద్యమానికి ఎంతో మేలు జరిగిందని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్నకోటి, సింగిల్ విండో చైర్మన్ పొనగంటి సంపత్, టీపీసీసీ మెంబర్ సాయిని రవి, వీణవంక ఎంపీపీ ముసిపట్ల రేణుకతిరుపతిరెడ్డి, బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి వాసాల రామస్వామి, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు కుడితాడి బాబురావు, జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ అరికెళ్ల భానుచందర్, డివిజన్ కమిటీ అధ్యక్షుడు సొడమల్ల యోహన్, కార్యదర్శి అయిత రాధాకృష్ణ, ఉపాధ్యక్షుడు ఏబూషి సంపత్, కోశాధికారి దయ్యాల సుధాకర్, సహాయ కార్యదర్శి ఖాజా ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

గొర్లకాపరులకు నష్టపరిహారం ఇవ్వాలి

జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి కాల్వ సురేష్

నవతెలంగాణ - తిమ్మాపూర్



చిగురుమామిడి మండలకేంద్రంలో ఆదివారం సాయంత్రం రహదారి ప్రమాదంలో చనిపోయిన గొర్రెలకు నష్టపరిహారం ఇప్పించి గొర్లకాపరులను ఆదుకోవాలని గొర్రెల మేకల పెంపకదార్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాల్వ సురేష్ అన్నారు. సోమవారం చిగురుమామిడి గ్రామంలో బాధితులను కాల్వ సురేష్, యాదవ సంఘం మండల అధ్యక్షుడు ముక్కెర సదానందం యాదవ్ పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం రహదారిపై వస్తున్న లారీ గొర్రెల మందపై దూసుకురావడంతో 40 గొర్రెలు మత్యువాత పడ్డాయని తీవ్ర గాయాలతో సోమవారం వరకు మరో 25 జీవాలు మృతిచెందాయన్నారు. 30 జీవాలు తీవ్ర గాయాలతో ఉన్నాయని వాటికి చికిత్స అందించినా బతికేలా లేవని తెలిపారు. గొర్రెల కాపరులైన చౌదరి కనకయ్య, ముదుగురి సమ్మయ్య నిరుపేదలని, వారి జీవనాధారం కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని వారికి నష్టం పరిహారం ఇప్పించి ఆదుకోవాలని అధికారులను కోరారు. అలాగే గాయపడిన జీవాలకు పూర్తి చికిత్స అందించాలని మండల పశువైద్య అధికారి డాక్టర్ శ్రీధర్‌ను కోరారు. కార్యక్రమంలో జీఎంపీఎస్ జిల్లా నాయకులు భూస అయిలయ్య యాదవ్, ముక్కెర మల్లేష్ యాదవ్, అన్న సమ్మయ్య కురుమ, కాశవేణి ఓదెలు, కాశవేణి రాజు, చౌదరి మనోహర్, పోతరవేణి అనిల్ యాదవ్ పాల్గొన్నారు.

విషాహారం తిని చనిపోతున్న ఇటుక బట్టీ కూలీలు

ప్రభుత్వమే బాధ్యత వహించాలి

మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ శనిగరపు తిరుపతయ్య



నవతెలంగాణ - జమ్మికుంట

పెద్దపల్లి జిల్లాలో ఇటుక బట్టీలలో పనిచేసే కార్మికులు ఫుడ్ పాయిజనింగ్‌కి గురై చనిపోయారని.. అందుకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ శనిగరపు తిరుపతయ్య అన్నారు. సోమవారం మానవ హక్కుల వేదిక బృందం వివిధ ఆస్పత్రిల్లో ఇంకా చికిత్స తీసుకుంటున్న వారు, వారి కుటుంబ సభ్యులు, వైద్యులు, బట్టీల్లో పనిచేసే కార్మికులు, ఇటుక బట్టీయజమానులను కలిసి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ శనిగరపు తిరుపతయ్య మాట్లాడారు. ఒరిస్సా నుండి వలస వచ్చి పెద్దపల్లి జిల్లాలో ఇటుక బట్టీలలో పనిచేస్తున్న కార్మికుల్లో విషాహారం తిని ముగ్గురు చనిపోయారని, వందలాది మంది ఆసుపత్రుల పాలయ్యారని, ఇంకా ఆస్పత్రిలో చేరే వారి సంఖ్య పెరుగుతూనే ఉందని తెలిపారు. వలస కూలీల పేదరికం కారణంగా వారు పెద్దపల్లి చికెన్ మార్కెట్లో మాంసపు వ్యర్థ పదార్థాలను తక్కువ ధరకు తెచ్చుకొని, వండుకుంటారని, దీన్ని ఆసరాగా చేసుకుని మార్కెట్లో బయటపడేసే వ్యర్థాలను కూడా వీరికి అమ్ముతున్నట్టు తెలుస్తుందని చెప్పారు. వారికి కనీస సౌకర్యాలు లేవని వాపోయారు. మృతుల కుటుంబాలకు రూ.పదిలక్షల చొప్పున ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆరోగ్య శాఖ అధికారులు తక్షణమే కూలీల నివాస స్థలాలను, ఆహారపు, మంచి నీటి స్థితిగతులను, పట్టణ మార్కెట్‌నూ ముఖ్యంగా చికెన్ మార్కెట్ పరిశీలించి ఫుడ్ పాయిజనింగ్‌కు కారణాన్ని శాస్త్రీయంగా తేల్చాలని కోరారు. కార్మికులందరికీ ప్రభుత్వ గ్రూప్ ఇన్సూరెన్స్, బ్యాంకుల ద్వారా జీవిత బీమా సౌకర్యం అందుబాటులోకి తేవాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సల్పల రమేష్, జిల్లా కమిటీ సభ్యులు ఎస్.అచ్యుత్ కుమార్, దేగల తిరుపతి, అడ్వకేట్లు అజయ్, పందిళ్ళ రంజిత్ కుమార్, దళిత బహుజన ఫ్రంట్ నాయకుడు సుదర్శన్ పాల్గొన్నారు.

ఘనంగా మార్కండేయ జయంతి

నవతెలంగాణ - హుజూరాబాద్ టౌన్ : చేనేత సహకార సంఘం అధ్వర్యంలో సోమవారం మార్కండేయ స్వామి జయంతి నాయకులు ఘనంగా నిర్వహించారు. మార్కండేయ స్వామి చిత్ర పటానికి పూల మాలలు వేశారు. అనంతరం శివలింగాన్ని రథంపై పెట్టి పట్టణంలో ఊరేగించారు. చేనేత సహకార సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఎలిగేటి ఉపేందర్, వేముల యాదగిరి, సంఘం డైరెక్టర్లు మంచికట్ల వెంకటయ్య, మండల సత్యనారాయణ, కుడికాల ప్రభాకర్, మంచికట్ల సుమలత, పద్మశాలి సేవా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సబ్బని రాజేందర్, నాయకులు మంచికట్ల వెంకట్రాజం, సబ్బని శివాజీ, విడపు రాజు, తాటిపాముల రఘుపతి, మంచికట్ల కోటి, చేనేత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

మార్కండేయ స్వామి జయంతిని పురస్కరించుకొని హుజూరాబాద్ మండల పద్మశాలి సంఘం (టిఆర్పిఎస్), చేనేత ఐక్య వేదిక అధ్వర్యంలో అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ ఆడిచెర్ల శ్రీనివాస్, తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర సమాచార కార్యదర్శి కుడికాల భాస్కర్, హుజూరాబాద్ డివిజన్ అధ్యక్షుడు కుడికాల సాయి, మహిళ విభాగం కార్యదర్శి జడల రాణి, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - గన్నేరువరం

మండల కేంద్రంలోని శ్రీ శివ భక్త మార్కండేయ ఆలయంలో మార్కండేయ జయంతిని పురస్కరించుకుని పద్మశాలి సంఘ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సభ్యులు వడ్నాల బలరాం, బూర శ్రీనివాస్, వెంగళ కమల మనోహర్, భీమనాతిని వెంకటేశం, వేముల రాములు, ,వేముల కష్టారి, వేముల రవికుమార్, తెల్ల అజయ్, తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ - చొప్పదండి : చొప్పదండి మండలంలోని ఆర్నకొండ గ్రామానికి చెందిన మాజీ మార్కెట్ డైరెక్టర్ అశోద రాజయ్య భార్య అశోద రాజేశ్వరి అనారోగ్యంతో మృతిచెందింది. ఆమె కుటుంబ సభ్యులను సోమవారం అక్షయ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ తమ్మడి కనుకరాజు పరామర్శించారు. ఎంపీటీసీ గొల్ల సునందగట్టయ్య ఉన్నారు.

ఆలయ వార్షికోత్సవం

నవతెలంగాణ - జమ్మికుంట : అభాది జమ్మికుంటలో శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి దేవాలయ పుణర్నిర్మాణం చేసి సంవత్సరం పూర్తిచేసుకున్న సందర్భంగా వార్షికోత్సవం నిర్వహించారు. కల్యాణోత్సవంలో మున్సిపల్ చైర్మన్ తక్కళ్ళపల్లి రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు. కౌన్సిలర్లు భోగం సుగుణ, దయ్యాల శ్రీనివాస్, భోగం వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

నిరంతర సాధనతోనే క్రీడాకారులకు మంచి ఫలితాలు

కబడ్డీ అసోసియేషన్‌టౌన్ అధ్యక్షుడు ప్రశాంత్‌రావు



నవతెలంగాణ-జగిత్యాలటౌన్ :క్రీడాకారులు నిరంతర సాధనతోనే మంచి ఫలితాలు సాధిస్తారని కబడ్డీ అసోసియేషన్ జగిత్యాల పట్టణ అధ్యక్షుడు, జగిత్యాల వర్తక సంఘం సంయుక్త కార్యదర్శి బోయిన్‌పెల్లి ప్రశాంత్‌రావు అన్నారు. సోమవారం జగిత్యాల జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కబడ్డీ కోచింగ్ క్యాంప్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌రావు మాట్లా డుతూ.. నిరంతర సాధన వల్లనే క్రీడాకారులు మంచి ఫలితాలు సాధిస్తారని, కబడ్డీ కోచింగ్ క్యాంపును సద్వి నియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆరే తిరుపతి మాట్లాడుతూ.. క్రీడలు శారీరక మానసిక ఎదుగుదలకు, ఉపయోగపడుతుందన్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొని జిల్లాకు పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల పీఈటీ రమ్య పాల్గొన్నారు.

జాడలేని హెల్త్‌కిట్లు

- విద్యార్థినుల ఎదురుచూపులు
- ఐదేళ్ల క్రితం పంపిణీ
- ఏటా నాలుగు విడతలు అందిస్తామని ప్రకటన
- రెండేళ్లపాటు ఇచ్చారు... తర్వాత మరిచారు
- కొత్త సర్కారుపై బాలికల ఆశలు



నవతెలంగాణ-జగిత్యాలటౌన్

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే నిరుపేద, మధ్య తరగతి విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించేందుకు వారి ఆరోగ్యానికి భరోసాను కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అందించే హెల్త్‌కిట్లు జాడలేకుండా పోయాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2018 ఆగస్టులో మొదటి విడత, ఆ తర్వాత ఏడాది వరకు నాలుగు విడతలుగా పంపిణీ చేశారు. ఏటా నాలుగు విడతలుగా హెల్త్‌కిట్లను అందిస్తామని తొలుత అప్పటి ప్రభుత్వం ప్రకటించింది. నాలుగు విడతలే పంపిణీ చేసి, ఐదేళ్లుగా ఒక్కసారి కూడా హెల్త్‌కిట్లను ఇవ్వలేదు. దీంతో హెల్త్‌కిట్ల కోసం జిల్లాలోని పేద, మధ్య తరగతి వర్గాల బాలికలు ఎంతోఆశగా ఎదురు చూస్తున్నారు.

కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలు, మోడల్ స్కూళ్లు, బాలికల వసతి గృహాలు, గురుకుల విద్యాలయాల్లో 7 నుంచి 10వ తరగతి వరకు చదివే 12 ఏండ్ల నుంచి 18 ఏండ్ల బాలికలకు హెల్త్ అండ్ హైజిన్ కిట్ల పంపిణీకి 2018 ఆగస్టులో ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రూ.1600 విలువ చేసే బ్రాండెడ్ కంపెనీలకు చెందిన 13 రకాల వస్తువులతో కూడిన ఆరోగ్య కిట్లను బాలికలకు 2018 ఆగస్టులో అందజేశారు. ఏడాదిలో ప్రతీ మూడు నెలలకొకసారి చొప్పున నాలుగు విడతలుగా కిట్లను అందిస్తామని అప్పటి ప్రభుత్వం పేర్కొంది. అయితే ప్రభుత్వం అందించాల్సిన హెల్త్‌కిట్లు ఐదేళ్ల అవుతున్నా ఏడాదికి ఒక్కసారి కూడా సరఫరా కాకపోవడంతో బాలికలు నిరాశకు గురవుతున్నారు. అప్పట్లో రెండుసార్లు ఇచ్చిన హెల్త్‌కిట్లలోని వస్తువులన్నీ విద్యార్థినులకు ఎంతో అవసరమైనవి కావడంతో బాగా వినియోగించుకున్నారు. ప్రస్తుత అవసరాలకు హెల్త్‌కిట్లలోని వస్తువులు లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన విద్యార్థినులు సదరు వస్తువులను కొనుగోలు చేసే స్తోమత లేక ఇబ్బందులు పడుతున్నారు.

బాలికల ఆరోగ్యమే లక్ష్యంగా..

రాష్ట్ర ప్రభుత్వం బాలికల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని, బాలిక విద్యను బలోపేతం చేస్తూ వారి ఆరోగ్యమే లక్ష్యంగా ఈ హెల్త్‌అండ్‌హైజిన్ కిట్ల పంపిణీని కార్యక్రమాన్ని చేపట్టింది. పాఠశాల స్థాయిలోనే బాలికలకు రుతుస్రావ ప్రక్రియలో పరిశుభ్రత పాటిస్తూ వారి అవసరాలకు తగిన విధంగా కిట్‌ను రూపొందించారు. దీనివల్ల వారు భవిష్యత్తులో ఎలాంటి దీర్ఘకాలిక వ్యాధులబారిన పడకుండా జాగ్రతలు పడే అవకాశం ఉంటుంది. ఇందుకోసం 13 రకాల వస్తువులతో కిట్‌ను రూపొందించారు. ఇందులో పతంజలి కంపెనీకి చెందిన మూడు స్నానపు సబ్బులు, మూడు బట్టల సబ్బులు, డాబర్ వాటిక షాంపూ, హేయిర్ ఆయిల్, డాజిలర్ పౌడర్, బబుల్ టూత్‌పేస్ట్‌లు రెండు, టూత్ బ్రష్, టంగ్ క్లీనర్, బొట్టు బిళ్లల ప్యాకెట్ ఒకటి, రిబ్బన్, దువ్వెన, రబ్బర్ బ్యాండ్లు రెండు, విస్పర్ కంపెనీకి చెందిన సానిటరీ నాప్‌కిన్లు ఆరు ప్యాకెట్లు ఇచ్చారు.

జిల్లాలోని కస్తూర్బాలలో 2186 మంది విద్యార్థినులు

జగిత్యాల జిల్లా వ్యాప్తంగా కస్తూర్బా పాఠశాలల్లో హెల్త్ కిట్లు పొందేందుకు ఈ విద్యా సంవత్సరంలో అర్హులుగా 2186 మంది 7 నుంచి 10 వ తరగతి చదివే బాలికలు ఉన్నారు. గత విద్యా సంవత్సరం 2782 మంది 6 నుంచి 10వ తరగతి చదివే బాలికలు ఉండేవారు. గత విద్యా సంవత్సరంలోనే బాలికల బ్యాంక్ అకౌంట్ వివరాలను సేకరించారు.

ఈ విద్యా సంవత్సరానికి ఒక్కొక్క విద్యార్థినికి వంద రూపాయల చొప్పున నగదు ఆయా విద్యార్థినిల బ్యాంక్ అకౌంట్లో జమ కానున్నాయి. దానికి సంబంధించి ఇదివరకే విద్యాశాఖ అధికారులకు ఉత్తర్వులు వెలువడ్డాయి. గత విద్యా సంవత్సరం నుండే ఒక్కొక్క విద్యార్థినికి వంద రూపాయలు ప్రభుత్వం చెల్లిస్తుంది. 2019 నుంచి హెల్త్‌కిట్ల పంపిణీని అప్పటి ప్రభుత్వం ఐదేళ్లపాటు విస్మరించింది. తాజాగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా స్పందించి వెంటనే హెల్త్‌కిట్లను అందించాలని బాలికలు కోరుతున్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక,కర్షక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 16న జరిగే దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్ పిలుపు నిచ్చారు. సీఐటీయూ జగిత్యాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో దేశవ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర బీజేపీ కార్పొరేట్, మతోన్మాద విధానాలను ప్రతిఘటిద్దాం.. మోడీ ప్రభుత్వ వైఫల్యాలపై చార్జిషీట్ ప్రకటిద్దాం అని



సమ్మె పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

పేర్కొన్నారు. ఈనె 16న కేంద్ర బిజెపి కార్పొరేట్ విధానాలను ధిక్కరిస్తూ ప్రతిఘటనకు పూనుకోవాలని, వారి వైఫల్యాలను ఇంటింటికి వెళ్లి లక్షలాది కుటుంబాలకు వివరించాలన్నారు. 16న కార్మిక సమ్మె గ్రామీణబందు అన్ని కార్మికుల రంగాలను కలుపుకొని జయప్రదం చేయాలని కోరారు. ఉపాధి హామీ పథకాన్ని పట్టణాలకు వర్తింపజేయాలని, ప్రతి వ్యక్తికి రెండు వందల రోజులు పని కల్పించాలని, రోజువారి వేతనం 600 తగ్గకుండా నిర్ణయించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2014 స్వామినాథ కమిషన్స్ ఫోర్స్ మేరకు రైతులు పండించిన పంటకు ఎంఎస్పి మినిమం సపోర్టు ప్రైస్ చెల్లిని ఇస్తామన్న హామీని బిజెపి ప్రభుత్వం నిలబెట్టుకోలేదని, వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన పథకాలను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటీయూ జగిత్యాల జిల్లా కన్వీనర్ ఇందూరి సులోచన, నాయకులు చంద్రయ్య, బి.శేఖర్, సలీం, హరీష్, మహ్మద్, లక్ష్మణ్, కె.వికాస్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అధైర్య పడకుండా ప్రోత్సహించాలి

జగిత్యాల కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

నవతెలంగాణ-జగిత్యాల

వెల్ఫేర్ హాస్టల్స్, రెసిడెన్షియల్ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులు అధైర్య పడకుండా ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి అనంతరం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, స్పెషల్ ఆఫీసర్స్‌లతో జిల్లాలోని రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టళ్ళ నిర్వహణపై కలెక్టర్ అదనపు కలెక్టర్ దివాకరతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వెల్ఫేర్ హాస్టళ్ళను, రెసిడెన్షియల్ స్కూళ్ళ వాట్సప్ గ్రూప్ క్రియేట్ చేశామని, కానీ కొంతమంది ఆఫీసర్లు మాత్రమే తమకు రిపోర్ట్



మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్ భాషా

ఇస్తున్నారని, మిగతా అధికారుల నుంచి ఎటువంటి రిపోర్ట్ తమకు రావడం లేదని కలెక్టర్ తెలిపారు. ప్రతీ మంగళవారం స్పెషల్ ఆఫీసర్లు వెల్ఫేర్ హాస్టళ్ళను, రెసిడెన్షియల్ స్కూళ్ళను తప్పకుండా సందర్శించాలని ఆదేశించారు. విద్యార్థులకు మనమే ఒక సపోర్ట్ సిస్టమ్‌లా ఉండాలని పిల్లలు ఎలా చదువుతున్నారు, హాస్టళ్ళలో ఎం జరుగుతున్నది అన్ని విషయాలను తెలుసుకొని తమకు రిపోర్ట్ పంపించాలని కలెక్టర్ ఆదేశించారు. చదువులో వెనుకబడి ఉన్న విద్యార్థులు పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి వారి విద్యాభివృద్ధికి తోడ్పడాలని, పరీక్షలలో ఫెయిల్ అయితే మళ్ళీ ప్రయత్నించాలన్నారు. పరీక్షలే జీవితం కాదని కలెక్టర్ తెలిపారు. అలాగే వారికి వ్యక్తిగత పరిశుభ్రత, మోటివేషన్ తరగతులు, విద్య పట్ల అవగాహన తరగతులు నిర్వహించాలన్నారు. స్పెషల్ ఆఫీసర్లు ప్రత్యేక పారిశుధ్యం కార్యక్రమం జరుగుతున్న ప్రదేశాలు తనిఖీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దివాకర, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో ఫీజులు వసూళ్లు చేస్తున్నారని ప్రజావాణిలో ఫిర్యాదు

- జిల్లా విద్యాధికారి విచారణ
- ర్వీర్యం అయ్యే పాఠశాలను నిలుపుకున్నామన్న విద్యార్థుల తల్లిదండ్రులు

నవతెలంగాణ-రాయికల్

మండలంలోని కట్కాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ప్రయివేటుగా నియమించుకున్న వాలంటీర్ల కోసం ఫీజులు వసూలు చేస్తున్నారని ప్రజావాణి గ్రీవెన్స్ సెల్‌లో కట్కాపూర్ గ్రామానికి చెందిన ఎండి ఆస్మా ఫిర్యాదు చేయడంతో సోమ వారం జిల్లా విద్యాశాఖ అధికారి జగన్ మోహన్‌రెడ్డి విద్యార్థుల తల్లిదండ్రులను విచారించినట్లు తెలిసింది. ఈ



ఫిర్యాదు చేసిన మహిళ

సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ.. గతంలో 7 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో 74 మంది విద్యార్థులు చదువుతు న్నారని, విరాళాలు సేకరించి నిర్వీర్యం అయ్యే పాఠశాలను గ్రామస్తులందరూ కలిసి కట్టుగా నిలబడి, ప్రయివేటు పాఠశాలలకు దీటుగా వాలంటీర్లను నియమించుకున్నామని తెలిపారు. ప్రభుత్వ ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో విద్యను అందిస్తున్న తరుణంలో ప్రభుత్వ ఉపాధ్యాయులపై తప్పుడు ఫిర్యాదులు చేయడం సరికాదని సుమారు 40 మంది తల్లిదండ్రులు జిల్లా విద్యాధికారికి తెలిపినట్టు గ్రామస్తులు తెలిపారు. విద్యార్థుల హాజరు పట్టికను, తల్లిదండ్రుల విన్నపాలను పరిశీలించిన జిల్లా విద్యాశాఖ అధికారి సంబంధిత పిర్యాదు పై ఉన్నతాధికారులకు ఏ విధమైన నివేదిక ఇస్తారనేది తెలియాల్సి ఉంది. ఈ విషయం పై జిల్లా విద్యాశాఖ అధికారి ని ఫోన్ ద్వారా సంప్రదించగా స్పందించలేదు.

ప్రణాళికా బద్ధంగా బోధిస్తే ఆశించిన ఫలితాలు వస్తాయి

నవతెలంగాణ-రాయికల్ :మండలంలోని భూపతిపూర్ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన పాఠశాల సముదాయ సమావేశాన్ని జిల్లా సెక్టోరియల్ అధికారి కొక్కు రాజేష్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందించిన పాఠ్య ప్రణాళికలను, అభ్యాస దీపికలను ఉపాధ్యాయులు సక్రమంగా ఉపయోగించుకొని, విద్యార్థులలో స్థాయికి తగిన అభ్యసన సామర్థ్యాలు పెంపొందించేలా కృషి చేయాలన్నారు. రేపటి తరాన్ని నిర్మించే జాతి


మాట్లాడుతున్న జిల్లా సెక్టోరియల్ అధికారి

నిర్మాతలు ఉపాధ్యాయులే అని,వత్తి పట్ల నిబద్ధత కలిగి ఉండి, విద్యార్థుల భావి జీవితానికి బాటలు వేయాలని అన్నారు. ప్రణాళికా బద్ధంగా బోధిస్తే ఆశించిన ఫలితాల సాధన సులభమే అని, విద్యార్థుల మనసుపై చెరగని ముద్ర వేసేలా పాఠ్యాంశాలు బోధించాలని అన్నారు. ప్రాథమిక స్థాయి విద్యార్థి జీవితానికి పునాది వంటిదని, ప్రాథమిక స్థాయిలో ఉపాధ్యాయులు విద్యార్థుల జీవిత నిర్మాతలని,వారిపై గురుతర బాధ్యత ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయురాలు రమణి,రిసోర్స్ పర్సన్‌లు రాపర్తి శ్రీధర్, మాచర్ల మహేష్, సీఆర్పీ రాజేష్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

నవతెలంగాణ-కథలాపూర్


ప్రారంభిస్తున్న నాయకులు

మండలంలోని తక్కళ్లపల్లి గ్రామంలో సీసీ రోడ్డు పనేఉలను బీసీ సెల్ మండల అధ్యక్షుడు అల్లకొండ లింగంగౌడ్ సోమవారం ప్రారంభించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం నిధుల నుంచి రోడ్డు నిర్మాణం పడుతున్నట్టు తెలిపారు.ఈ కార్యక్రమంలో దమ్మ తిరుపతిగౌడ్, భూపెల్లి లక్ష్మీ రాజం తదితరులు పాల్గొన్నారు.

రాగులా విశ్వేంద్ర ప్రసాద్‌కు పురోహిత బ్రహ్మ అవార్డు

నవతెలంగాణ-కోరుట్ల


అవార్డు అందుకుంటున్న బ్రహ్మ

మండలంలోని మాదాపూర్ గ్రామానికి చెందిన రాగులా విశ్వేంద్ర ప్రసాద్ శాస్త్రికి హైదారాబాద్‌లోని శిల్ప కళామందిర్‌లో సోమవారం పురోహిత బ్రహ్మ అవార్డును తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్, తెలంగాణ బీసీ చైర్మన్ వకులాభరణం చేతుల మీదుగా అవార్డు అందజేసి శాలువాతో సన్మానిం చారు. ఎంఎం కీరవాణి తండ్రి శివశక్తి దత్త పేరుమీద అవార్డు అందజేశారని, అవార్డు రావడం ఆనందంగా ఉందని విశ్వేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. వారికి జడ్పీటీసీ దారిశెట్టి లావణ్య రాజేష్, గ్రామ మాజీ సర్పంచ్ దారిశెట్టి రాజేష్, గ్రామ స్నేహితులు అభినందించారు.

అరుదైన శస్త్ర చికిత్స

నవతెలంగాణ-కోరుట్ల



పట్టణంలోని కోరుట్ల నర్సింగ్ హోమ్‌లో సోమవారం అరుదైన శస్త్ర చికిత్స చేశారు. ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డాక్టర్ స్వీటి అనూప్‌రావు మాట్లాడుతూ.. పట్టణానికి చెందిన నాజీయ కౌసర్(38) సంవత్సరాలు, 2రెండు సంవత్సరాలుగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఆదివారం కడుపునొప్పితో హాస్పిటల్‌కు రాగా వెంటనే పరీక్షలు నిర్వహించి కడుపులో గర్భా శయంలో 8 కిలోలు, అండాశయంలో 7 కిలోల గడ్డలు ఆపరేషన్ చేసి తీసివేసినట్టు తెలిపారు. రోగి ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు.

పెగడపల్లి ఎస్సైగా రామకృష్ణ బాధ్యతలు స్వీకరణ

నవతెలంగాణ -పెగడపల్లి



పెగడపల్లి మండల ఎస్సైగా రామకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పెగడపల్లిలో ఎస్సైగా పని చేసిన సతీష్ బదిలీపై గొల్లపల్లికి వెళ్లగా ధర్మపురిలో ఎస్సైగా పని చేసిన రామకృష్ణ బదిలీపై పెగడపల్లికి వచ్చారు. ఈ సందర్భం గా ఎస్సై మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణ కోసం మండల ప్రజలు సహకరించాలని కోరారు.

పెగడపల్లిలో ఘనంగా మార్కండేయ జయంతి

నవతెలంగాణ -పెగడపల్లి :పెగడపల్లి మండల కేంద్రంలోని మార్కండేయ దేవాలయంలో మార్కండేయ జయంతి సందర్భంగా సోమవారం ఆలయంలో అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాద వితరణ ,అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు గాజుల నర్సయ్య ,ప్రధాన కార్యదర్శి బోగ గంగాధర్, భోగ అశోక్, మల్లేశం, రవి, నర్సయ్య, రమేష్, వెంకటేశం, నారాయణ, ఆలయ అర్చకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీ మండల అధ్యక్షుడిగా కుసుమ శంకర్

నవతెలంగాణ- పెగడపల్లి


ఏకగ్రీవంగా ఎన్నికైన ఆర్ఎంపి, పిఎంపిలు

పెగడపల్లి మండల ఆర్ఎంపి, పిఎంపి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కుసుమ శంకర్, ప్రధాన కార్యదర్శిగా గాజుల గంగాధర్, కోశాధికారిగా కుంటాల శ్రీనివాస్‌ల ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఐదో సారి ఏకగ్రీవంగా ఎన్నికైన మండల అధ్యక్షుడు కుసుమ శంకర్ మాట్లాడుతూ.. నా ఎన్నికకు సహకరించిన ఆర్ఎంపీ, పీఎంపీ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపి, పిఎంపి అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి చిత్రలేఖనం పోటీలకు ఎంపికైన అంపి

నవతెలంగాణ-రాయికల్


అంపిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి చిత్రలేఖనం పోటీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలికలు)లో 9వ తరగతి చదువుతున్న ఎం.అంపి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన అంపిని ప్రధానో పాధ్యాయులు శ్రీపతి రాఘవులు, ఉపాధ్యాయులు పొన్నం రమేష్, రవీందర్, మల్లేశం, గంగ జమున, సత్యనారాయణ, వనజ జ్యోతి, నాగరాజు, శ్రావణ్, సుజాత అభినందించారు.

పాత్రికేయుని కుటుంబానికి ఆర్థిక సాయం అందించాలి

నవతెలంగాణ-రాయికల్ :పట్టణానికి చెందిన ముంజ ధర్మపురిగౌడ్ వివిధ పత్రికలలో పాత్రికేయునిగా పని చేసి ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో ఆయన కుటుంబ సభ్యులకు ప్రెస్ అకాడమీ ద్వారా ఆర్థిక సాయం అందజేయాలంటూ కుమ్మరిపల్లి గ్రామానికి చెందిన తునికి నాగరాజు జిల్లా కలెక్టర్ సముదాయ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వినతి పత్రం అందించారు.

డీఎస్సీలో ఖాళీగా ఉన్న టీచర్లకు అవకాశం ఇవ్వాలి

నవతెలంగాణ-జగిత్యాల:తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించే మెగా డీఎస్సీలో ఖాళీగా ఉన్నా డ్రాయింగ్, క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్లకు అవకాశం ఇవ్వాలని ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్ మధుకర్‌కు మ్యాడారపు మారుతి వినతి పత్రం సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం నుండి గాని ప్రయివేట్ రంగాల్లో ఎటువంటి ఉపాధి లేక కళను నలుగురికి నేర్పే అవకాశం లేక మాజీవితాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. గజం రవికాంత్, కె.నరేందర్, సురేష్ పాల్గొన్నారు.

గద్దర్ విగ్రహా ఏర్పాటుకు భూమి పూజ

నవతెలంగాణ-కోరుట్ల/ కథలాపూర్


భూమి పూజ చేస్తున్న నాయకులు

కథలాపూర్ మండలంలోని భూషన్‌రావు పేట గ్రామంలో ప్రజా యుద్ధ నౌక గద్దర్ విగ్రహా ఏర్పాటు కోసం సోమవారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమానికి ధూమ్‌దాం వ్యవస్థాపక అధ్యక్షుడు వంతడుపుల నాగరాజు హాజరై మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో ధూమ్ ధాం ఏర్పాటు చేసి కవులతో పాటు, గాయకులను ఏకం చేసి ఉద్యమం చేసిన గొప్ప వ్యక్తి గద్దరన్న అని కొనియడారు. అనంతరం సామాజిక తెలంగాణ ధూమ్ దాం రాష్ట్ర అధ్యక్షుడు మారంపెల్లి రవీందర్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం నంది అవార్డులను ఇప్పటి నుండి గద్దర్ పేరుతో అవార్డులను ఇస్తామని చెప్పడం సంతోషమని, ఈ పేరు మెగా స్టార్ చిరంజీవి మద్దతు పలికారని, గద్దర్ ఆశయాలను ముందుకు తీసుకుపోతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఓయు విద్యార్థి జేఏసీ చైర్మన్ భూసిపాక గణేష్, తెలంగాణ ప్రజా సంఘాల అధ్యక్షుడు పేట భాస్కర్, చెదలు సత్యనారాయణ, బీసీ సంక్షేమ అధ్యక్షులు యాగండ్ల రమేష్ గౌడ్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం


భూమి పూజ చేస్తున్న ఎంపీటీసీ శాంతి

ఇబ్రహీంపట్నం మండలంలోని వర్షకొండ, ఎర్దండి, డబ్బా, గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. డబ్బా గ్రామంలో మల్లన్న గుడి వద్ద రూ.4 లక్షల ఉపాధి హామీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్, స్థానిక ఎంపీటీసీ దేశెట్టిశాంతి చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్, ఇబ్రహీంపట్నం ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు పోనకంటి వెంకట్, డబ్బా కాంగ్రెస్ నాయకులు మాజీ ఉప సర్పంచ్ బూస రాజేష్, మాజీ సర్పంచ్ గంగాధర్, దేశెట్టి జీవన్, తేలు రమేష్, జానా శంకర్, దుద్దుల లింగన్న ,పుప్పాల శ్రీను, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

కుంటల్లో నీరు నింపాలని ఎంపీపీకి వినతి

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం


వినతి పత్రం అందజేస్తున్న ఎంపీపీ

మండలంలోని గోదురు గ్రామంలో ఉన్న జొన్నకుంట, పోచమ్మ కుంటను ఎస్సారెస్పీ నుంచి నీటిని రెండు కుంటలకు నింపాలని ఎంపీపీ జాజాల భీమేశ్వరి ఇరిగేషన్ ఏఈ సుకన్యకు సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామంలో రెండు కుంటలలో నీరు నిల్వ లేకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటక పోతున్నాయని, పశువులకు గొర్లకు తాగడానికి నీరు కూడా లేకుండా పోతున్నాయని వాపోయారు. ఎలాగైనా ఎస్సారెస్పీ కాలువ ద్వారా ప్రత్యేక పైప్ లైన్ ద్వారా అయినా కుంటలను నింపాలని కోరారు.

మాదిగ సంఘ అధ్యక్షుడిగా రాజేష్

నవతలంగాణ-కోరుట్ల

పట్టణంలోని అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడిగా శనిగారపు రాజేష్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా శనిగారపు నరేష్, ప్రధాన కార్యదర్శిగా మోర్తాడ్ రాజశేఖర్, కోశాధికారిగా చిట్యాల ప్రభాకర్‌లు ఎన్నికయ్యారు.

గృహజ్యోతి దరఖాస్తులపై విచారణ

నవతెలంగాణ-కోరుట్ల


అప్లికేషన్‌లను విచారిస్తున్న అధికారులు

కోరుట్ల పట్టణానికి అనుబంధ గ్రామమైన యెకీంపూర్‌లో గృహజ్యోతి పథకంలో భాగంగా ఇచ్చే 200 యూనిట్ల కరెంట్‌పైకు వచ్చిన దరఖాస్తులపై అధికారులు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా మ్యాదరి లక్ష్మణ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్య క్రమంలో ఉరుమడ్ల వెంకట్, మేడిపల్లి రాఘవరెడ్డి, కళ్ళెం శంకర్, ఎర్ర నారాయణ, చిన్న గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీరు రావడం లేదని ప్రజావాణిలో ఫిర్యాదు

నవతెలంగాణ-రాయికల్



మండలంలోని కుమ్మరిపల్లి గ్రామానికి చెందిన తునికి శ్రీను మిషన్ భగీరథ పథకం నిరుపయోగంగా మారిందని సోమవారం జిల్లా కలెక్టర్ సముదాయ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. మిషన్ భగీరథ అధికారులకు, గ్రామ కార్యదర్శికి ఎన్ని సార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని,సమాచార హక్కు చట్టం ద్వారా సమా చారం కోరినప్పటికీ గ్రామానికి భగీరథ నీరు వస్తుందని తప్పుడు సమాచారం ఇస్తున్నారని, కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని వృథా చేశారంటూ సంబంధిత గుత్తేదారుపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

మల్యాల ఎస్ఐగా అబ్దుల్ రహీం

నవతెలంగాణ-మల్యాల



మల్యాల పోలీస్ స్టేషన్ ఎస్ఐగా తీగల అశోక్ బదిలీ అయ్యారు. కొత్తగా మల్యాల ఎస్ఐగా అబ్దుల్ రహీం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పలువురికి వారికి శుభాకాంక్షలు తెలిపారు.

మల్లాపూర్ ఎస్సై కిరణ్ బాధ్యతలు స్వీకరణ

నవతెలంగాణ-మల్లాపూర్


ఎస్సై కిరణ్ కుమార్

మల్లాపూర్ మండల ఎస్సైగా పబ్బా కిరణ్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసు కున్న పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. అనంతరం సిబ్బంది నాయకులు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

జాతీయ అథ్లెటిక్స్‌కు యోగేష్


విద్యార్థి యోగేష్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

నవతెలంగాణ-పెగడపల్లి

పెగడపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో 8వ తరగతి చదువు తున్న విద్యార్థి కంది యోగేష్ జాతీయ స్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్‌కు ఎంపికైనట్టు వ్యాయామ ఉపాధ్యాయుడు దామర రమేష్ తెలిపారు. డిసెంబర్ 20న మెట్ పల్లిలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి గుజరాత్‌లోని అహ్మ దాబాద్‌లో ఈనెల 16, 17, 18న జరిగే అండర్ 14 విభాగంలో 19వ జాతీయ అంతర జిల్లాల అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ 60 మీటర్స్ రన్నింగ్, లాంగ్ జంప్, 600 మీటర్స్ రన్నింగ్ విభాగంలో పాల్గొంటాడని తెలిపారు. యోగేష్ ఎంపిక పట్ల గ్రామ మాజీ సర్పంచ్ మెరుగు శ్రీనివాస్ రూ.3 వేలు, ఉపాధ్యాయుడి కిషన్‌రెడ్డి రూ.2వేలు, ఉపాధ్యాయ బృందం రూ.3 వేల ఆర్థికంగా సహాయం అందించి విద్యార్థి యోగేష్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం లలిత, పిఈటి రమేష్, ఉపాధ్యాయులు లచ్చయ్య కిషన్‌రెడ్డి, తిరుపతి, జ్యోతి, విజయలక్ష్మి, శ్రీనివాస్, వేణుగోపాల్, మంజు భార్గవి, అనురాధ, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో శ్రీనివాస్‌కు సన్మానం


ఎంపీడీవోకు సన్మానం చేస్తున్న కార్యాలయ సిబ్బంది

నవ తెలంగాణ-గంభీరావుపేట:
విధి నిర్వహణలో భాగంగా గంభీరావుపేట మండల ఇన్చార్జ్ ఎంపీడీవోగా విధులు నిర్వహించిన ఎం.శ్రీనివాస్ జగిత్యాల జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాలకు సంబంధించిన గ్రామపంచాయతీ కార్యదర్శులు మరియు ఎంపీడీవో కార్యాలయ సిబ్బందితో గ్రామ పంచాయతీ సిబ్బంది శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రాజశేఖర్, మేజర్ గ్రామపంచాయతీ గంభీరావుపేట ఇన్చార్జి ఈవో శిరీష, పలు గ్రామ పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పంచాయతి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్లో బీసీలకు మొండిచేయి

నవ తెలంగాణ సిరిసిల్ల టౌన్


మాట్లాడుతున్న కంచర్ల రవి గౌడ్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీలకు మొండిచేయి చూపారని బీసి విద్యార్థి సంఘంలో రాష్ట్ర కో ఆర్డినేటర్ కంచర్ల రవి గౌడ్ అన్నారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడడారు. రాష్ట్రంలో అత్యధిక శాతం వున్న బీసీ లకు బడ్జెట్ లో 3.4 శాతం మాత్రమే కేటాయించడం బాధాకరమన్నారు. బీసీలంటే సీఎం రేవంత్‌రెడ్డికి చులకన భావన ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ లకు ప్రవేశ పెట్టిన 8 వేల కోట్ల రూపాయల లో బిసి లకు స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్, సంక్షేమ పథకాలు కి 3400 కోట్ల బకాయిలు ఉన్నాయని పేర్కొన్నారు. మిగిలిన కొద్దిపాటి నిధులతో బీసీ ల అభివృద్ధి ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. మహాత్మా జ్యోతిభాపులే పేరు తో బీసీ సబ్ ప్లాన్ తీసుకొస్తామని, ప్రతి ఆర్థిక సంవత్సరానికి 20 వేల కోట్లు కేటాయిస్తామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పి, ఇప్పుడు 8 వేల కోట్ల కేటాయించడం సరికాదన్నారు. ఇచ్చిన హామీ మేరకు బీసీ బడ్జెట్ను 20 వేల కోట్లు కి పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లో జిల్లా నాయకులు మట్టే శ్రీనివాస్ నవీన్, సిరిసిల్ల పట్టణ అధ్యక్షులు రుద్రవెని సుజిత్, కుమార్, తంగళ్లపల్లి మండల అధ్యక్షులు గౌరు రాకేష్ నవీన్, శ్రీకాంత్, సిద్ధు, ప్రణయ్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

స్వీయ రక్షణతో పాటు కుటుంబం క్షేమం కోసం హెల్మెట్

జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

నవ తెలంగాణ సిరిసిల్ల


ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ అఖిల్ మహాజన్

ప్రతి ద్విచక్ర వాహనదారుడు తన స్వీయ రక్షణతో పాటు తన కుటుంబ క్షేమం కోసం హెల్మెట్ తప్పక ధరించాలని, ప్రతి వాహనదారుడు ట్రాఫిక్-రోడ్డు భద్రత నియమాలు పాటించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పిలుపునిచ్చారు.జాతీయ రోడ్ భద్రతా వారోత్సవాల సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణంలోని పోలీస్ స్టేషన్ నుండి గాంధీ,అంబేద్కర్,గోపాల్ నగర్, కొత్త బస్టాండ్,నేతన్న చౌక్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఎస్పీ అఖిల్ మహాజన్ హాజరై బైక్ ర్యాలీలో పాల్గొన్న అనంతరం ఆయన మాట్లాడుతూ వాహనదారులు చేసే చిన్న చిన్న తప్పిదాల కారణంగా జరిగే రోడ్డు ప్రమాదాల కారణంగా వాహనదారులు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోందని,ముఖ్యంగా ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం తనవంతు బాధ్యత గుర్తించాల్సిన అవసరం వుందని. ట్రాఫిక్ నియమాలను అతిక్రమించి వాహనాలను నడపడం ఒక హీరోయిజంగా భవించవద్దని, అలసత్వం వలన జరిగే రోడ్డు ప్రమాదాల కారణంగా కుటుంబాలు వీధిన పడుతున్నాయని, ముఖ్యంగా తమ కుటుంబ క్షేమంకన్నా మన క్షేమం కోసం నిరంతరం శ్రమించేది పోలీసులు మాత్రమేననిప్రతి వాహనదారుడు క్రమశిక్షణతో వాహనం నడపడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించుకోవచ్చుని, ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలను నడపాలని తెలిపారు.వాహనదారులు జరిమానాలు పడ్డాయని అనుకోకుండా వుండాలంటే ప్రతి ఒక్క వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, అలాగే రోడ్డు ప్రమాదాల్లో అధికంగా తలకు గాయం కావడం వలన ద్విచక్రవాహనదారులు మరణించడం జరుగుతోంది. కావున, ప్రతి ద్విచక్రవాహనదారుడు హెల్మెట్ తప్పని సరిగా ధరించి వాహనం నడపాలని అన్నారు.ఈ ర్యాలీలో డిఎస్పీ ఉదయ్ రెడ్డి,టౌన్ సి.ఐ రఘుపతి, ట్రాఫిక్ ఎస్.ఐ రాజు, పోలీస్ సిబ్బంది, యువకులు పాల్గొన్నారు..

పాఠశాలలను సందర్శించిన మానిటరింగ్ బృందం

నవ తెలంగాణ-బోయినిపల్లి


రికార్డులను తనిఖీ చేస్తున్న ఉపాధ్యాయులు

బోయినిపల్లి మండలంలోని విలాసాగర్ హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు బొలగం శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం కొదురుపాక , కేజీబి ,బోయినీ పల్లి ,వెంకట్రావు పల్లే, నరసింగపూర్ తదితర ప్రభుత్వ పాఠశాలలను మానిటరింగ్ బృందం సందర్శించారు. ఈ బృందం ఆయా పాఠశాలలోని అంతర్గత మూల్యాంకనం సంబంధించిన రికార్డులను పరీక్ష పత్రాలను పరిశీలించారు. 10వ తరగతి విద్యార్థులకు ఇంటర్నల్ 20 మార్కులు ఆన్లైన్ లో నమోదు చేసే కార్యక్రమం నిర్వహించారు.ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం రాజిరెడ్డి, పి మోహనకృష్ణ తదితరులున్నారు.

ఘనంగా మార్కండేయ జయంతి వేడుకలు



నవతెలంగాణ, ముస్తాబాద్
మండల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ జయంతి ఉత్సవాలు సోమవారం ఘనముగా నిర్వహించారు. గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు.అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ అన్నం రాజేందర్ రెడ్డి , పద్మశాలి మండల అధ్యక్షులు గూడూరు భరత్, పట్టణ అధ్యక్షులు తడక బాల కిషన్ ,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గజ్జల రాజు, ఎంపిటిసి గుండెల్లి శ్రీనివాస్ , యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు రంజాని నరేష్, మిరిదొడ్డి భాను, ఏడ్డెంది మహేందర్, దేవానందం, భూమేష్, బన్నీనందు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మార్కండేయ జయంతి వేడుకలు

నవతెలంగాణ-సిరిసిల్ల టౌన్
పద్మశాలీల ఆరాధ్య దైవం శ్రీ శివ భక్త మార్కండేయ స్వామి జయంతి వేడుకలను సిరిసిల్ల పట్టణంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. సిరిసిల్ల పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు వేద మంత్రాల సమక్షంలో వేడుకలు కన్నుల పండువగ జరిగాయి. మార్కండేయ దేవాలయ ఆవరణలో ప్రత్యేక పూజలు,హోమయజ్ఞాలు నిర్వహించారు. భక్తులు, పద్మశాలి కుల బాంధవులు అత్యధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం మార్కండేయ స్వామి శోభాయాత్రని నిర్వహించారు. శివ భక్త మార్కండేయ స్వామి చిత్రపటం, విగ్రహాన్ని పురవీధుల గుండా డప్పు చప్పుల మధ్య ఊరేగింపు చేపట్టారు. గాంధీ చౌక్ అంబేద్కర్, నేతన్న చౌరస్తా మీదుగా పెద్ద బజార్, తిరిగి మార్కండేయ దేవాలయానికి వరకు చేపట్టారు. శోభాయాత్రలో చిన్నారులు, మహిళలు నృత్య ప్రదర్శన, ఒగ్గుడోలు ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది.

హక్కుల రక్షణ కోసమే ఫిబ్రవరి 16 సమ్మె

సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ


సమ్మె పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ -తంగళ్ళపల్లి
కార్మికుల చట్టాలు,హక్కుల రక్షణ కోసమే ఫిబ్రవరి 16 దేశవ్యాప్త సమ్మె చేయనున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ అన్నారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్,వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో తంగళ్ళపల్లి మండల కేంద్రంలో ఫిబ్రవరి -16 దేశవ్యాప్త సమ్మె-గ్రామీణ బంద్ పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు మల్యాల నర్సయ్య మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక కార్పొరేట్, మతతత్వ విధానాలను ప్రతిఘటిస్తూ దేశంలోని అన్ని జాతీయ కార్మిక సంఘాలు,ఉద్యోగ సంఘాలు, రైతు సంఘాల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16 దేశవ్యాప్త సమ్మె చేపట్టడం జరుగుతుందన్నారు. కార్మిక చట్టాల హక్కుల పరిరక్షణ కొరకు జరుగుతున్న సమ్మెలో జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మికులందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఫిబ్రవరి-16 శుక్రవారం రోజున జిల్లా కేంద్రంతో పాటుగా వేములవాడ కేంద్రంగా పెద్ద ఎత్తున కార్మిక ర్యాలీ ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూజిల్లా నాయకులు అన్నల్దాస్ గణేష్, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు బుర్ర శ్రీనివాస్, లింగంపల్లి కృష్ణవేణి, వర్కోలు మల్లయ్య, అంజయ్య, రవీందర్, చంద్రం, అనిల్, రాములు, అశోక్, ఎల్లం, బుధవ్వ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు శాఖలో ఆర్మ్డ్ రిజర్వ్ విభాగం పాత్ర చాలా కీలకం

ఫైరింగ్ లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన సిబ్బందికి బహుమతులు ప్రధానం



నవ తెలంగాణ-సిరిసిల్ల
పోలీస్ శాఖలో ఆర్మ్డు రిజర్వ్ విభాగం పాత్ర చాలా కీలకమని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు సాయుధ దళాల వార్షిక పునర్ ఉచ్చరణ (మోబిలైజేషన్) ముగింపు కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా పోలీస్ హెడ్ క్వాటర్స్ లో సాయుధ ధళ పోలీసుల సమీకరణ కవాతు (మొబిలైజేషన్ పెరేడు)ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై సాయుధ దళాల గౌరవ వందనాన్ని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ స్వీకరించారుఈ సందర్బంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ పోలీస్ సమీకరణ కవాతు(మొబిలైజేషన్ పెరేడు) ప్రతి సంవత్సరం లాగే ఈసారి కూడా సాయుధ దళ పోలీసులకు రెండు వారాలు శిక్షణ ఇవ్వడం జరిగింది అన్నారు.. ఇందులో భాగంగా ఆర్మ్ డ్ రిజర్వ్/ సాయుధ దళాలు యాన్యువల్ మొబిలైజేషన్ శిక్షణలో ఆర్మ్ డ్రిల్, లాఠీ డ్రిల్, ఫుట్ డ్రిల్, సెర్మొనల్ డ్రిల్, గార్డ్ మౌంటింగ్, మాబ్ఆపరేషన్, ఫైరింగ్,నాకబంది, పికెట్స్, విఐపిబందోబస్త్ డ్యూటీస్,ప్రిసనర్,క్యాష్ ఎస్కార్ట్స్,లా అండ్ ఆర్డర్ వంటి అంశాలపై శిక్షణనిచ్చామన్నారు.పోలీస్ ఉద్యోగం ఎంతో బాధ్యతాయుతమైనదని మారుతున్న పరిస్థితుల క్రమంలో సాయుధ దళ సిబ్బంది సైతం శాంతి భద్రతల పరిరక్షణ, బందోబస్తు విధులలో కీలక పాత్ర వహిస్తున్నారని చెప్పారు.పోలీసులు తమ వృత్తి నైపుణ్యాలను మర్చిపోకుండా ఎప్పటికప్పుడు గుర్తు చేసుకుంటూ,శారీరక దారుఢ్యం సక్రమంగా ఉండేలా చూసుకోవడానికి ఈ మోబిలైజేషన్ ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు.గత సంవత్సరం అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆర్మ్డ్ రిజర్వ్ సిబ్బంది పని తీరు అమోఘం అని, అదే ఉత్సాహంతో భవిష్యత్తులో ఎదురైయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికో సిద్ధంగా ఉండాలని సిబ్బందికి పిలుపునిచ్చారు.ఆర్మ్డ్ రిజర్వ్ సిబ్బంది మొత్తం ఒకే దగ్గరకు వచ్చి శిక్షణ సమయంలో నేర్చుకున్న అంశాలను మరోసారి గుర్తు చేసుకునే అవకాశం మోబిలైజేషన్ ద్వారా కలుగుతుందని చెప్పారు.వ్యాయామం, యోగా నిత్య జీవితంలోనూ భాగం చేసుకోవాలన్నారు. వార్షిక మొబైలైజేషన్ లో భాగంగా అధికారులకు, సిబ్బందికి నిర్వహించిన ఫైరింగ్ లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి బహమతులు ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య,డిఎస్పీ లు ఉదయ్ రెడ్డి, నాగేంద్రచరి, రవికుమార్, సి.ఐ లు అనిల్ కుమార్, ఆర్.ఐ లు యాదగిరి, మాధుకర్, రమేష్,ఎస్.ఐ లు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి పెట్రోల్ బంక్‌లో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి

జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

నవ తెలంగాణ-సిరిసిల్ల



ప్రతి పెట్రోల్ బంక్ లో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహజన్ అన్నారు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా పరిధిలో ఉన్న పెట్రోల్ బంక్ యజమానులు, నిర్వహకులతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూపలు సందర్భాల్లో ప్లాస్టిక్ బాటల్స్ లేదా క్యాన్‌లలో పెట్రోల్ కొనుక్కొని కొంతమంది నేరస్తులు పలురకాల నేరాలకు పాల్పడుతున్నారని, జిల్లాలో గల పెట్రోల్ బంక్ యజమానులు ఎవరు కూడా పెట్రోలియం యాక్ట్ 2002 ప్రకారం పెట్రోల్ ను ప్లాస్టిక్ బాటల్స్ లేదా క్యాన్‌లలో పోయవద్దని సూచించారు.ఎవరైనా పై చట్టాన్ని ఉల్లంగించి, బాటల్స్ లేదా క్యాన్ లలో పెట్రోల్ పోసినట్లైతే అట్టి పెట్రోల్ బంక్ యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు పెట్రోల్ బంక్ లైసెన్స్ రద్దుకు సిఫారసు చేయడం జరుగుతుందని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. పెట్రోల్ బంక్ లకు నిత్యం వాహనదారులు పెట్రోల్ నిమిత్తం ఎక్కువ సంఖ్యలో వస్తుంటారని అందువలన పబ్లిక్ సేఫ్టీ యాక్ట్ కింద జిల్లాలో ఉన్న ప్రతి పెట్రోల్ బంక్‌లలో హై రెజల్యూషన్, నైట్ విజన్ కలిగిన సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని తద్వారా నేరాలను నియంత్రించవచ్చుని, నేరస్తులను,ఏదైనా ప్రమాదాలు, సంఘటనలు జరిగినా త్వరగా గుర్తించవచ్చున్నారు. ఎస్పీ వెంబడి డిఎస్పీలు ఉదయ్ రెడ్డి, నాగేంద్రచరి, టౌన్ సి.ఐ రఘుపతి,జిల్లాలోని పెట్రోల్ బంక్ యజమానులు పాల్గొన్నారు.

యువకుడి దారుణ హత్య..

నవతెలంగాణ వేములవాడ



వేములవాడ పట్టణంలోని సంగీత నిలయం సమీపంలో ఓ యువకుడిని గొంతు కోసి దారుణంగా హత్య చేసిన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు వేములవాడ పట్టణానికి చెందిన 10 వార్డ ఓల్డ్ అర్బన్ కాలనీకి చెందిన కులుకుంట్ల శ్రీధర్‌గా (25) పోలీసులు గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని పట్టణ సీఐ కరుణాకర్ తెలిపారు. మృతుని భార్య పాత కక్షలు కారణంగానే ఈ హత్య జరిగినట్లుగా అనుమానిస్తున్నట్లుగా పోలీసులకు తెలిపారు. సంఘటన స్థలాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లా ట్రైనీ ఎస్పీ రాహుల్ రెడ్డి, డీఎస్పీ నాగేంద్ర చారి పరిశీలించారు.

ఎంపీడీవోలను సన్మానించిన జడ్పీ చైర్ పర్సన్

నవ తెలంగాణ-సిరిసిల్ల టౌన్



బదిలీ పై వెళ్తున్న ఎంపీడీవోలను జడ్పీ జడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ సోమవారం సన్మానించారు. జడ్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఎంపీడీవో లను శాలువాలతో సత్కరిం చారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్ పర్సన్ మాట్లాడు తూ మాజీ సీఎం కెసిఆర్ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పల్లె ప్రగతి కార్యక్రమాన్ని మన జిల్లాలో ఎంపీడీవోలు విజయవంతం చేశారని కొనియాడారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు విషయంలో చాలా సమర్థంగా పని చేశారని అన్నారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు పచ్చదనం, పరిశుభ్రత కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేసెలా ప్రతి ఒక్క కార్యదర్శి కి మార్గనిర్దేశనం చేస్తూ గ్రామాలు పచ్చదనంగా ఉండేలా కృషి చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో గౌతమ్ రెడ్డి, అడిషనల్ డీఆర్డీవో మదన్ మోహన్, ఎంపీడీవోలు, అధికారులు పాల్గొన్నారు.

అర్జీలకు పరిష్కారం చూపాలి

ప్రజావాణిలో కలెక్టర్ అనురాగ్ జయంతి

నవతెలంగాణ-సిరిసిల్ల



ప్రజావాణి అర్జీలకు పరిష్కారం చూపాలని కలెక్టర్ అనురాగ్ జయంతి జిల్లా అధికారులకు సూచించారు. నిర్ణీత గడువులోగా వినతులు పరిష్కరించాలన్నారు. సిరిసిల్ల సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. తనకు పెన్షన్ ఇప్పించాలని కోరుతూ సిరిసిల్లలోని బీవైనగర్ కు చెందిన దివ్యాంగుడు కస్తూరి పోశెట్టి ప్రజావాణికి రాగా, కలెక్టర్ అతడి వద్దకు వెళ్లి దరఖాస్తు స్వీకరించారు. సమస్య పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ శాఖకు 22, జిల్లా ఎస్పీకి 4, డీఎంఅండ్ హెచ్‌వో, డీఆర్డీఓ, సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయానికి 2 చొప్పున, వివిధ శాఖలకు కలిపి మొత్తం41 దరఖా స్తులు వచ్చాయి. ప్రజావాణిలో అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, వేములవాడ ఆర్డీఓ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణించి గ్రామ పేరు నిలబెట్టాలి



నవ తెలంగాణ-వీర్నపల్లి
వీర్నపల్లి మండలం కేంద్రంలో సోమవారం క్రికెట్ టిమ్‌కు మాజీ ఉప సర్పంచ్ ఫోరం అధ్యక్షులు బోయిని రవి టీషర్ట్ అందించి క్రీడలు మానశిక ఉల్లాసాన్ని ఉత్సాహాన్ని అందిస్తాయన్నారు. క్రీడాకారులు వారిని శాలువ కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం,నాయకులు కాజి బాబు, క్రీడాకారులు అజయ్, శ్రీకాంత్ , నరేష్, సుమంత్, ప్రవీణ్, కార్తిక్, చందు , ప్రశాంత్, రాకేష్ ఉన్నారు.

పలు గ్రామాల్లో శానిటేషన్ కార్యక్రమం

నవ తెలంగాణ-వీర్నపల్లి



వీర్నపల్లి మండలం పలు గ్రామాల్లో స్పెషల్ శానిటేషన్ కార్యక్రమంను సోమవారం నిర్వహించారు గ్రామాల్లో స్పెషల్ శానిటేషన్ సందర్భంగా గ్రామాల్లో పాఠశాలల్లో ఉన్న చెత్త చెదారం, వాటర్ ట్యాంకు లను శుభ్రం చేయడం, టాయిలెట్ రూం క్లినిక్ , సిసి రోడ్లు,మురికి కాలువ పెరుక పోయిన చెత్త చెదారం గ్రామ పంచాయతి కార్మికులు పరిసరాలను శుభ్రంగా చేశారని ఎంపీడీవో నరేష్ తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు ఉన్నారు.

సైన్స్ పదర్శనలో కేజీబీవీ విద్యార్థి ప్రతిభ

నవ తెలంగాణ వీర్నపల్లి



వీర్నపల్లి మండలం కస్తూరిబా గాంధీ పాఠశాల విద్యార్థి ఇన్స్పైర్ మనాక్ సైన్స్ జిల్లా స్థాయి ప్రదర్శన పోటీల్లో వీర్నపల్లి కేజీబీవీ విద్యార్థి శ్రీజ 10 పదో తరగతి ఎంపికైంది. జిల్లా స్థాయిలో 67 ప్రదర్శనలో నిర్వహించగా 7 ప్రాజెక్ట్ లు ఎంపికై. లైఫ్ సేవింగ్ స్టిక్ అనే ప్రాజెక్ట్ లో రాష్ట్ర స్థాయికి శ్రీజ ఎంపిక కావడం తో స్పెషల్ ఆఫీసర్ నీలిమ, ఉపాధ్యాయ బృందం గైడ్ టీచర్ ను విద్యార్థి శ్రీజ ను అభినందించారు.

కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట



ఎల్లారెడ్డిపేట మండలంలోని గొల్లపల్లి గ్రామంలోని ప్రధాన రహదారిపై రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు అన్వేష్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మర్రి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరిష్‌రావు దిష్టి బొమ్మను దహనం చేశారు. గత ప్రభుత్వంలో కృష్ణ జలాలను దోపిడి చేసి తెలంగాణ ప్రజలకు బీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్రంగా అన్యాయం చేసిందన్నారు. కేసీఆర్ నల్లగొండ కృష్ణా జలాల మీద బహిరంగ సభ నిర్వహిస్తుండడంతో రాష్ట్ర కిసాన్ సెల్ పిలుపుమేరకు కేసీఆర్, హరీష్‌రావు దిష్టి బొమ్మను దహనం చేశామన్నారు. కృష్ణా జలాల దోపిడిపై గత ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు తీవ్ర అన్యాయం చేసిందని వారు చేసిన తప్పును కప్పిపుచ్చుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వంపై నెట్టివేయడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా మైనార్టీ అధ్యక్షులు షేక్ సాహెబ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వంగ గిరిధర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మర్రి నారాయణరెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షులు గోగూరి శ్రీనివాస్‌రెడ్డి, మచ్చ రాజిరెడ్డి, పందిర్ల సుధాకర్ గౌడ్, మాజీ ప్రధాన కార్యదర్శి పందిర్ల నారాగౌడ్, పాశం నాగిరెడ్డి, నర్ర భగవంత రెడ్డి, ఎన్నారై లాల, గుర్రాల మల్లారెడ్డి, బండి పర్శరాములు, గ్రామశాఖ అధ్యక్షులు గుడ్ల శ్రీనివాస్, జనగామ రమేష్, అందే బాలయ్య రవిలు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘానికి 100 కుర్చీల వితరణ

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట



ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన పద్మశాలి సంఘానికి సింగిల్ విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి సోమవారం 100 కుర్చీలు అందజేశారు. ఈ కుర్చీలను మార్కండేయ జయంతి సందర్భంగా మార్కండేయ గుడి ఆవరణలో పద్మశాలి సంఘ సభ్యులకు అందజేశారు. పద్మశాలి సంఘ సభ్యులు సింగిల్ విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డిని శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, ఎంపిపి పిల్లి రేణుక, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, ఎంపిటిసిలు పందిర్ల నాగరాణి, ఎనగందుల అనసూయ, పట్టణ అధ్యక్షులు బండారి బాల్‌రెడ్డి, నంది కిషన్, పద్మశాలి సంఘం అధ్యక్షులు రాపెల్లి దేవంతం, కార్యదర్శి వనం రమేష్, దూస శ్రీనివాస్, సుంకి భాస్కర్, దోమల భాస్కర్, వనం బాలరాజు, పోతు ఆంజనేయులు, మేగి నర్సయ్య, వనం ఎల్లయ్య, రాపెల్లి అంబదాస్, రాపెల్లి రమేష్, వనం శ్రీధర్, సుంకి ప్రకాష్, దొడ్ల సంజీవ్, గోషికే దేవదాసు, ఆడేపు అజయ్, బిఆర్ఎస్ నాయకులు పందిర్ల పరుశరాములు, ఎనగందుల నర్సింలు, సంఘ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట



ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో గల రైతు చర్చ మండలిలో ప్రతిమ మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మోగా వైద్య శిబిరం సోమవారం విజయవంతంగా ముగిసింది. ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతం కావడంపట్ల కళాశాల మర్కెటింగ్ చైర్మన్ కౌశిక్, ఒగ్గు బాలరాజు యాదవ్‌ను అభినందించారు. ఉచిత శిబిరంలో 300ల మంది వైద్యులతో పరీక్షలు చేయించుకున్నారు. జనరల్ ఫిజీషియన్, పిల్లల వైద్య నిపుణులు, ఎముకల వైద్య నిపుణులు, జనరల్ సర్జన్‌తో పాటుగా వివిధ టెస్టులు చేయడానికి వచ్చిన సిబ్బంది వచ్చిన రోగులకు విశిష్టమైన సేవలు అందించారు. ఈ శిబిరంలో ఉచితంగా క్యాంప్‌కు హాజరైన రోగులకు 2.50 లక్షల రూపాయల మందులు పంపిణీ చేశారు. ఉచిత శిబిరం ఏర్పాటుకు సహకరించిన ప్రతిమ ఫౌండేషన్ ప్రోగాం మేనేజర్ గీతారెడ్డి, ప్రేమ్‌సాగర్, సిఈవో ప్రసాద్‌రావు, ఏరియా కోఆర్డినేటర్ బాల్ శంకర్‌లు క్యాంప్ ఏర్పాటుకు సహకరించారు. వీరికి క్యాంపు ఆర్గనైజర్ ఒగ్గు బాలరాజుయాదవ్ ధన్యవాదలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి పందిర్ల నాగరాణి, రైతు చర్చ మండల అధ్యక్షులు చందుపట్ల రాజిరెడ్డి, నేవూరి శ్రీనివాస్‌రెడ్డి, మండల రెడ్డి సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షులు గన్న మల్లారెడ్డి, ఆశావర్కర్లు సరిత, రజితలు పాల్గొన్నారు.

రిలే నిరాహార దీక్ష..


రిలే నిరాహార దీక్ష చేస్తున్న భూ నిర్వాసితులు

నవతెలంగాణ-వేములవాడ
కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వేలైన్లో విలువైన భూమిని కోల్పోతున్న నిర్వాసితుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు విశ్రమించబోయేది లేదని డా. కొండ దేవయ్య అన్నారు. సోమవారం వేములవాడ పట్టణంలోని మున్నూరు కాపు నిత్యాన సత్రం వద్ద రిలే నిరాహార దీక్షను చేపట్టారు. భూనిర్వాసితులకు మద్దతు తెలుపుతూ డాక్టర్ కొండ దేవయ్య రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు. కొండ దేవయ్య మాట్లాడుతూ భూనిర్వాసితుల సమస్యలు పరిష్కారం అయ్యేవరకు రిలే నిరాహార దీక్షను విశ్రమించమని అన్నారు. ఈ సమస్యలపై జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతికి వినతి పత్రాన్ని అందించినట్లు పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ భూనిర్వాసితులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. వేములవాడలో ప్రజాహిత యాత్ర చేస్తున్న బండి సంజయ్‌ని కలిసి భూనిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని కోరామని అన్నారు. కార్యక్రమంలో జడల శ్రీనివాస్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

శివగల పల్లెలో దొంగల బీభత్సం

వరుస చోరీలతో బెంబేలేత్తున్న జనం

పోలీసులకు సవాల్‌గా మారిన వరుస దొంగతనాలు



నవ తెలంగాణ-కోనరవు పేట
వరుసగా దొంగతనాలు చేసుకుంటూ ప్రజలకు, పోలీసులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న దొంగలు మళ్లీ దొంగతనానికి పాల్పడి పోలీస్లకు సవాల్ విసిరారు. సోమవారం తెల్లవారు జామున కోని మండలం శివంగళపల్లిలో తాళం వేసి ఉన్న మూడు ఇండ్లలో చోరీకి పాల్పడ్డారు. రెండు రోజుల క్రితం మరస్పేటలో దొంగతనానికి పాల్పడిన ఇద్దరు ముసుగులు ధరించిన దొంగల ముఠా, వారే తిరిగి చోరీలకు పాల్పడినట్లు పోలీస్లు గుర్తించారు. గ్రామానికి చెందిన గూడూరి లక్ష్మినారాయణ ఇంట్లో చొరబడ్డ దొంగలు రూ.5 వేల నగదు, బొడ్డు దేవయ్య ఇంట్లో నుంచి 35 తులాల వెండి అభరణాల లక్ష్మి ఇంట్లోకి వెళ్లిన దొంగలు 25 తులాల వెండి ఆభరణాలతో పాటు రూ.3 వేల నగదును ఎత్తుకెళ్లారు. బాధిత ఫిర్యాదుల మేరకు ఎస్సై అంజనేయులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి, దొంగతనాలు నివారించేందుకు తగినంతగా సిబ్బందిని కేటాయించి, మా ప్రజలకు గట్టి భద్రత కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేనిని కలిసిన పెద్దపల్లి నాయకులు

నవతెలంగాణ-పెద్దపల్లి టౌన్

సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంని ఆయన నివాసంలో పెద్దపల్లి సీపీఎం నాయకులు కలిసి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.గత నెలలో ఆరోగ్య సమస్యతో హాస్పిటల్‌లో చేరిన తమ్మినేని సోమవారం ఖమ్మం జిల్లాలోని తెల్దార్ పల్లి గ్రామంలో వారి నివాసానికి వెళ్లి వారి ఆరోగ్య పరిస్థిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకొని మళ్లీ ప్రజా సమస్యల కోసం పోరాడేందుకు ప్రజలకి రావాలని కోరారు. తెలంగాణలో వ్యాప్తంగా మహాజన పాదయాత్ర సుమారు 4500 కిలోమీటర్లు చేసిన ప్రజా నాయకుడు తమ్మినేని నిరంతరం ప్రజా సమస్యలు పరిష్కరించాలని పోరాడుతూ, తెలంగాణ వ్యాప్తంగా



సీపీఎం నాయకులకు, ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటూ అనేక ఉద్యమలు నిర్వహించిన తమ్మినేని త్వరగా మళ్ళీ ప్రజల్లోకి రావాలని కోరారు. తమ్మినేని వీరభద్రంని కలిసిన వారిలో సీపీఎం పార్టీ నాయకులు కల్లెపల్లి అశోక్, మొదుంపల్లి శ్రవణ్,నాగరాజు, దివాకర్, మోహన్ తదితరులు ఉన్నారు.

చెరువులో గల్లంతైన బర్రెల కాపరి మృతి

నవతెలంగాణ-ముత్తారం:



ముత్తారం మండలం పోతారం గ్రామానికి చెందిన చల్ల లింగయ్య (55) అనే బర్రెల కాపరి చెరువులో పడి ఆదివారం గల్లంతయ్యాడు. సోమవారం ఉదయం మృతదేహం నీటిపైకి తేలడంతో పోలీసుల సూచనలతో కుటుంబ సభ్యులు బయటకు తీశారు. ముత్తారం ఎస్ఐ మధుసూదన్ రావు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు అతని భార్య లక్ష్మి రోజూవారి లాగానే బర్రెలను మెపుతూ పారుపల్లి శివారులోని యాతల్ చెరువు వద్దకు మేతకు తీసుకు వెళ్లగా, బర్రెలు నీటిని తాగడం కోసం చెరువులోకి దిగాయి. బర్రెలు నీటిలోతులోకి వెళ్లే క్రమంలో వాటిని ఆపేందుకు సదరు బర్రెల కాపరి నీటిలో దిగి కొంత లోపటికి వెళ్తుండగా అతని భార్య చెరువులోకి దిగవద్దని కేకలు వేసినప్పటికి బర్రెల కోసం లోపలికి వెళ్లి మునిగి గల్లంతయ్యాడని తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ పంచనామా నిర్వహించి, కేసు నమోదు చేశారు.

డ్రైనేజీ పనులను ప్రారంభించిన ఎంపీటీసీ

నవతెలంగాణ-గోదావరిఖని:



అంతర్గాం మండలం పెద్దంపేట్ గ్రామంలో ఎంపీటీసీ నిధులు రెండు లక్షల రూపాయలతో బొట్లకుంట లక్ష్మిమల్లు ఇంటి నుంచి ఎల్లమ్మగుడి వరకు చేపడుతున్న డ్రైనేజీ పనులను ఎంపీటీసీ కొలిపాక శరణ్య మధూకర్ రెడ్డి సోమవారం భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ ప్రెసిడెంట్ పుట్ట శ్రీనివాస్ యాదవ్, సింగిల్ విండో డైరెక్టర్ గుజ్జులా రమణ రెడ్డి, గౌడ సంఘం అధ్యక్షులు మెరుగు రమేష్ గౌడ్, బండి వీరయ్య గౌడ్, నేరెళ్ళ కొమురయ్య గౌడ్, లైసెట్టి రవి, గ్రామస్తుల పాల్గొన్నారు.

జీఎం కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జీఎం

నవతెలంగాణ-గోదావరిఖని:



సింగరేణి ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ జీఎం ఆఫీస్ బిల్డింగ్‌లోని అన్ని డిపార్ట్ మెంట్‌లను సోమవారం ఆకస్మికం గా తనిఖీ నిర్వహించారు. డిపార్ట్ మెంట్‌లలో పని చేస్తున్న ఉద్యోగులతో స్వయంగా మాట్లాడి వారి డిపార్ట్‌మెంట్లలో నిర్వహి స్తున్న పనులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ డిపార్ట్మెంట్‌లలో విధులు సక్రమంగా నిర్వహించాలని, సమయపాలన తప్పని సరిగా పాటించాలని సూచించారు. డిపార్ట్‌మెంట్లలో పనులను పెండింగ్ లేకుండా వేగంగా నిర్వహించాలని, సరైన సమయంలో వారికి కేటాయించిన పనులను పూర్తి చేయాలని తెలిపారు. ప్రతి ఒక్కరు కూడా క్రమ శిక్షణ, అకింత భావంతో పని చేయాలని, అందరు కలిసి సమష్టిగా వారి విధులు నిర్వహించినట్లైతే కంపెనీ నిర్దేశించిన లక్ష్యసాధనలో మనం కుడా భాగస్వాములము అవుతామని అన్నారు. జీఎంతోపాటు అధికారులు ఏజీఎం పర్సనల్ లక్ష్మి నారాయణ, ఏజీఎం ఐఈడి ఆంజనేయులు, ఎన్విరాన్ మెంట్ అధికారి ఆంజనేయ ప్రసాద్, సీనియర్ పీవో బంగారు సారంగా పాణి ఉన్నారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్‌కు కేరళ మోడల్ హైస్కూల్ విద్యార్థి ఎంపిక

నవ తెలంగాణ-సుల్తానాబాద్



సుల్తానాబాద్ మండల కేంద్రంలోని కేరళ మోడల్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థి డి. ప్రచేతన్,19వ జాతీయ స్థాయి ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్స్‌కు ఎంపికైనట్లు కేరళ మోడల్ హై స్కూల్ కరస్పాండెంట్ సిజ్జు. ఎస్.నాయర్ తెలిపారు. అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా గుజరాత్ లోని, అహ్మదాబాద్ సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించే జాతీయ స్థాయి అథ్లెటిక్స్ లో ఈనెల 16 నుంచి 18 వరకు జరిగే పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినీ అభినందించి క్రీడా దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ స్మిత, ఎస్.నాయర్, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎ. అజయ్ కుమార్ పాఠశాల అధ్యాపక, సిబ్బంది సంతోషాన్ని వ్యక్తం చేసి అభినందించారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

నవతెలంగాణ-సుల్తానాబాద్



లయన్స్ క్లబ్ ఆఫ్ సుల్తానాబాద్ ఆధ్వర్యంలో రేకుర్తి కంటి ఆసుపత్రి కరీంనగర్ వారి సౌజన్యంతో సోమవారం సుల్తానాబాద్ పట్టణంలోని స్థానిక శ్రీవాణి డిగ్రీ కళాశాలలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి నేత్ర వైద్య నిపుణులు డా. ప్రభాకర్ చే సుమారు 150 మందికి కంటి జబ్బులు, దృష్టి లోపాలు ఉన్న వారిని పరీక్షించి వారిలో 18 మందికి కంటి శుక్లాలు (మోతే బిందు) కంటి ఆపరేషన్ అవసరాన్ని గుర్తించి అతనితో పాటు ఒక సహాయకునికి రాను పోను ఉచిత బస్సు మరియు భోజన సదుపాయాన్ని కల్పించి రేకుర్తి కంటి ఆసుపత్రి కరీంనగర్ కు పంపించడం జరిగింది.కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు నోముల శ్రీనివాస్ రెడ్డి, జిల్లా అదనపు కార్యదర్శి వలస నీలయ్య, జిల్లా కో-ఆర్డినేటర్ మాటేటి శ్రీనివాస్, పిట్టల వెంకటేశం, డా. ప్రభాకర్ కళాశాల ప్రిన్సిపల్ బండారి కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవానికి కొప్పులకు ఆహ్వానం



నవతెలంగాణ-ధర్మారం

మండలంలోని దొంగతుర్తి గ్రామంలో ఈనె 15 నుండి 24 వరకు నిర్వహించే శ్రీ లక్ష్మీ గోదా సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి చతుస్కుండాత్మక పంచాహ్నిక నూతన ఆలయ స్థిర, చల, విగ్రహ, ధ్వజస్తంభ మహాకుంభాభిషేక ప్రతిష్టాపన మహోత్సవానికి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ దంపతులను ఆలయ కమిటీ అధ్యక్షుడు సముద్రాల అశోక్ రావు సోమవారం రోజున కరీంనగర్‌లోని తన ఇంటిలో ప్రత్యేక కలిసి సాగర పూర్వకంగా ఆహ్వాన పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గ్రామ ప్రజాప్రతినిధులు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

నవతెలంగాణ-పెద్దపల్లి టౌన్



ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సమీకృత జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యతనిచ్చి ప్రజలు ఇచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.ధర్మారం మండలం బొమ్మ రెడ్డి పల్లి గ్రామానికి చెందిన గౌరీ భూదేవి కుటుంబం సర్వే నెంబర్ 679/1 లో గల తమ భూమి లో పంటను చెడగొట్టి ఆక్రమించి ఇతర పంట వేసుకున్నారని, మాకు నష్టపరిహారం ఇప్పిస్తూ వారిపై కఠిన చర్యలుతీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పెద్దపల్లి ఏసీపీకి రాస్తూ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. రామగుండం 18వ వార్డుకు చెందిన ఈ.మమత తనకు సదరం సర్టిఫికెట్ 77 శాతం వైకల్యంతో ఉందని, తనకు వస్తున్న వితంతు పెన్షన్ను మార్పు చేసి దివ్యాంగుల పెన్షన్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.రామగుండం చైతన్యపురి కాలనీకి చెందిన ఏ.శ్వేత తనకు ఔట్సోర్సింగ్ స్వీపర్ గా ఉపాధి కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా రామగుండం మున్సిపల్ కమిషనర్ కు రాస్తూ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షలో మెరుగైన ఫలితాల సాధన దిశగా జిల్లాలో పకడ్బందీ చర్యలు తీసుకుంటు న్నామని, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని, ఆ సమయంలో విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన స్నాక్స్ అందిస్తున్నామని అన్నారు.ప్రత్యేక తరగతులు నిర్వహించడానికి కనీసం అరగంట సమయం ముందు తప్పనిసరిగా ప్రతి రోజు విద్యార్థులు ఆడుకునే విధంగా చూడాలని, క్రీడా సామాగ్రి లేని పాఠశాల వివరాలు అందిస్తే వాటికి కనీస క్రీడా సామాగ్రి అందిస్తామని అన్నారు.పాఠశాలలను బుధవారం జిల్లా అధికారులు సందర్శించే సమయంలో వీటిని ప్రత్యేకంగా గమనించి నివేదిక అందించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి జిల్లా అధికారికి కొంత మంది 10వ తరగతి విద్యార్థులను కేటాయించడం జరుగుతుందని, వారి తల్లిదండ్రులకు ఫోన్ చేసి విద్యార్థులు 10వ తరగతి పరీక్షలకు సన్నద్ధమవుతున్న అంశంపై వివరాలు అడిగి తెలుసుకోవాలని, ప్రతి రోజు వేకప్ కాల్స్, ప్రత్యేక తరగతుల నిర్వహణ, ఇంటి దగ్గర పిల్లలు చదివేందుకు కల్పించాల్సిన వాతావరణంపై సూచనలు అందించాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ సిబ్బందికి అవసరమైన వసతులను కల్పించడం జరుగుతుందని, త్వరలో న్యూట్రిషన్ తో సైతం మనం తీసుకుంటున్న ఆహారంలో తీసుకోవలసిన జాగ్రత్తల పై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ కరాటే టోర్నమెంట్‌లో రామగుండం విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-గోదావరిఖని క్రైం:



ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

ఆదివారం రోజున వరంగల్ జిల్లా నర్సంపేట్‌లోని పద్మశాలి గార్డెన్‌లో నిర్వహించిన నేషనల్ కరాటే ఛాంపియన్షిప్ 2024 షోటోఖాన్ జపాన్ కరాటే డు ఇండియా హంబో టోర్నమెంట్‌లో కాటాస్, కుమితి విభాగాలలో రామగుండంకు చెందిన జపాన్ షిటోరియో కరాటే స్కూల్ విద్యార్థినీ, విద్యార్థులు బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించారు. బ్లాక్ బెల్ట్ విభాగంలో కటాస్ ఎం.ముక్తి శ్రీ వెండి పతకం, బ్లాక్ బెల్ట్ కుమితి విభాగంలో ఎం.ముక్తిశ్రీ వెండి పతకం, కలర్ బెల్ట్ కటాస్ విభాగంలో ఎం.కార్తికేయన్ బంగారు పతకం, ఎం.మనస్విని బంగారు పతకం, వి.బోర్ బంగారు పతకం, టి.పవన్ కుమార్ బంగారు పతకం, సిహెచ్.అశ్విన్ కాంస్య పతకం, విగ్నేష్ వెండి పతకం, ధ్రువన్ కాంస్య పతకం, కలర్ బెల్టే కుముతి విభాగంలో ఎం. కార్తికేయన్ వెండి పతకం, ఎం. మనస్విని వెండి పతకం, పి.ధ్రువ బంగారు పతకం, విగ్నేష్ బంగారు పతకం, వి.బోర్ వెండి పతకం సాధించారు. ఈ టోర్నమెంట్‌కి సినీ యాక్టర్, కరాటే మాస్టర్ సుమన్ ముఖ్య అతిథులుగా విచ్చేసి గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ టోర్నమెంటులో పతకాలు సాధించిన విద్యార్థినీ విద్యార్థులను, కోచ్ కరాటే శ్రీనివాస్‌ను జపాన్ షిటోరియో కరాటే స్కూల్ ప్రెసిడెంట్ తగరపు శంకర్, సెక్రెటరీ ఎం.రమేష్, సీనియర్ ఇన్‌స్ట్రక్టర్స్ ఎస్.శ్రీనివాస్, శ్రావణ్ కుమార్ పటేల్, నిదిష్ కుమార్, రోహిత్ కుమార్, సంజన, శుభశ్రీ, అభిజ్ఞ, స్పందన క్లబ్ సెక్రటరీ త్రివేది, స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రెటరీ బాణేష్ రావు, చిరంజీవి ఆదిత్య, వంశీకష్ణ, తల్లిదండ్రులు అభినందించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

- కేంద్ర రసాయన, ఎరువుల శాఖ సంయుక్త కార్యదర్శి, ప్రభుత్వ ఆర్థిక సలహాదారు మనోజ్ సేతీ

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్



పేదరిక నిర్మూలన కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని, అర్హులైన వారందరూ వాటిని వినియోగించుకోవాలని కేంద్ర రసాయన, ఎరువుల శాఖ సంయుక్త కార్యదర్శి, ప్రభుత్వ ఆర్థిక సలహాదారు మనోజ్ సేతీ అన్నారు. సోమవారం పెద్దపల్లి లోని భూంనగర్ లో నిర్వహించిన వికసిత్ భారత్ యాత్రలో కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ సంయుక్త కార్యదర్శి, ప్రభుత్వ ఆర్థిక సలహాదారు మనోజ్ సేతీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ సంయుక్త కార్యదర్శి, ప్రభుత్వ ఆర్థిక సలహాదారు మనోజ్ సేతీ మాట్లాడుతూ దేశంలోని పేదరికం తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోడీ నేతృత్వంలో వివిధ కార్యక్రమాలను చేపట్టి విజయవంతంగా అమలు చేస్తుందని అన్నారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా భారత దేశం సాధిస్తున్న పురోగతి గురించి చర్చించు కుంటున్నారని, ప్రజల వద్దకు పాలన అందిస్తూ అర్హులైన వారికి కేంద్ర ప్రభుత్వ పథకాలను అందించేందుకు వికసిత్ భారత్ సంకల్ప యాత్రను చేపట్టామని తెలిపారు.తపాలా శాఖ ద్వారా సుకన్య యోజన, మహిళా సమ్మాన్ ఖాతా అనే పథకాలకు అధిక వడ్డీ అందిస్తున్నామని తెలిపారు. ఆయూ ష్మాన్ భారత్ కింద 10 లక్షల వరకు ఉచితంగా చికిత్స అందిస్తున్నామని, ఉజ్వల్ యోజన కింద గ్యాస్ కనెక్షన్ లేని పేద మహిళలకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్ అందిస్తున్నామని, వారికి సిలిండర్ పై సైతం 300 సబ్సిడీ అందిస్తున్నామని తెలిపారు. పి.ఎం.ఎస్.బి.వై పథకం కింద 2 లక్షల ప్రమాద బీమా, పి.ఎం.జె.జే.బి.వై పథకం కింద 2 లక్షల సాధారణ బీమా అందిస్తున్నా మని తెలిపారు. ఆధార్ సెంటర్ ద్వారా ప్రతి ఒక్కరూ తమ వివరాలను అప్ డేట్ చేసుకోవాలని ఆయన సూచించారు.బ్యాంక్ ద్వారా దేశ ప్రజలందరికి ఆర్థిక అక్షరాస్యత అందించేందుకు అవగాహన క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. వ్యాపార నిమిత్తం సెక్యూరిటీ లేకుండా లక్ష నుంచి 10 లక్షల వరకు ముద్రా రుణాలు అందిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి సి.హెచ్. మధు మోహన్, పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకటేష్, వార్డ్ కౌన్సిలర్, సంబంధిత అధికారులు, మెప్మా పి.డి. అర్బన్ రజినీ, ఎం.ఎల్. హెచ్.పి. నవ్య, మెప్మ సిబ్బంది, మహిళలు, ఆశ వర్కర్లు, ఆర్.పి.లు, మెడికల్, మున్సిపల్, పోస్టాఫీస్, గ్యాస్ ఏజెన్సీ సభ్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

యంత్రాల పూర్తి పని గంటలు వినియోగిస్తూ రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలి

నవతెలంగాణ-యైటింక్లయిన్ కాలనీ



యంత్రాలకు పూజ నిర్వహిస్తున్న జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ

ఆర్జీ-2 ఏరియా కృషిభవన్ ఇంటర్నల్ పార్కింగ్ యార్డ్ నందు రెండు నూతన షావల్ యంత్రాలను ఏరియా జనరల్ మేనేజర్ ఎల్.వి.సూర్యనారాయణ ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభించారు. గత వారం రెండు షావల్స్ తో కలిపి మొత్తం 5 నూతన షావల్స్ ప్రాజెక్టుకు అందించడం జరిగిందని, వీటిని సద్వినియోగ పరచుకొని మన ఏరియాకు కేటాయించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించుటకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏరియా జనరల్ మేనేజర్ ఎల్.వి.సూర్య నారాయణ అన్నారు. అలాగే యంత్రాల పూర్తి పని గంటలు వినియోగిస్తూ రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలని వారు అన్నారు.టాటా హిటాచి కంపెనీ ద్వారా ఒక్కొక్కటి 4.63 కోట్ల వ్యయంతో 6.5 క్యూబిక్ మీటర్ల బకెట్ సామర్ధ్యంతో అధునా తనమైన రక్షణ హంగులతో కొనుగోలు చేసిన రెండు షావల్ యంత్రాలకు పూజా కార్యక్రమాలు నిర్వహించి తుంగబద్ర,మహానదిగా నామకరణం చేసి ఓసీపీ-3 ప్రాజెక్టుకు అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రెటరీ జిగురు రవీందర్, ప్రాజెక్ట్ అధికారి మధుసూదన్, ప్రాజెక్ట్ ఇంజినీర్ రాజాజీ, గని మేనేజర్ డి.రమేష్, షవల్స్ సెక్షన్ ఇంచార్జ్ విజేందర్ రెడ్డి, సీనియర్ సెక్యూరిటీ అధికారి షరీఫ్ మహమ్మద్, సంక్షేమాధికారి సురేందర్, ఓసీపీ-3 అసిస్టెంట్ పిట్ సెక్రెటరీ మహేందర్, టాటా హిటాచి మేనేజర్ శేఖర్ రావ్,ఇతర ఓసీపీ-3 అధికారులు,ఉద్యోగులు పాల్గొన్నారు.

గీతకార్మికులకు కులవృత్తి కార్డుల పంపిణీ

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్



కల్లు గీత వృత్తినే నమ్ముకొని జీవిస్తున్న వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు గీత కులవృత్తి కార్డులు దోహదపడుతాయని గౌడ సంఘం అధ్యక్షులు కోట సమ్మయ్య గౌడ్ అన్నారు. గీత వృత్తి పై ఆధారపడి జీవిస్తున్న పెద్దపల్లి పట్టణానికి చెందిన 15 మంది గీత కార్మికులకు కుల వృత్తి కార్డులను ఆదివారం గౌడసంఘం అధ్యక్షులు కోట సమ్మయ్య గౌడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ గీత వృత్తి పై ఆధారపడి జీవిస్తున్న గీతా కార్మికులకు కులవృత్తి కార్డులు తప్పకుండా కల్గి ఉండాలని, గుర్తింపు కార్డు ద్వారానే గీత కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తిస్తాయన్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన గీత కార్మికులు గీత కులవృత్తి కార్డులు పొందనట్లయితే సమీప గౌడ సంఘం అధ్యక్షుని తీర్మాన పత్రంతో ఎక్సైజ్ శాఖ అధికారులను సంప్రదిస్తే గీతా కులవృత్తి కార్డు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. పెద్దపల్లి పట్టణానికి చెందిన గీతాకార్మికులు ఎవరైనా కార్డులు పొందనట్లయితే వారి స్థిరనివాసము, ఆదార్ కార్డు పత్రాలతో తనను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్ గౌడ్, తిర్రి తిరుపతి, భూషనవేని వేణు గౌడ్, గంగాదరి అంజయ్య, తిర్రి రాజూ, భూషన వేణి వెంకటేశం, తిర్రి సుదాకర్ గౌడ్, బొబ్బిలి రాజమౌళి గౌడ్, తిర్రి సుదాకర్, తిర్రి శంకర్ గౌడ్ తిర్రి నాగేష్ గౌడ్, తిర్రి రఘు గౌడ్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

జూలపల్లి నూతన ఎస్సైగా ఎన్. శ్రీధర్ బాధ్యతల స్వీకరణ



నవతెలంగాణ-జూలపల్లి

జూలపల్లి మండలం కు నూతన ఎస్ఐగా ఏన్ శ్రీధర్ బాధ్యతలను స్వీకరించారు. ఓదెల మండలం పొత్కపల్లి పోలీస్ స్టేషన్ నుండి డిప్యూటేషన్ పై జూలపల్లి మండలం కు విచ్చేసిన నూతన ఎస్సైని పోలీస్ సిబ్బంది ప్రజలు పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

స్ఫూర్తి మానసిక వికలాంగుల పాఠశాలలో అన్నదానం

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్



లయన్స్ క్లబ్ అఫ్ పెద్దపల్లి ఎలైట్ అద్వర్యం లో స్థానిక స్ఫూర్తి మానసిక వికలాంగుల కేంద్రం లో స్వరూప ఆంజనేయులుల పెళ్ళి రోజు సందర్భంగా సోమవారం అన్నదానం చేశారు.ఈ కార్యక్రమం లో లయన్ జోన్ ఛైర్పర్సన్ సంపత్ రావు, అధ్యక్షుడు లైశెట్టి బిక్షపతి , కార్యదర్శి పిట్ట వెంకటేష్ , కోశాధికారి అతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భక్త మార్కండేయ మహర్షి జయంతి వేడుకలు

నవతెలంగాణ-పెద్దపల్లి టౌన్



మండలంలోని పెద్ద బొంకూరు గ్రామంలో పద్మశాలి సేవ సంఘం అధ్వర్యంలో భక్త మార్కండేయ మహర్షి జయంతి వేడుకలు స్థానిక శివాలయంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం గ్రామ అధ్యక్షులు మిట్టపల్లి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మిట్టపల్లి కనకయ్య, ఎంపీటీసీ మిట్టపల్లి వసంత - వెంకటేశం, మిట్టపల్లి రాజేశం, పెండం బిక్షపతి, నాగుల మల్లేశం, వేముల భూమయ్య, బైరి నంబయ్య, బైరి వెంకటేశం, వేముల శ్రీనివాస్, సీపెల్లీ శ్రీనివాస్, గంటి నందం, కలవెన సంజీవ్, కడారి సతీష్,కల్వల తిరుపతి గౌడ్, శీలం మొండయ్య , రమేష్, సురేష్, కొండబత్తుల ఆంజనే యులు ,రామచంద్రం,సదానందం,ఎలిగేటి శేఖర్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించిన జిల్లా కలెక్టర్

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్



రాష్ట్ర స్థాయి సోషల్ స్టడీస్ టాలెంట్ టెస్ట్ పోటీలలో ప్రతిభ కనబర్చి తృతీయ బహుమతి సాధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అభినందించారు. ఫిబ్రవరి 10న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, హయత్ నగర్, రంగారెడ్డి జిల్లా నందు విద్యాశాఖ, తెలంగాణ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టేట్ లెవెల్ సోషల్ స్టడీస్ టాలెంట్ టెస్ట్ పోటీలలో తృతీయ బహుమతి సాధించిన పెద్దపల్లి జిల్లా అంతర్గాం కేజీబీవీ పాఠశాలకు చెందిన ఏ.వైష్ణవి, జూలపల్లి జెడ్పీ హెచ్.ఎస్. బాలికల పాఠశాల విద్యార్థిని ఉప్పుల చారు భాషిని లను సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ అభినందించి, వారికి మెడల్స్ ప్రశంస పత్రాలను అందజేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు విద్యతో పాటు క్రీడలలో సైతం జాతీయ, రాష్ట్రస్థాయిలో రాణించి జిల్లాకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జి.సి.డి.వో.కవిత, సోషల్ ఫోరం ప్రెసిడెంట్ మార రమేష్, సభ్యులు జె.సత్యనారాయణ, ఉపాధ్యాయులు కే.శ్రీనివాస్ రెడ్డి, సరోజ శర్మ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ యువతకు ఉచిత శిక్షణ తరగతులు

ఎస్సీ కార్పొరేషన్ జిల్లా కార్య నిర్వహాక సంచాలకులు పి.రవికుమార్ రావు

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్

స్కిల్ డెవలప్మెంట్ లో భాగంగా ఎస్సీ యువతీ, యువకులకు ఉచిత నైపుణ్య శిక్షణా తరగతులు కల్పించి,శిక్షణ అనంతరం ఉపాధి కల్పించే విధంగా శిక్షణ కోర్సులు నిర్వహిస్తున్నట్లు ఎస్సి కార్పొరేషన్ జిల్లా కార్య నిర్వాహక సంచాలకులు పి.రవికుమార్ రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఇంటర్మీడియట్ విద్యార్హత కలిగి,18 నుండి 35 సంవత్సరాల వయసు కలిగిన ఎస్సీ, యువతీ యువతులకు గోదావరిఖనిలో సి.ఆర్.ఎం. నాన్ వాయిస్, సి.ఆర్.ఎం. వాయిస్ కోర్సులకు ఉచిత శిక్షణ తరగతులు ఏర్పాటు చేయటం జరుగుతుందని, శిక్షణ అనంతరం ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు.ఆసక్తిగల యువతీ, యువకులు ఫిబ్రవరి 16 లోగా దరఖాస్తు చేసుకోవాలని, శిక్షణ సమయంలో పూర్తి వసతి, భోజన సదుపాయం ఉచితంగా ఏర్పాటు చేయడం జరుగుతుందని, ప్రస్తుతం రెగ్యులర్ గా చదువు కొనసాగిస్తున్న విద్యార్థులు ఈ శిక్షణకు అర్హులు కారని తెలిపారు.అభ్యర్థుల దరఖాస్తుతో పాటు ఇంటర్ పాస్ మెమో, ఒరిజినల్ టి.సి.,కుల, ఆదాయ ధ్రువపత్రాలు, ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్, పాస్ ఫోటోలు 5 తీసుకొని 16 ఫిబ్రవరి లోపు ప్రతి మండల కేంద్రంలోని ఎంపీడీవో ఆఫీస్ నందు, లేదా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ లోని మొదటి అంతస్తులో రూమ్ నెంబర్ 232 లో గల ఎస్సీ కార్పొరేషన్ ఆఫీస్ నందు సమర్పించాలని, మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ :9059386238, 9493003270 లలో సంప్రదించాలని పి.రవికుమార్ రావు ఆ ప్రకటనలో కోరారు.

కరాటేలో మంథని విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-మంథని



ఈ నెల 11న వరంగల్ జిల్లా నర్సంపేట పద్మశాలి భవన్‌లో జాతీయ స్థాయి ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో మంథని విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ టోర్నమెంట్ లో మంథని షోటో ఖాన్ కరాటే ఇన్స్ట్రక్టర్ కోంద్ర నాగరాజు ఆధ్వర్యంలో 4 గురు విద్యార్థులు పాల్గొని ప్రత్యేక దృష్టిని ఆకర్షించారు.కటా, కుమీతే విభాగంలో ప్రతిభను కనబరిచి 4 గోల్డ్ మెడల్స్,1 సిల్వర్ మెడల్ సాధించారు.మెడల్స్ సాదించిన విద్యార్థులు బీర ఆదిత్యతేజ బ్లాక్ బెల్ట్ కటావిభాగంలో గోల్డ్ మెడల్ కైవసం చేసుకున్నారు.ఆల్ కలర్ బెల్ట్ కుమితే,కటా విభాగంలో ఒర్సు శుశృత్, ఆత్మకురి అన్షు కుమితె లో గోల్డ్ మెడల్స్,నివాస్ సిల్వర్ మెడల్ సాధించారు.కరాటే పోటిలలో గెలుపొందిన విద్యార్థులను జే.కె.ఏ. షోటో ఖాన్ కరాటే రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇన్స్ట్రక్టర్ నూకల భానయ్య, సీనియర్ మాస్టర్స్ పర్శ బక్కయ్య,శంకర్ గౌడ్ అభినందించారు.

వేతనాలు చెల్లించడం లేదని మున్సిపల్ కార్మికుల ఆందోళన


మున్సిపల్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న కార్మికులు

నవతెలంగాణ - హుజూరాబాద్ టౌన్

హుజూరాబాద్ మున్సిపల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికుల వేతనాలు ఇవ్వడం లేదని మున్సిపల్ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. మూడు నెలల నుండి మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికుల వేతనాలు ఇవ్వడం లేదని, గతంలోనూ అధికారులకు విన్నవించినప్పటికి స్పందించక పోవడంతో విధులను బహిష్కరించినట్లు తెలిపారు. మున్సిపల్ కార్మికుల అందోళన విషయాన్ని తెలుసుకున్న కమిషనర్ కార్మికులతో మాట్లాడి రెండు రోజుల్లో వేతనాలు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో అందోళన విరమించారు. రెండు రోజుల్లో వేతనాలు చెల్లించకుంటే అందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని కార్మికులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్షులు ఎండి అజ్జు, ఉపాధ్యక్షుడు సరోజన, సమ్మక్క, క్రాంతి, కుమార్, మొగిలి, కోశాధికారి రాజేశ్వరి, కార్మికులు పాల్గొన్నారు.

ప్రహరీ గోడ నిర్మాణం ఆపాలని ఫిర్యాదు

నవతెలంగాణ-శంకరపట్నం


ఫిర్యాదు చేస్తున్న రజకులు

శంకరపట్నం మండల పరిధిలోని కొత్తగట్టు, రజక వాడలో అక్రమంగా నిర్మిస్తున్న ప్రహరీ గోడ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని ఎంపీడీవో శ్రీవాణీకి రజకులు సోమవారం ఫిర్యాదు చేశారు. రజక వాడకు వెళ్లకుండా రోడ్డుపై ప్రహరీ నిర్మిస్తున్న ముత్యాల రాజమ్మ మల్లయ్యపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

పదోన్నతి పొందిన ఉపాధ్యాయుడికి సన్మానం

నవతెలంగాణ - తిమ్మాపూర్


సన్మానిస్తున్న మండల విద్యాధికారి, ఉపాధ్యాయులు

మండలంలోని నేదునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించి గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందిన జంగ మనోహర్‌రెడ్డిని ఎంపీటీసీ కనకం కొమురయ్య ఆధ్వర్యంలో సోమవారం శాలువా, మెమొంటోతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి కొమ్మెర శ్రీనివాస్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్ రావు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు తిరుపతిరెడ్డి, జాకీర్ హుస్సేన్, సయ్యద్ గానీ, పద్మ, అనీస్ ఫాతిమా, అమల, ప్రభాకర్, జయలక్ష్మి పాల్గొన్నారు.

ఈనెల14న ఒరిజినల్ ధ్రువ పత్రాల పరిశీలన

నవతెలంగాణ - తిమ్మాపూర్

ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థలలో రెండు సంవత్సరాల కోర్సు అయిన డిప్లమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్, డిప్లమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ మొదటి సంవత్సరం 2023 -24లో చేరడానికి నిర్వహించిన డిఈఈసెట్-2023 నందు ఉత్తీర్ణులై ఇప్పటివరకు ఒరిజినల్ ధ్రువ పత్రాలు పరిశీలన చేయించుకొని విద్యార్థులు ఈనెల 14న ఉదయం 10 గంటలకు మండలంలోని ఎల్ఎండి కాలనీలో గల డైట్ కళాశాలలో హాజరు కాగలరని డైట్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీరామ్ కొండయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడో దశ ప్రవేశాలకు ఆప్షన్స్ ను ఈనెల 15 నుండి 17 వరకు పెట్టుకోవచ్చని చెప్పారు. వివరాలకు డిఈఈసెట్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపికైన ఏకశీల విద్యార్థి

నవతెలంగాణ - హుజూరాబాద్ టౌన్

రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ అవార్డుకు మండలంలోని తుమ్మనపల్లి గ్రామంలో ఏకశిల పాఠశాల విద్యార్థి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ దినేష్‌రెడ్డి తెలిపారు. ఏకశీల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న వలబోజు విశ్వనాథన్ ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ ఎగ్జిబిషన్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్టు తెలిపారు. ఇన్నోవేటివ్ వేట్ ప్రొటెక్టర్, ఆటో మేటిక్ సీట్ డ్రయర్ అనే అంశాన్ని తీసుకొని ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి అవార్డుకు విశ్వనాథన్, గైడ్ కుమార స్వామిని ఏకశిల విద్యా సంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి అభినందించారు.

ఘనంగా మార్కండేయ జయంతి వేడుకలు

నవతెలంగాణ-మల్లాపూర్

మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాలలో పద్మశాలీల ఆరాధ్య దైవం మార్కండేయ జయంతి సోమవారం ఘనంగా నిర్వహించారు. పద్మశాలి మండల అధ్యక్షుడు అయ్యోరి దశరథం, మల్లాపూర్ పట్టణ అధ్యక్షుడు సిరిపురం రవీందర్, రుద్ర లక్ష్మీరాజంలు మార్కండేయుని చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్య క్రమంలో జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ముద్దం శరత్ గౌడ్, రంగు రామాగౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

నవతెలంగాణ-మల్లాపూర్


: పాల్గొన్న నాయకులు

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలలో కరీంనగర్ జిల్లా టీం ప్రథమ స్థానం సాధించేందుకు కృషి చేసిన గుండంపెల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు మంగా సంతోష్‌ను పీఆర్టీయూ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ మండల అధ్యక్ష, శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శులు నవీన్ కుమార్, రాష్ట్ర బాధ్యులు శ్రీనివాస్, చంద్రప్రకాష్ సర్, రాజిరెడ్డి సర్, ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయులు శ్రీహరి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ప్రజవాణి సమస్యలకు సత్వరమే పరిష్కార మార్గం చూపాలి

జగిత్యాల కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

నవతెలంగాణ-జగిత్యాల

ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే సమస్యలకు అధిక ప్రాధాన్యతనిస్తూ వచ్చిన ఫిర్యాదులకు సత్వరమే పరిష్కార మార్గం చూపాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజవాణలో ప్రజల నుంచి ఫిర్యాదులను అదనపు కలెక్టర్ దివాకరతో కలిసి జిల్లా కలెక్టర్ స్వీకరిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు ఎన్నో వ్యయప్రయాలకు ఓర్చి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కాగా ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 37 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దివాకర, జగిత్యాల, కోరుట్ల, ఆర్డిఒలు, నర్సింహమూర్తి, రాజేశ్వర్, కలెక్టరేట్ ఏ.ఓ. హన్మంతరావు, వివిధ జిల్లా అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అవార్డులకు మహిళల నుండి దరఖాస్తుల ఆహ్వానం

జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి

నవతెలంగాణ - భగత్‌నగర్ :అంతర్జాతీయ మహిళా దినోత్సవం మార్చి 8న పురస్కరించుకుని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి అవార్డులకు నామినేషన్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సంవత్సరం జరుపుకునే అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా ఈ ఏడాది కూడా రాష్ట్రస్థాయి అవార్డుల ఎంపికకు నామినేషన్లు స్వీకరించ నున్నట్లు ఆమె తెలిపారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన ఔత్సాహికుల్కైన మహిళలు దరఖాస్తులను ఈ నెల 17 సాయంత్రం 5గంటల్లోగా జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం, ఇంటినెంబర్ 9-1-131, బాలరక్ష భవన్, భగత్‌నగర్‌లో అందజేయాలని సూచించారు. అన్ని పనిదినాల్లో ఉదయం 10:30నుండి సాయంత్రం 5 గంటలకు వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు.

మానసిక వికలాంగుల అభివృద్ధికి సహకారం అందిస్తా

కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

నవతెలంగాణ-తిమ్మాపూర్


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

మానసిక వికలాంగ పిల్లల అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలను అందిస్తానని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. సోమవారం తిమ్మాపూర్ మండలం ఎల్.ఎం.డి కాలనీలోని కరీంనగర్ జిల్లా స్వతంత్ర సమర యోధుల ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మానసిక వికలాంగుల ప్రత్యేక పాఠశాల, వృత్తి శిక్షణ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పాల్గొన్నారు. మొదటగా పాఠశాలలోని తరగతి గదిలో విద్యార్థులందరిని అప్యాయంగా పలకరిస్తూ, వారి ఆరోగ్య పరిస్థితి, చెబుతున్న పాఠాలను, వసతి గృహ పరిస్థితులను గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్య క్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ... మనిషిలో అవిటితనం ధైర్యానికి, విజయానికి ఆటంకం కాదని. ఆత్మస్థైర్యంతో ప్రపంచాన్ని జయించగల మని నిరుపిస్తున్న విద్యార్థుల శ్రేయస్సు కోసం జిల్లా పరిపాలన ద్వారా అవసరమైన నిధులను సహాయ సహకారాలను అందించడం జరుగుతుందన్నారు. ప్రత్యేక అవసరాలకు తగ్గట్లుగా విద్యా బుద్దులను అంకితభావంతో విద్యను నేర్పిస్తున్న టీచర్లకు, వారికి ఇబ్బందులు కలగకుండా కృషి చేస్తున్న తల్లి తండ్రులకు ఆమె అభినందనలను తెలిపారు. కార్యక్రమంలో మానసిక వికలాంగులు ప్రదర్శించిన డ్యాన్స్ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జిల్లాలో గ్రూప్ 1,2, ఆర్ అండ్ బి, టీచర్ల నోటిఫికేషన్ కోసం సిద్ధమయ్యే నిరుద్యోగ యువతకు ప్రతి బ్యాచ్‌లో 400 నుండి 500 విద్యార్థులకు ఉచిత కోచింగ్ ఇవ్వడం జరుగు తుందన్నారు. ఇప్పటి వరకు వారధి సంస్థ ద్వారా వివిధ సామాజిక కార్యక్రమాలకు 1.50 కోట్లను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. అనంతరం వారధి సొసైటీ ద్వారా మానసిక వికలాంగుల పాఠశాలకు రూ.6 లక్షల విలువగల 120 బెడ్స్‌ను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మానసిక వికలాంగుల పాఠశాల చైర్మన్ చాడ వెంకటరెడ్డి, మాజీ ట్రస్టీ గొట్టే భూపతి, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, వారధి సొసైటి కో ఆర్డినేటర్ ఆంజనేయులు, సభ్యులు సముద్రాల జనార్ధన్ రావు, ప్రొఫెసర్ మధుసూదన్ రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగరపు రజనీకాంత్

నవతెలంగాణ-కరీంనగర్



మాట్లాడుతున్న శనిగరపు రజనీకాంత్

రాష్ట్ర బడ్జెట్‌ను సవరించి విద్యారంగానికి 30 శాతం నిధులను కేటాయించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగరపు రజనీకాంత్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కరీంనగర్ పట్టణంలోని మంకమ్మతోటలో గల ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయం లో జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్ అధ్యక్షతన భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆఫీస్ బెరర్స్ సమావేశం నిర్వహించారు.రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగరపు రజనీకాంత్ హాజరై మాట్లాడారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగిం దని ఆవేదన వ్యక్తం చేశారు. కొఠారి కమిషన్ ప్రకారం బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని ఎస్ఎఫ్ఐగా రాష్ట్ర ప్రభుత్వానికి తెలిపినా పట్టించుకోకుండా విద్యారంగానికి కేవలం 7.8 శాతం మాత్రమే బడ్జెట్ కేటాయించడం చాలా అన్యాయమని పేర్కొన్నారు. ఈ బడ్జెట్ కేవలం పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుల జీతాల కోసం మాత్రమే సరి పోతాయని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ 7200 కోట్లు రాక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, అయినా బడ్జెట్ సమావేశాల్లో వాటిపై కనీస చర్చించలేదని తెలిపారు. అలాగే సంక్షేమ హాస్టల్‌లో విద్యార్థులకు రావాల్సిన రూ.6300 కోట్లు మెస్ ఛార్జీలు రాక విద్యార్థులు నాసిరకమైన భోజనం తింటూ ఇబ్బందులు పడుతున్న పరిస్థితి కనిపిస్తుందన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు నెలకు రూ.3000లు పెంచాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లాలో ఉన్న శాతవాహన యూనివర్సిటీ కనీసం రెగ్యులర్ ప్రొఫెసర్లు లేరు, కనీస బస్సు సౌకర్యం, బ్యాంకు లేదా విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైన ప్రత్యేకమైన బడ్జెట్ కేటాయించి శాతవాహన యూనివర్సిటీ అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ ఎం. పూజ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కంపెల్లి అరవింద్, గజ్జెల శ్రీకాంత్, ఉపాధ్యక్షులు అభిలాష్, హరీష్, సహాయ కార్యదర్శి అసంపెల్లి వినయ్ సాగర్‌పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెలో జీపీ ఉద్యోగులు, కార్మికులు పాల్గొనాలి

నవతెలంగాణ-ఇల్లందకుంట


సమ్మె నోటీసు అందిస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు

ఈనెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మెలో గ్రామ పంచాయతీ కార్మికులు, ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పుల శంకర్ పిలుపునిచ్చారు. కోత్తూరు మల్లయ్య అధ్యక్షతన ఇల్లందకుంట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీఓ వెంకటేశ్వర్లుకు సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పుల శంకర్ మాట్లాడుతూ.. కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం 48 చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించి కార్మిక వర్గానికి తీరని అన్యాయం చేసిందని, కనీస వేతన చట్టాలు, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, కనీస పని గంటలకు లేకుండా చేసేందుకు కుట్ర చేస్తోందని ఆరోపించారు. కార్మికులకు కనీస వేతనాలు రూ.26వేలు అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని పంచాయతీ ఉద్యోగులకు 51 జీవో సవరణ చేయాలని మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని పాత కేటగిరీలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో మరణించిన కార్మికుడికి పదిలక్షల రూపాయలు ప్రభుత్వమే ఇవ్వాలని మరణించిన కార్మికుల దహన సంస్కారాలకు 20,000 రూపాయలు చెల్లించాలని వారాంతపు పండుగ సెలవులు ఇవ్వాలని కోరుతూ ఫిబ్రవరిన 16న జరిగే దేశవ్యాప్త సమ్మెలో పంచాయతీ కార్మిక వర్గం అందరూ పాల్గొనాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కోశాధికారి ఎండిగా రవీంద్రరావు, మండల కార్యదర్శి గురుకుల బాబు, రామంచ రాజేందర్, వెంగల అంజయ్య గంధసిరి సంపత్, రవి, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి


నవతెలంగాణ-కరీంనగర్


కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న వడ్ల రాజు

ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్ల రాజు, అజయ్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కరీంనగర్ జిల్లా కొత్తపెల్లి మండలం కమాన్‌పూర్ గ్రామంలోని 116 సర్వే నెంబర్‌లో ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించుకొని అక్రమంగా నిర్మాణాలు చేస్తున్నారని తెలిపారు. గతంలో కూడా కొందరు ఆక్రమిం చేందుకు ప్రయత్నించగా అక్రమ నిర్మాణాలు కూల్చివేశారు, మళ్లీ కొందరు అక్రమంగా ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని నిర్మాణాలు చేస్తున్నారని పేర్కొన్నారు. కొత్తపెల్లి గ్రామ పరిధిలో 531 సర్వే నెంబర్లు ఎస్సారెస్పీ ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించుకున్నారని, ఎందరో నిరుపేదలు ఉండడానికి ఇల్లు లేక కిరాయిలు ఉంటూ కూలీ పని చేస్తూ జీవిస్తున్నారు కనుక ప్రభుత్వం భూములను స్వాధీనం చేసుకొని నిరుపేదలైన పేదలకు ఇందిరమ్మ ఇండ్ల పేరుతో ఇల్లు లేని నిరుపేదలకు ఇండ్ల స్థలాలు, ఇల్లు కట్టి ఇవ్వాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్ల రాజు, అజయ్ ఉన్నారు.

విద్యార్థులు చదువుల్లో రాణించాలి

నవతెలంగాణ - జమ్మికుంట


చెక్కు అందజేస్తున్న పల్లె ప్రభాకర్ గౌడ్

విద్యార్థులు చదువులో రాణించినప్పుడే ఉన్నత స్థాయిలో ఉంటారని, చదువే విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయిస్తుందని పీఎంకే ఫౌండేషన్ వ్యవస్థాపకులు పల్లె ప్రభాకర్‌గౌడ్ అన్నారు. సోమవారం జమ్మికుంట మండలం కోరపల్లి గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ హైస్కూల్‌లో విద్యార్థుల చదువుని దృష్టిలో ఉంచుకొని , రెండు మాసాల క్రితం ఉపాధ్యాయులకు అదనంగా బండారి రమ్యను విద్యావాలంటగా ఏర్పాటు చేశారు. ఈ విద్యా సంవత్సరం పూర్తయ్యేంతవరకు రమ్యకు నెలల వారిగా జీతాన్ని తానే ఇస్తానని పీఎంకె ఫౌండేషన్ వ్యవస్థాపకులు పల్లె ప్రభాకర్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా కోరపల్లి హైస్కూల్లో ప్రిన్సిపల్ సమ్మయ్య సమక్షంలో మొదటి నెల జీతానికి సంబంధించిన చెక్కును వాలంటరీ రమ్యకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 10వ తరగతి విద్యను అభ్యసించే విద్యార్థులు ఈ పరీక్షల్లో మొదటి ర్యాంకు సాధిస్తే 5000 రూపాయలు రెండో ర్యాంకు 2500 రూపాయలు నగదును విద్యార్థులకు అందిస్తానని ఆయన తెలిపారు . ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు పల్లె రవి గౌడ్, గండి రంజిత్ కుమార్ గౌడ్ ,గిరవేన రాజయ్య యాదవ్, డాక్టర్ గోపి ,పల్లె సంపత్ గౌడ్, తాటిగంటి వీరస్వామి పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వాగేశ్వరిలో ఐసిటి ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం వర్క్ షాప్

నవతెలంగాణ-తిమ్మాపూర్


మాట్లాడుతున్న ట్రైనర్ శ్రీనివాస్

మండలంలోని రామకృష్ణ కాలనీలో గల వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాలలో ఐసిటి అకాడమీ ఆధ్వర్యంలో ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం, మైక్రోసాఫ్ట్ పవర్ బిఐ డాటా అనలిస్ట్ టెక్నాలజీపై వర్క్ షాప్ ఐదు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు కళాశాల జనరల్ సెక్రెటరీ డాక్టర్ గంద్ర శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ వర్క్ షాప్‌కు ఐసిటి అకాడమీ ట్రైనర్ శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. ఉపాధ్యా యులు నిరంతరం అభ్యాసకులని, మారుతున్న కాలానికి అనుగుణంగా వారి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, తద్వారా విద్యార్థులకు ఉత్తమ బోధన చేయడం సులభం అవుతుందన్నారు. మైక్రోసాఫ్ట్ పవర్ బిఐ సాఫ్ట్వేర్ విజువలైజేషన్ టూల్ అని, డాటాను విశ్లేషించడంలో సులభ తరమని చెప్పారు. కార్పొరేట్ రంగంలో ఎన్నో ఉపాధి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, కళాశాల ఐసిటి కోఆర్డినేటర్ డాక్టర్ టి. రవికుమార్ ,వివిధ విభాగాధిపతులు డాక్టర్ చంద్రమౌళి, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ బాపూజీ, ఐసిటి రిలేషన్ మేనేజర్ షేక్ గౌస్‌పాషా పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలి

నవతెలంగాణ - గంగాధర


కూరగాయ విత్తనాలు పంపిణీ చేస్తున్న సేవాసదన్ ప్రతినిధులు

ఆరోగ్య, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్య తను ఇవ్వాలని స్ఫూర్తి సేవసదన్ ప్రతినిధి సీనియర్ కోఆర్డినేటర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. గంగాధర మండలం గర్శకుర్తి గ్రామంలో స్ఫూర్తి సేవసదన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వయోజన విద్య సెంటర్లలోని వయోజనులకు ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన, ఉచిత కూరగాయ విత్తనాల పంపిణీని చేపట్టారు. ఈ కార్యక్రమానికి హాజరైన డాక్టర్ సందీప్ మాట్లాడుతూ స్త్రీల ఆరోగ్య సమస్యలు తీసుకోవల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత శుభ్రత, పరిసరాల శుభ్రత, పోషకాహారంతో కూడిన ఆహారంను, ఆరోగ్య సలహాలపై మెళుకువలను వివరించారు. స్ఫూర్తి సేవసదన్ ప్రతినిధి సీనియర్ కోఆర్డినేటర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ పర్యావరణంకు సంబంధించిన పలు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఫెసిలిటేటర్ మల్యాల విజయకుమార్, వయోజన విద్య టీచర్లు మంజుల, అర్పిత, శోభ, నర్సయ్య, నరేష్, వయోజనులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే ఉపయోగపడుతుంది

చొప్పదండి సీఐ రాచకొండ ప్రకాష్‌గౌడ్


విద్యార్థులను అభినందిస్తున్న చొప్పదండి సిఐ రాచకొండ ప్రకాష్ గౌడ్

నవతెలంగాణ-చొప్పదండి

అనుకోని ఘటనలు జరిగినప్పుడు విద్యార్థులు తమకు తాము రక్షించుకోవడానికి కరాటే ఎంతగానో ఉపయోగపడుతుందని చొప్పదండి సీఐ రాచకొండ ప్రకాష్‌గౌడ్ అన్నారు. నల్గొండ జిల్లా కేంద్రంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర కరాటే అసోసియేషన్ ఇండియా, షోటా ఖాన్ కరాటే ఛాంపియన్ షిప్ 2024 పోటీల్లో లిటిల్స్ ఐలాండ్ హైస్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, మూడు గోల్డ్ మెడల్స్, మూడు సిల్వర్ మెడల్స్, మూడు బ్రాంజ్ మెడల్స్, మూడు బ్లాక్ మెడల్స్ సాధించారు. పాఠశాల కరస్పాండెంట్ కే. రవి కుమార్, శిక్షణ ఇచ్చిన కరాటే మాస్టర్ సుంకే రాజులను, చొప్పదండి సర్కిల్ కార్యాలయంలో చొప్పదండి సీఐ రాచకొండ ప్రకాష్ గౌడ్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆస్తులపై విచారణ జరిపించాలి

- అవినీతికి పాల్పడ్డ వారిని పార్టీ నుంచి బహిష్కరించాలి
- సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు

నవతెలంగాణ-కరీంనగర్



కరీంనగర్ నగరంలో భూ కబ్జాలు, అవినీతి, అక్రమాలకు పాల్పడిన కార్పొరేటర్ల ఆస్తులపై సీబీసిఐడితో విచారణ జరిపించాలని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రజల ఓట్లతో ఎన్నికైన బీఆర్ఎస్ కార్పొరేటర్లు అధికార దాహంతో అమాయక ప్రజల భూములను కబ్జాలు చేయడం, భూ తగదాల్లో చొరబడి లక్షలాది రూపాయలు ఆర్జించడం లాంటి చర్యలకు పాల్పడిన వారి అక్రమ ఆస్తులపై సమగ్ర విచారణ జరిపి బాధిత ప్రజలకు న్యాయం చేయాలని అన్నారు. అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారిపై బీఆర్ఎస్ పార్టీ నాయకత్వం క్రమశిక్షణ చర్యలు తీసుకోకపోవడం సిగ్గు చేటని, జిల్లా పార్టీ అధ్యక్షుడు వెంటనే స్పందించి వారిని పార్టీ నుంచి బహిష్కరించాలని కోరారు. మరి కొంత మంది కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు భూములను కబ్జా చేసిన వారు ఉన్నారని ప్రతి ఒక్కరిని విచారించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పండ్లు, కూరగాయలు పండిస్తూ మహిళలు ఆర్థికంగా ఎదగాలి

జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.ప్రియదర్శిని



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారిని ఎన్ ప్రియదర్శిని

నవతెలంగాణ - జమ్మికుంట

పండ్లు కూరగాయలు పండిస్తూ మహిళలు ఆర్థికంగా ఎదగాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.ప్రియదర్శిని అన్నారు. సోమవారం స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో ఆత్మ, మేనేజ్ హైదరాబాద్ వారి ఆర్థిక సహకారంతో పండ్లు, కూరగాయలు విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ అనే అంశంపై గ్రామీణ యువతకు నైపుణ్యత శిక్షణ ముగింపు కార్యక్రమం కోర్సు ఇన్‌చార్జి ఎ.ప్రశాంతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా వ్యవసాయ అధికారి పాల్గొని మహిళలకు సర్టిఫికెట్స్ అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. పండ్లు, కూరగాయలు విలువ ఆధారిత ఉత్పత్తుల గురించి వినియోగదారులకు సరైన అవగాహన లేదన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన మహిళలు రైతులకు వివరిస్తే తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం వచ్చే విధంగా పంట తీస్తారన్నారు. కెవికే జనరల్ సెక్రెటరీ విజయగోపాల్‌రెడ్డి మాట్లాడారు. రైతులు, ఔత్సాహిక మహిళలు కలిసి పండ్లు, కూరగాయలు ఉప ఉత్పత్తులు తయారుచేసి అమ్మకం చేయడం అనేది దేశాభివృద్ధిలో ప్రముఖ పాత్ర వహిస్తుందని తెలిపారు. కెవికె సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడారు. మహిళా కుటీర పరిశ్రమలకు ప్రభుత్వం నుంచి మంచి సహకారం ఉందన్నారు. కాబట్టి మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా నిలబడాలన్నారు.

బదిలీపై వెళ్తున్న ఎంపీడీఓకు సన్మానం


ఎంపీడీఓను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

నవతెలంగాణ - జమ్మికుంట

జమ్మికుంట ఎంపీడీఓ కల్పన వరంగల్‌కు బదిలీ అయ్యారు. సోమవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ దొడ్డే మమత అధ్యక్షతన ఎంపీడీఓకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓను కార్యాలయ సిబ్బంది, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీఓ సతీష్‌రావు, వైస్ ఎంపీపీ పొలసాని తిరుపతిరావు, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు కడవేర్గు మమత, మత్రి మల్లేశం, మాజీ సర్పంచులు చందుపట్ల స్వాతికృష్ణారెడ్డి, వజ్జపెల్లి ఆగయ్య, సుంకిశాల పద్మరాజేశ్వరరావు, ఎంపీటీసీ పోల్సాని రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మోడీ 3.0 వెనుక..?

(మొదటిపేజీ తరువాయి)

ఉపయోగిస్తూ వచ్చింది. 2014, 2019 ఎన్నికల్లో రామ మందిర అంశాన్ని ఆ పార్టీ లేవనెత్తింది. అయోధ్యలో రామ మందిర నిర్మాణం పూర్తి కావటంతో బీజేపీ హిందూత్వ సిద్ధాంతం కాస్త బీటలు వారొచ్చనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వ్యక్తమైంది. అయితే, బీజేపీలోని కీలక నాయకులు మాత్రం.. అయోధ్య పూర్తయినా కాశీ, మథురాలు ఇంకా మిగిలే ఉన్నాయని అంటున్నారు. దీంతో ఏ రకంగానైనా హిందూత్వ అజెండాతోనే రాజకీయాలు చేయాలనీ, రానున్న లోక్‌సభ ఎన్నికల్లోనూ దీనిని వాడాలని ఆ పార్టీ యోచిస్తున్నట్టు కాషాయపార్టీ నేతల మాటలను చూస్తే అర్థమవుతున్నది.

ఇటు 17వ లోక్‌సభ శనివారంతో ముగిసింది. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో హ్యాట్రిక్ సాధించటంపై అధికార బీజేపీ విశ్వాసం వ్యక్తం చేసింది. లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీ మెరుగైన మెజారిటీతో విజయం సాధిస్తుందని ప్రధాని మోడీ విశ్వాసం వ్యక్తం చేశారు. 370 సీట్లను సాధిస్తుందని పరోక్షంగా చెప్పారు. "మా మూడో దఫా చాలా పెద్ద నిర్ణయాలకు సాక్ష్యంగా ఉంటుంది. రాబోయే 1,000 సంవత్సరాలకు బలమైన పునాది వేస్తుంది" అని మోడీ సభలో చెప్పారు.

'హిందూత్వ', యూసీసీ వంటి పలు సున్నితమైన, వివాదాస్పద, భావోద్వేగ అంశాలను ఆధారంగా చేసుకొనే ఆయన ఇలాంటి కీలక వ్యాఖ్యలు చేశారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఇలాంటి అంశాలను వాడుకొని అధికారంలోకి రావటం ఆ పార్టీకి అలవాటనీ చెప్తున్నారు. 2019లో సార్వత్రిక ఎన్నికలకు ముందు 'పుల్వామా దాడి' ఘటన ఆ పార్టీకి రాజకీయంగా చాలా లబ్దిని చేకూర్చిందనీ, లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి 300కు పైగా స్థానాలు దక్కేలా చేసిందని అంటున్నారు. ఈ సారి కూడా హిందూత్వ, జాతీయవాదం వంటి అంశాలను ఆ పార్టీ మళ్లీ ఉపయోగించినా ఆశ్చర్యపోవాల్సినవసరం లేదని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

హిందూత్వ సిద్ధాంతాన్ని బలంగా వినిపించే బీజేపీ నాయకుల్లో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఒకరు. ఆయన ఇటీవల ఆ రాష్ట్ర అసెంబ్లీలో 'అయోధ్య పూర్తయిందనీ, కాశీ, మథుర లు ఎదురు చూస్తున్నాయని' నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. కేంద్ర మంత్రుల స్థాయిలో ఉన్న పలువురు బీజేపీ నాయకులూ ఇవే వ్యాఖ్యలు చేస్తున్నారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

బీజేపీ కొన్ని సైద్ధాంతిక ప్రాజెక్టులు ఇప్పటికే కీలక దశకు చేరుకున్నాయి. 17వ లోక్‌సభలో తన సభ్యుల బలంతో ఆ పార్టీ పలు కీలక బిల్లులను ఆమోదింపజేసుకున్నది. ఇందులో ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాక్‌ను నేరంగా ప్రకటించటం, పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) వంటివి ఉన్నాయి. న్యాయస్థానం తీర్పుతో అయోధ్యలో రామ మందిర నిర్మాణం సాధ్యమైంది. ఇక లోక్‌సభ, అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌ను కల్పించే బిల్లు, వలస కాలం నాటి క్రిమినల్ చట్టాల స్థానంలో కొత్తవి తీసుకురావటం వంటివి చేసింది.

370 సీట్లతో తిరిగి అధికారంలోకి వచ్చి పెద్ద నిర్ణయాలు తీసుకుంటామని పార్లమెంటులో మోడీ చెప్పారు. అయితే, ఈ లోక్‌సభ ఎన్నికల్లో భావోద్వేగ అంశాలను వాడుకొని, ప్రజల్లో సెంటిమెంట్‌ను రగల్చే ప్రణాళికను బీజేపీ ఇప్పటికే సిద్ధం చేసుకున్నదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. కాశీ, మథుర సెంటిమెంట్, యూనిఫాం సివిల్ కోడ్(యూసీసీ), మత మార్పిడి నిరోధక చట్టం, జనాభా నియంత్రణ చట్టం వంటి వాటిని ఆ పార్టీ ఆయుధాలుగా వాడుకొనే అవకాశం ఉన్నదని అంచనా వేస్తున్నారు. ఒకవేళ ఆ పార్టీ మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చినా.. ఆరెస్సెస్ సిద్ధాంతాలను అమలు చేసే పనిలోనే ఉంటుందని చెప్తున్నారు.

డాక్టర్లపై సస్పెన్షన్ ఎత్తివేస్తామని మంత్రి హామీ..

- తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతినిధులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కామారెడ్డి మెడికల్ కాలేజీలో డాక్టర్ల సస్పెన్షన్‌ను విచారణ నివేదిక రాగానే రద్దు చేస్తామని హామీ ఇవ్వడంపై తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతినిధులు డాక్టర్ బొంగు రమేష్ , డాక్టర్ అజ్మీరా రంగ, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రఘు, డాక్టర్ అబ్బయ్య హర్షం వ్యక్తం చేశారు. సోమవారం హైదరాబాద్‌లో వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి విన్నవించారు. అనంతరం కోఠిలోని డీఎంఈ ఆవరణలో మీడియాతో మాట్లాడారు. ఎలుకలు, పిల్లుల నుంచి రోగులకు ఇబ్బంది రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత హౌసింగ్ కీపింగ్ వారిదని తెలిపారు. డాక్టర్లు వైద్యం మాత్రమే అందిస్తారని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం సరైన మౌలిక సదుపాయాలు లేకుండా మెడికల్ కాలేజీలు ప్రారంభించిందనీ, ఇప్పటికీ కామారెడ్డి మెడికల్ కాలేజీలో నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చినట్టు చెప్పారు. ఈ సందర్భంగా డాక్టర్ వసంత్ కుమార్ మాట్లాడుతూ తన సస్పెన్షన్ ఎత్తివేస్తామని మంత్రి హామీ ఇవ్వడం పట్ల మంత్రికి, తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎలుకలను వెతికే పని మాది కాదు

- తెలంగాణ కాంట్రాక్ట్ డాక్టర్స్ అసోసియేషన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రోగులు డిశ్చార్జి అయ్యేంత వరకు చికిత్స అందించడమే తమ పని అని తెలంగాణ కాంట్రాక్ట్ డాక్టర్స్ అసోసియేషన్ తెలిపింది. ఈ మేరకు సోమవారం అసోసియేషన్ నాయకులు ఒక ప్రకటన విడుదల చేశారు. రోగులను కరవకుండా వార్డుల్లో ఎలుకలను వెతికే పని తమది కాదని తేల్చిచెప్పారు. ఐసీయూలో రోగిని ఎలుక కరిచిన ఘటనలో కామారెడ్డి ప్రభుత్వాస్పత్రి మెడికల్ ఆఫీసర్ ను సస్పెండ్ చేయడంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఐసీయూ ఉన్నదే రోగులను కాపాడటానికే తప్ప ఎలుకల మీద నిఘా పెట్టడానికి కాదని గుర్తుచేశారు.

జీతాలు రాక రాజీనామాలు

టీవీవీపీ ఐసీయూ కాంట్రాక్ట్ డాక్టర్లకు 10 నెలల నుంచి జీతాలు రాలేదని ఆ నాయకులు తెలిపారు. ఈ విషయంపై పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఫలితం లేకపోవడంతో ఇప్పటికే పలువురు రాజీనామా చేసినట్టు చెప్పారు. డీఎంఈ వైద్యులు, టీవీవీపీ వైద్యుల మధ్య మెరుగైన సమన్వయం అవసరమని సూచించారు. టీవీవీపీ ఐసీయూ డాక్టర్ల సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

నెల రోజుల్లో గ్రీన్ ఛానల్ ద్వారా ఉపకారవేతనాలు

- టీ-జూడా ప్రతినిధులకు మంత్రి దామోదర హామీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నెల రోజుల్లో ఉపకార వేతనాల పంపిణీ ప్రక్రియను గ్రీన్ ఛానల్ ద్వారా ప్రారంభించనున్నట్టు వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో మంత్రి దామోదరను కలిసిన టీ-జూడా ప్రతినిధులు ఆయనకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పెండింగ్ ఉపకార వేతనాలను వెంటనే విడుదల చేయాలని ఆర్థికశాఖ కార్యదర్శిని కోరారు. డిస్ట్రిక్ట్ రెసిడెన్సీ ప్రోగ్రాంకు సంబంధించి పోస్ట్ గ్రాడ్యుయేట్లు ఎదుర్కొంటున్న హాస్టల్ సౌకర్యాలు తదితర విషయాలపై సమగ్ర నివేదకను రెండు రోజుల్లో సమర్పించాలని అధికారులను ఆదేశించారు. త్వరలోనే ఉస్మానియా జనరల్ ఆస్పత్రి నూతన భవన నిర్మాణం కోసం శంకుస్థాపన చేయనున్నట్టు మంత్రి తెలిపారు.

పాలస్తీనా రచయితలకు అండగా నిలవండి

న్యూఢిల్లీ : పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ సైనికులు సాగిస్తున్న మారణహోమంపై స్పందించాలని 600 మందికి పైగా రచయితలు, కవులు 'పెన్ అమెరికా' సంస్థను కోరారు. సాహితీవేత్తల భావ ప్రకటనా స్వేచ్ఛను పరిరక్షించేందుకు ఈ సంస్థ కృషి చేస్తోంది. పాలస్తీనాలోని రచయితల ప్రాణాలు ప్రమాదంలో పడ్డాయని, వారికి స్వేచ్ఛ లేకుండా పోయిందని కవులు, సాహితీవేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికాలో పుస్తకాలను నిషేధించడంలో చూపిన తెగువ, ధైర్యాన్ని పాలస్తీనా ప్రజల విషయంలో కూడా చూపాలని వారు పెన్ అమెరికా సంస్థకు సూచించారు. పెన్ అమెరికా ఇకనైనా మౌనాన్ని వీడాలని, తనను తాను అభినందించుకునే వైఖరిని విడనాడాలని, జరుగుతున్న మారణహోమంపై వాస్తవ వైఖరిని ప్రదర్శించాలని వారు కోరారు. పాలస్తీనా రచయితలపై గత సంవత్సరం అక్టోబర్ 7వ తేదీ నుండి ఆంక్షలు కొనసాగుతున్నాయని, వారి కలాలకు కళ్లెం వేశారని తెలిపారు. వేధింపులకు గురవుతున్న రచయితలకు ఓ వేదికను కల్పించి, వారికి రక్షణగా నిలవలేని పక్షంలో పెన్ అమెరికాను రద్దు చేయాలని హితవు పలికారు.

పోలీసుల అణచివేత

- వారి తీరు భయభ్రాంతులకు గురి చేస్తున్నది
- అదుపులోకి తీసుకున్న తమవారిని విడుదల చేయాలి
- హల్ద్వానీలో ముస్లింల ఆందోళన

డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో పోలీసుల వ్యవహార శైలిపై స్థానిక ముస్లింలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసుల అణచివేత తమను భయభ్రాంతులకు గురి చేస్తున్నదని చెప్తున్నారు. ఈ నెల 8న హల్ద్వానీలో స్థానిక అధికార యంత్రాంగం ఒక మసీదు, మదర్సా కూల్చివేసిన ఘటన.. అక్కడ హింసాత్మక పరిస్థితులకు కారణమైన విషయం విదితమే. ఈ ఘటన జరిగిన రెండు రోజుల తర్వాత పోలీసులు వ్యవహరించిన తీరు తమను ఆందోళనకు గురి చేసిందని ముస్లింలు చెప్తున్నారు. రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వ ఆదేశాల మేరకే ఇదంతా జరుగుతున్నదని కొందరు ఆరోపిస్తున్నారు.కూల్చివేత తర్వాత ఫిబ్రవరి 8న స్థానిక ప్రజలు, పోలీసులు ఘర్షణ పడిన బన్‌భూల్‌పురా నివాసితులు మాట్లాడుతూ.. పోలీసు అధికారులు తమ ఇండ్లలోకి చొరబడి, మహిళలతో సహా కుటుంబ సభ్యులపై దాడి చేశారని ఆరోపించారు. ఆస్తులను ధ్వంసం చేసి, అనేక మంది పురుషులను అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. "పోలీసు అధికారులు మా ఇంట్లోకి చొరబడ్డారు. వారు మా వస్తువులను చిందరవందర చేశారు. నా భర్తపై దాడి చేశారు. మమ్మల్ని కూడా నెట్టారు. వారు అతనిని తీసుకెళ్లారు. అతను ఎక్కడ ఉన్నాడో ఎలా ఉన్నాడో మాకు తెలియదు" అని స్థానిక పాఠశాలలో వంట చేసే షామా (38) అన్నారు. షామా భర్త నయీమ్(45) హల్ద్వానీలోని నిర్మాణ స్థలాలకు ఇసుకను రవాణా చేసే రోజువారీ కూలీ.

"నేను నా భర్తను కలవాలనుకుంటున్నాను. పోలీసు అధికారులు నా భర్తను తీసుకెళ్లారు. ఆయన లేకుంటే నేను చనిపోతాను" అని 22 ఏండ్ల మెహ్రీన్ చెప్పింది. ఆమె భర్త ఆరిఫ్(25)ను నలుగురు పోలీసు అధికారులు తీసుకెళ్లారని తెలిపింది. మెహ్రీన్, ఆరీఫ్‌లకు ఏడు నెలల క్రితమే వివాహమైంది.

అయితే, సాక్ష్యాధారాలు లేకుండా ఎవరిపైనా ఇలా ప్రవర్తించే ఉద్దేశం మాకు లేదని ఉత్తరాఖండ్ డీజీపీ అభినవ్ కుమార్ అన్నారు.పర్వీన్(30) అనే మహిళ మాట్లాడుతూ.. " నా భర్త ముకీమ్ రోజువారీ కూలీ. ఆయనను పోలీసు అధికారులు తీసుకెళ్లారు" అని చెప్పారు. షాహిద్(35) అనే కూరగాయల విక్రేతను కూడా పోలీసులు పట్టుకున్నారని ఆయన తల్లి వాపోయారు. ఫిబ్రవరి 8న పర్వీన్ బట్టలు ఆరేయటానికి వెళ్లాడనీ, ఆ సమయంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. అదుపులోకి తీసుకున్న తమవారిని పోలీసులు.. వారిపై దాడులకు దిగారని పలువురు మహిళలు విలపించారు. పని చేసుకుంటే కానీ పూట గడవని తమ ఇండ్లలో.. మగవారే జీవనాధారమనీ, అలాంటి వారిని పోలీసులు ఉద్దేశపూర్వకంగానే అదుపులోకి తీసుకున్నారని స్థానిక ముస్లిం మహిళలు ఆరోపిస్తున్నారు. తమవారిని విడిచి పెట్టాలని కోరారు.కాగా, పోలీసు చర్య హల్ద్వానీ నుంచి ముస్లింల వలసలను ప్రేరేపించినట్టు కనిపిస్తున్నది. ఫిబ్రవరి 11 ఉదయం, వందలాది మంది ప్రజలు, చేతిలో సామానుతో పొరుగున ఉన్న పట్టణాలు, యూపీలోని నగరాలకు బస్సులు ఎక్కారు. పోలీసుల ఒత్తిడి లేని సురక్షితమైన ప్రదేశాల కోసం వారు వెతుకుతున్నారు.

మరో 25 మంది అరెస్టు

- ఉత్తరాఖండ్ పోలీసులు వెల్లడి


డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీ హింసలో మరో 25 మంది అరెస్టయ్యారు. మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ఈ విషయాన్ని రాష్ట్ర పోలీసులు తెలిపారు. ఈనెల 8న హల్ద్వానీలో స్థానిక అధికార యంత్రాంగం ఒక మసీదు, మదర్సాను కూల్చివేసిన తరువాత హింస చెలరేగిన విషయం విధితమే. అరెస్టయినవారిలో 12 మంది పోలీస్ స్టేషన్‌పై దాడికి పాల్పడ్డారనీ, ఆరుగురు పోలీస్ స్టేషన్ వెలుపల కార్లను తగులబెట్టారనీ, ఏడుగురు కూల్చివేత సమయంలో హింసలో పాల్గొన్నారని పోలీసులు ఆరోపించారు. హింసాకాండకు సంబంధించి ఇప్పటివరకు మొత్తం 30 మందిని అరెస్టు చేసినట్టు నైనిటాల్ సీనియర్ పోలీసు సూపరింటెండెంట్ ప్రహ్లాద్ నారాయణ్ మీనా తెలిపారు. ఈ వ్యవహారంపై ఇప్పటి వరకు మూడు ఎఫ్ఐఆర్‌లు దాఖలయ్యాయని చెప్పారు.

జీవో 59పై విజిలెన్స్ విచారణ

- అక్రమ రిజిస్ట్రేషన్లపై ఆరా :వచ్చిన దరఖాస్తులు 48 వేలు 38 బృందాలతో క్షేత్రస్థాయిలో పరిశీలన
- కదిలిన విలువైన భూముల ఫైళ్లు
- రూ.కోట్ల విలువ గల భూములు మాయం చేసినట్టు సమాచారం

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

గూడు లేని నిరుపేదలు ప్రభుత్వ భూముల్లో ఎన్నో ఏండ్లుగా జీవనం సాగిస్తున్న జాగాలను క్రమబద్ధీకరీచేందుకు గత ప్రభుత్వం జీవో నెంబర్ 59ను తీసుకొచ్చింది. ఈ జీవోతో పేద ప్రజలకు న్యాయం జరుగుతుందని ప్రభుత్వం భావిస్తే.. కొంత మంది అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసి అక్రమాలకు పాల్పడ్డారు. రాష్ట్ర రాజధాని శివారు ప్రాంతాల్లో విలువైన భూములపై కన్నేసిన రాజకీయ నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు పెద్ద మొత్తంలో ప్రభుత్వ భూములను 59 జీవో పేర స్వాధీనం చేసుకున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విజిలెన్స్ విచారణ చేయిస్తోంది. త్వరలో అక్రమార్కుల చిట్టాను బయటపెట్టేందుకు విజిలెన్స్ అధికారులు సిద్ధమైనట్టు సమాచారం.భూముల ధరలకు రెక్కలు రావడంతో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో విలువైన ప్రభుత్వ భూములు మాయమ వుతున్నాయి. కబ్జా పెట్టిన భూములను క్రమబద్ధీకరించుకోవడానికి జీవో 59 వారికి వరంగా మారింది. జిల్లాలో జీవో నెంబర్ 59 కింద సుమారు 48 వేల దరఖాస్తులు వచ్చినట్టు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఈ దరఖాస్తుల పరిశీలన కోసం 38 బృందాలు క్షేత్రస్థాయిలో.. ప్రభుత్వ జాగాల్లో ఎవరు ఇంటి నిర్మాణం చేసుకుని నివాసం ఉంటున్నారన్నది పరిశీలన చేసి 59జీవో కింద అర్హులా కాదా అన్నది నిర్ధారించాల్సి ఉంది. కానీ ఇక్కడే అసలు కథ మలుపు తిరిగింది. క్షేత్రస్థాయిలో రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు కలిసి అధికా రులతో తప్పుడు రిపోర్టులు రాయించుకుని రూ. కోట్ల విలువైన ప్రభుత్వ భూములను క్రమబద్ధీకరించుకున్నట్టు తెలిసింది. రాష్ట్రంలో అత్యధిక ధరలు ఉన్న రంగారెడ్డి జిల్లాలో శేరిలింగంపల్లి, శంకర్‌పల్లి, నార్సింగ్, శంషాబాద్, మహేశ్వరం, బాలాపూర్, ఇబ్రహీంపట్నం, అబ్దులాపూర్‌మెట్, హయత్‌నగర్ మండలాల పరిధిలో ఎక్కువ మొత్తంలో 59జీవో కింద ప్రభుత్వ భూములు మాయమైనట్టు తెలుస్తోంది.



రెవెన్యూ రిపోర్టులపై విజిలెన్స్ విచారణ

59 జీవో కింద జిల్లాలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి క్షేత్రస్థాయిలో ఇంటి నిర్మాణాలు ఉన్నాయా..! లేదా.. వాస్తవ పరిస్థితులను పరిశీలించి రిపోర్టు చేయాలి. కానీ అధికారులు అవేమీ పట్టించుకోకుండా కాసుల కక్కుర్తితో అర్హత లేని వారికి కూడా తప్పుడు రిపోర్టుల ద్వారా ప్రభుత్వ భూములను క్రమబద్ధీకరీంచినట్టు విచారణలో ఒక్కొక్కటి బయటపడ్తున్నాయి. అప్రూవ్ అయిన ఫైళ్లలో 20శాతం రాజకీయ నేతల ప్రోద్బలంతో క్లియర్ అయినట్టు తెలిసింది. త్వరలో ఎన్ని భూములు అక్రమార్కుల చేతుల్లోకి పోయినవి అన్నది బయట పెట్టేందుకు విజిలెన్స్ అధికారులు సిద్ధంగా ఉన్నట్టు సమాచారం. దీంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. తప్పుడు రిపోర్టులు ఇచ్చిన అధికారులు, అక్రమాలకు పాల్పడిన వారికి చర్యలు తప్పవని ఉన్నతాధికారులు తెలిపారు.

ప్రశ్నలకు సమాధానాలిచ్చాకే నల్లగొండ సభకు వెళ్లాలి

- కేసీఆర్ కు టీజేఎస్ లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కృష్ణా జలాల పరిరక్షణ కోసమంటూ నల్లగొండ సభకు వెళ్లే ముందు తామడిగే ప్రశ్నలకు సమాధానాలివ్వాలని తెలంగాణ జన సమితి (టీజేఎస్) బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కుంట్ల ధర్మార్జున్ పలు ప్రశ్నలతో కె.చంద్రశేఖర్ రావుకు బహిరంగ లేఖ రాశారు. తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కృష్ణా, గోదావరి నదులపై ఉన్న ప్రాజెక్టులన్నింటినీ నదీ యాజమాన్య బోర్డులకు అప్పగించాలని 2021 జులై 15న కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసినప్పుడు సీఎం హోదాలో ఎందుకు మౌనంగా ఉన్నారు? ప్రాజెక్టుల నిర్వహణకు ఆయా యాజమాన్య బోర్డులకు రూ.200 కోట్లు చెల్లించాలని పెట్టిన డిమాండ్‌కు అనుగుణంగా రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులు జరిపింది వాస్తవం కాదా? భారత రాజ్యాంగం ప్రకారం నీరు రాష్ట్ర జాబితాలో ఉన్నప్పటికీ రాజ్యాంగ విరుద్ధంగా కేంద్రం లాగేసుకుంటుంటే, ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయించకుండా కేసీఆర్‌ను ఆపిందెవరు? అంటూ ప్రశ్నించారు.

"గెజిట్ నోటిఫికేషన్‌లో రాష్ట్ర పరిధిలో వున్న ప్రాజెక్టులకు ఆరు మాసాలలో అనుమతులు సాధించుకోవాలనీ, లేనట్టయితే నోటిఫికేషన్ అమల్లోకి వచ్చిన రోజునే పనులు ఆపేయాలని చెప్పింది. మరి బీఆర్ఎస్ సర్కారు కృష్ణా నదిలో నీటిని వినియోగం చేసుకోవడానికి ఎన్ని ప్రాజెక్టులను పూర్తి చేశారు. ఎన్ని ప్రాజెక్టులకు అనుమతులు సాధించారు.? ఈ గెజిట్ అమలులోకి వస్తే ప్రాజెక్టు నిర్మాణాలు ఆగిపోయి, వాటి కోసం తీసుకునే రుణాలు వడ్డీతో సహా చెల్లించడం భారమని తెలిసి కూడా ఎందుకు కార్పొరేషన్ల పేరుతో అప్పులు తెచ్చారు? ఎందుకు లక్షల ఎకరాల భూమిని బలవంతంగా సేకరించారు ? ఎస్సెల్బీసీ ఎడమ కాలువకు, సొరంగం త్రవ్వకానికి పదేండ్ల పాలనలో ఎందుకు నిధులు కేటాయించలేదు? "అంటూ ఆ లేఖలో నిలదీశారు.

పానీ పట్టు యుద్ధం..

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర అసెంబ్లీలో 'పానీ' పట్టు యుద్ధం నడిచింది. కృష్ణా నదీ జలాల్లో తెలంగాణకు సరైన వాటా దక్కక పోవటానికి, న్యాయంగా రావాల్సిన నీటి వాటాలు రాకపోవటానికి 'మీరే కారణమంటే.. కాదు మీరే కారణమంటూ...' అధికార, ప్రధాన ప్రతిపక్షాలు పరస్పరం ఆరోపణాస్త్రాలు సంధించుకున్నాయి. గత పదేండ్ల బీఆర్ఎస్ సర్కారు వైఫల్యాల వల్లే నదీ జలాల్లో మనకు అన్యాయం జరిగిందని కాంగ్రెస్ విమర్శిస్తే.. అవగాహన, అనుభవరాహిత్యంతో రేవంత్ ప్రభుత్వం వ్యవహరించటం వల్లే కేఆర్ఎమ్‌బీ పరిధిలోకి ప్రాజెక్టులు వెళ్లాయంటూ గులాబీ పార్టీ విమర్శలు గుప్పించింది. రెండు పార్టీలకు చెందిన సభ్యుల వాగ్వాదాలు, వాగ్బాణాలతో సభ దద్దరిల్లింది. దూషణ భాషణలు, వ్యక్తిగత విమర్శలతో పలుమార్లు అసెంబ్లీ హీటెక్కింది. చివరికి కృష్ణా నదీ జలాలు, కేఆర్ఎమ్‌బీ సంబంధిత అంశాలపై ప్రభుత్వం ప్రవేశపెట్టిన తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదం పొందింది.

రాష్ట్ర శాసనసభ ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ఒకరోజు విరామానంతరం సోమవారం అసెంబ్లీ సమావేశమైంది. సభ ఉదయం 10.05 గంటలకు ప్రారంభం కాగానే సభా సమక్షంలో ఉంచిన పలు పత్రాల గురించి స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రస్తావించారు. అనంతరం సభాపతి సూచన మేరకు హుక్కా, ఇతర మాదక ద్రవ్యాలను నిషేధానికి సంబంధించిన సవరణ బిల్లును శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రతిపాదించారు. ఆ బిల్లును సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం ఉదయం 10.18 గంటలకు స్పీకర్ తేనీటి విరామాన్ని ప్రకటించారు. తిరిగి సభ ఉదయం 11.21 గంటలకు ప్రారంభం కాగానే సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.. కృష్ణా నదీ జలాల అంశంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇస్తూ సుదీర్ఘంగా ప్రసంగించారు. ఆయన ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. 'ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కంటే తెలంగాణ వచ్చిన తర్వాతే నదీ జలాల్లో మనకు తీవ్ర అన్యాయం జరిగింది. దీనికి ముమ్మాటికి బీఆర్ఎస్ ప్రభుత్వ అలసత్వం, వైఫల్యమే కారణం...' అంటూ ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. తెలంగాణ జలాలను ఆంధ్రప్రదేశ్‌కు తరలించటానికి సహకరించిన కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నానంటూ ఏపీ సీఎం జగన్ చేసిన వ్యాఖ్యలతో కూడిన క్లిప్పింగ్‌ను ఉత్తమ్ ఈ సందర్భంగా ప్రదర్శించారు.

కృష్ణా నదీ జలాలపై ప్రభుత్వం శాసనసభలో తీర్మానించటాన్ని బీఆర్ఎస్ విజయంగా ఆ పార్టీ సీనియర్ సభ్యుడు తన్నీరు హరీశ్‌రావు అభివర్ణించారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వటానికి తమకూ అనుమతినివ్వాలంటూ ఆయన స్పీకర్‌ను కోరారు. కేసీఆర్‌ను గతంలో కరీంనగర్ ప్రజలు తిరస్కరిస్తే.. ఆయన మహబూబ్‌నగర్‌కు పారిపోయారంటూ సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలపై హరీశ్ ఘాటుగా స్పందించారు. 'మిమ్మల్ని గతంలో కొడంగల్ ఓడిస్తే... మల్కాజిగిరికి వచ్చారు కదా..?' అంటూ ఎద్దేవా చేశారు. చర్చ ఈ విధంగా కొనసాగుతున్న క్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఆయన సోదరుడు, అధికార పార్టీ ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి... హరీశ్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రధాన ప్రతిపక్ష నేతగా ఉన్న కేసీఆర్... సభకు రాకపోవటాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌తోపాటు మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తప్పుబట్టారు. శాసనసభలో సమస్యలపై చర్చల ద్వారా ప్రజలకు సందేశాన్ని ఇవ్వాల్సిన ప్రతిపక్ష నేత ఫామ్‌హౌస్‌లో దాక్కున్నారంటూ సీఎం ఎద్దేవా చేశారు. సభకు రానటువంటి కేసీఆర్... ఆ రకంగా తెలంగాణ సమాజాన్ని అవమానపరుస్తున్నారంటూ రేవంత్ ఈ సందర్భంగా ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ రకంగా సోమవారం వాడివేడిగా సభ కొనసాగిన దరిమిలా... ఇప్పుడు సీన్ ఇటు నల్లగొండకు, అటు మేడిగడ్డకు మారనుంది. ఇప్పటిదాకా నీటి వాటాలపై సభలో సమరం సాగించిన అధికార, ప్రతిపక్షాలు మంగళవారం క్షేత్రస్థాయికి వెళ్లనున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ బ్యారేజీలో కుంగిన పిల్లర్లను పరిశీలించేందుకు సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతోపాటు అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హైదరాబాద్ నుంచి బయల్దేరి వెళ్లనున్నారు. ఉదయం 10 గంటలకు అసెంబ్లీ ప్రారంభం కాగానే కొద్ది సేపు సభా కార్యక్రమాల్లో పాల్గొని, అనంతరం వారు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సుల్లో మేడిగడ్డకు బయలుదేరుతారు. మధ్యాహ్నం మూడు గంటలకు వారు అక్కడికి చేరుకుంటారు. రెండు గంటలపాటు క్షేత్రస్థాయి పరిశీలన, పవర్ పాయింట్ ప్రజంటేషన్ అనంతరం తిరిగి సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్‌కు ఆ బృందం బయల్దేరుతుందని అధికారిక వర్గాలు వెల్లడించాయి. మరోవైపు కేఆర్ఎమ్‌బీకి కృష్ణా ప్రాజెక్టులను అప్పగించటాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ మంగళవారం నల్లగొండలో బహిరంగ సభను నిర్వహించనుంది. ఈ సభకు ఆ పార్టీ అధినేత కేసీఆర్‌తోపాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు హాజరు కానున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభమయ్యే ఈ సభకు ఇప్పటికే ఏర్పాట్లు చేసినట్టు నాయకులు తెలిపారు. అయితే డిసెంబరులో నిర్వహించిన అసెంబ్లీ సమావేశాలతోపాటు ప్రస్తుత ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాలకూ కేసీఆర్ వరసగా నాలుగో రోజూ డుమ్మా కొట్టటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటిదాకా సభ మొహం చూడని కేసీఆర్...మంగళవారం నల్లగొండకు వెళుతుండటం గమనార్హం.

తప్పలను తప్పించుకునేందుకుకే కేఆర్ఎంబీపై చర్చ

- బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్

నవతెలంగాణ-సిటీబ్యూరో

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు గతంలో చేసిన తప్పులను కప్పి పుచ్చుకునేందుకే అసెంబ్లీలో కేఆర్ఎంబీపై చర్చ చేస్తున్నాయని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద బీజేపీ ఎమ్మెల్యే కె.వెంకటరమణరెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ది కోసమే ఈ చర్చ అని విమర్శించారు. గతంలో కృష్ణా జలాల కోసం రూ.200 కోట్లు ఎందుకు కేటాయించారో తెలియదని, కేఆర్ఎంబీకి అప్పగిస్తారనే కారణం కావచ్చునని అన్నారు. ఏ సర్వే చూసినా బీజేపీకి మెజార్టీ అవకాశముందని కాబట్టి కేంద్రంపై నింద వేస్తున్నాయన్నారు. మరోసారి తెలంగాణ ప్రజలను నమ్మించాలని కాంగ్రెస్, బీఆర్ఎస్ యత్నిస్తున్నాయన్నారు.

మోడీ సర్కార్ ఉలికిపాటు



- రాజధానిలో నిరసన గళం విప్పిన కర్నాటక, కేరళ
- దక్షిణాదిపై వివక్ష ఎందుకని మండిపాటు
- బకాయిలు ఎప్పుడు ఇస్తారని నిలదీత
- సంఘీభావం తెలిపిన ప్రతిపక్షాలు

న్యూఢిల్లీ : నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర సర్కారుకు వ్యతిరేకంగా 'నా పన్ను...నా హక్కు' పేరుతో కర్నాటక ప్రభుత్వం దేశ రాజధానిలో నిర్వహించిన నిరసన కార్యక్రమం ప్రతిపక్షాల్లో ఉత్సాహాన్ని నింపింది. మరో రెండు నెలల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న తరుణంలో ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు ఒక్కొక్కటిగా కేంద్రంపై బాహాటంగా గొంతు విప్పుతున్నాయి. మోడీ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుండీ ప్రజా సమస్యలను గాలికి వదిలేసి మందిరం, మతతత్వం, నయా జాతీయతావాదం, దేశభక్తి వంటి భావోద్వేగపూరితమైన అంశాలనే పట్టుకొని వేళ్లాడుతోంది. అయితే గత కొద్ది రోజులుగా దేశంలో రాజకీయం ఆశ్చర్యకరమైన మలుపులు తీసుకుంటోంది. తమకు రావాల్సిన న్యాయమైన నిధుల కోసం కర్నాటకకు చెందిన కాంగ్రెస్ నేతలందరూ దేశ రాజధానికి కదలివచ్చి, మోడీ ప్రభుత్వాన్ని నిగ్గదీశారు. ఆ మరునాడే కేరళకు చెందిన వామపక్ష నేతలు కూడా దేశ రాజధానిలోనే మోడీని నిలదీశారు. దేశంలో తనకు ఎదురే లేదని భావిస్తున్న ప్రధాని మోడీకి ఈ పరిణామాలు ఇబ్బందిని కలిగించాయనడంలో ఎలాంటి సందేహం లేదు.

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత కాంగ్రెస్‌కు చెందిన బెంగళూరు రూరల్ ఎంపీ, కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సోదరుడు డీకే సురేష్ కేంద్ర ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. మోడీ ప్రభుత్వం దక్షిణాదికి తీవ్ర అన్యాయం చేస్తోందని, దక్షిణాది రాష్ట్రాల నుండి వచ్చే నిధుల్ని దారి మళ్లించి ఉత్తరాదికి దోచిపెడుతోందని ఆరోపించారు. దక్షిణ భారతదేశంపై హిందీ ప్రాంతాన్ని రుద్దుతున్న నేపథ్యంలో ప్రత్యేక దేశాన్ని ఏర్పాటు చేయాలని కూడా ఆయన డిమాండ్ కూడా చేశారు. దీనిపై మోడీ ప్రభుత్వం ఉలికిపాటుకు గురైంది. ఆ పార్టీ ఎంపీలు, నేతలు, ట్రోల్స్ సైన్యం ఒక్కసారిగా సురేష్‌పై విరుచుకుపడ్డారు. ఆయన్ని వేర్పాటువాదిగా, దేశ వ్యతిరేకిగా చిత్రీకరించారు. ఉత్తర, దక్షిణ ప్రాంతాల మధ్య సురేష్ చిచ్చు పెడుతున్నారని విమర్శించారు. సురేష్ ప్రకటనను కాంగ్రెస్ తొలుత ఖండించినప్పటికీ ఆర్థిక వ్యవహారాల విషయంలో దక్షిణాది రాష్ట్రాల పట్ల కేంద్రం నిష్పాక్షికంగా వ్యవహరించకపోవడం వాస్తవమేనని, అందుకే ఆయన అలా దక్షిణాదిని ప్రత్యేక దేశంగా ప్రకటించాలని కోరి ఉండవచ్చునని వివరణ ఇచ్చింది.

కర్నాటక 'ఛలో ఢిల్లీ'

కొద్ది రోజుల తర్వాత ఈ నెల 6న కాంగ్రెస్ ప్రభుత్వం జాతీయ వార్తా పత్రికల్లో 'ఛలో ఢిల్లీ' అంటూ పూర్తి పేజీ ప్రకటనలు ఇచ్చింది. కన్నడిగులపై, కర్నాటకపై కేంద్ర ప్రభుత్వ ఆర్థిక వేధింపులకు నిరసనగా రాష్ట్ర నేతలందరూ ఢిల్లీకి తరలి వెళ్లాలని అందులో పిలుపునిచ్చింది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఓ అడుగు ముందుకు వేసి ఈ నిరసనకు రాజకీయాలతో సంబంధం లేదని, కాబట్టి బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు కూడా రావాలని కోరారు. ఏదేమైనా కాంగ్రెస్ నిర్వహించిన నిరసన కార్యక్రమంతో మోడీ ప్రభుత్వం ఉలిక్కి పడింది. కాంగ్రెస్‌పై ఎదురు దాడికి దిగుతూ ఆత్మరక్షణ చేసుకునేందుకు ప్రయత్నించింది. ప్రధాని మోడీ సైతం పార్లమెంటులో కాంగ్రెస్‌పై మండిపడ్డారు.

దక్షిణాది రాష్ట్రాల పట్ల మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న వివక్షాపూరిత వైఖరిని కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి శివకుమార్ గణాంకాలతో సహా ప్రజల ముందు ఉంచారు. 15వ ఆర్థిక సంఘం రూపొందించిన ఫార్ములా ప్రకారం గత ఐదు సంవత్సరాల్లో కర్నాటక రూ.1.87 లక్షల కోట్లు నష్టపోయిందని వారు వివరించారు. రాష్ట్రం వసూలు చేస్తున్న ప్రతి వంద రూపాయల పన్నులో కేవలం రూ.13 రూపాయలే తిరిగి రాష్ట్రానికి దక్కుతున్నాయని తెలిపారు. మహారాష్ట్ర తర్వాత దేశంలో రెండో అతి పెద్ద పన్ను చెల్లింపుదారు అయిన కర్నాటక అందుకు తగిన ప్రతిఫలం పొందలేకపోతోందని సిద్ధరామయ్య వాపోయారు.

కేరళ సైతం...

జంతర్‌మంతర్ వద్ద కర్నాటక నిరసన జరిపిన మరునాడే కేరళ కూడా అక్కడే ఆందోళన నిర్వహించింది. దీనికి రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ నేతృత్వం వహించారు. జీఎస్టీ పరిహారం ఆగిపోవడం, పన్నుల్లో వాటా కుదించడం, రుణాలకు అనుమతి నిరాకరించడం వల్ల రాష్ట్రం రూ.57,000 కోట్లు నష్టపోయిందని ఆయన తెలిపారు.

ఈ నిరసన కార్యక్రమానికి పలువురు ప్రతిపక్ష నేతలు తరలివచ్చి సంఘీభావం తెలిపారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, సీపీఐ (ఎం) నేత సీతారాం ఏచూరి, జమ్మూకాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూఖ్ అబ్దుల్లా, సీపీఐ నేత డీ.రాజా తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. అదే రోజు డీఎంకే కూడా నిరసన తెలిపింది. కేరళ ఆందోళనకు డీఎంకే అధినేత, తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ సంఘీభావం తెలిపారు. ఆ కార్యక్రమానికి తన క్యాబినెట్ సహచరుడు పీటీ రాజన్‌ను పంపారు.

సుప్రీంను ఆశ్రయించిన కేరళ

ఇక్కడ మరో విషయాన్ని కూడా గుర్తు చేసుకోవాలి. ఉద్యోగుల జీతాలు, వరద బాధితులకు పునరావాసం, అభివృద్ధి పనుల కోసం వెంటనే నిధులు విడుదల చేయాల్సిందిగా కేంద్రాన్ని ఆదేశించాలని కోరుతూ గత నెల 12న కేరళ ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. మోడీ ప్రభుత్వం తరపున వాదించిన అటార్నీ జనరల్ దీనికి అభ్యంతరం తెలుపుతూ 33 రాష్ట్రాలకు లేని సమస్య ఒక్క రాష్ట్రానికే వచ్చిందని వ్యాఖ్యానించారు. కేరళ పిటిషన్‌కు సమాధానం ఇవ్వాలని సుప్రీంకోర్టు మోడీ ప్రభుత్వాన్ని ఆదేశించింది.


తెలంగాణ కూడా...

తెలంగాణలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కేంద్రంపై దాడి ప్రారంభించింది. రాష్ట్ర ప్రయోజనాల కోసం రాజకీయాలను పక్కన పెట్టి అందరూ చేతులు కలపాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శాసనసభలో అన్ని పక్షాలకూ సూచించారు.

రాష్ట్రాలు ఏం కోరుతున్నాయి?

ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు కేంద్రాన్ని కోరుతున్నది ఒక్కటే. పేద రాష్ట్రాలకు అధిక నిధులు ఇవ్వడాన్ని అవి వ్యతిరేకించడం లేదు. తమకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని, బీజేపీకి మిత్రపక్షంగా లేనందుకు తమను శిక్షించవద్దని అవి కోరుకుంటున్నాయి. 15వ ఆర్థిక సంఘం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా (ఆదాయ వ్యత్యాసానికి 45%, జనాభాకు 15%, విస్తీర్ణానికి 15%, అడవులు-జీవావరణానికి 10%, జనాభా పనితీరుకు 12.5%, పన్ను ప్రయత్నాలకు 2.5%) బకాయిలు చెల్లిస్తే చాలునని అంటున్నాయి. జరిమానాలు విధించడం లేదా తమకు రావాల్సిన నిధులను ఇవ్వకపోవడం ద్వారా కేంద్రం తమ చేతులు కట్టేస్తోందని ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

నవతెలంగాణ మానవి
www.navatelangana.com



పదమూడేండ్ల వయసులో ఎదుర్కొన్న ఆరోగ్య సమస్య ప్రియాషా సలుజా వ్యాపార వేత్తగా మార్చింది. ఇష్టమైన ఆహారం తీసుకోడానికి తనలా ఇబ్బంది పడుతున్న వారికి పరిష్కారంగా 2019లో ది సిన్నమోన్ కిచెన్‌ను ప్రారంభించింది. ఆహారం పట్ల ఆమెకున్న ఇష్టాన్నే వృత్తిగా మలుచుకుంది. కోట్లల్లో వ్యాపారం చేస్తూ గొప్ప మహిళా పారిశ్రామిక వేత్తగా ఎదిగి ప్రజలకు ప్రిజర్వేటివ్ రహిత ఉత్పత్తులను అందిస్తున్న ఆమె పరిచయం నేటి మానవిలో...

ఇష్టాన్నే వృత్తిగా మలుచుకుంది

ప్రియాషా సలుజా తన 13 ఏండ్ల వయసులో పీసీఓఎస్ బారిన పడింది. స్వీట్స్ ఎక్కువగా ఇష్టపడే ఆమె అప్పటి నుండి ఆహార విషయంలో అనేక జాగ్రత్తలు తీసుకోవల్సి వచ్చింది. అది ఆమెకెంతో కష్టంగా మారింది. 'ఆ సమయంలో పీసీఓఎస్ గురించి పెద్ద చర్చ జరిగేది కాదు. అవగాహన చాలా తక్కువగా ఉండేది. దాంతో నా ఆరోగ్య పరిస్థితి రీత్యా ఎన్నో సవాళ్లను, అవమానాలను ఎదుర్కొంటూ పెరిగాను' అంటూ ఆమె గుర్తు చేసుకుంది. ఆ పరిస్థితులే ఆమెను దీనిపై మరింత పరిశోధన చేయించాయి. పరిష్కారంగా ఇంట్లోనే ఆరోగ్యకరమైన పదార్థాలతో ప్రయోగాలు చేయడం ప్రారంభించింది. పిసిఓఎస్ ఉన్నట్లు నిర్ధారణ అయిన 9 ఏండ్ల తర్వాత అంటే 2018లో ప్రియాషా తన ఇన్‌స్టాగ్రామ్ పేజీ ద్వారా ఆరోగ్యకరమైన ఆహారపు ప్రయాణాన్ని డాక్యుమెంట్ చేయడం ప్రారంభించింది.

దానికి పరిష్కారంగా...

వంటకాలు, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, జీవనశైలి చిట్కాలను అందులో పొందుపరిచేది. 'ప్రజలు ఆరోగ్యంగా తినాలని కోరుకుంటున్నారు. కానీ సమయం, డబ్బు, ఆసక్తి వంటివి లేకపోవడంతో ఇంట్లో తయారు చేసుకోడానికి వారు సిద్ధంగా లేరని గుర్తించాను. దీనికి పరిష్కారంగానే ది సిన్నమోన్ కిచెన్‌ను ప్రారంభించాను' ఆమె చెప్పారు. సిన్నమోన్ కిచెన్ 100% గ్లూటెన్-ఫ్రీ, ప్రిజర్వేటివ్-ఫ్రీ, రిఫైన్డ్ షుగర్-ఫ్రీ, ఫ్లోర్-ఫ్రీ, ప్లాంట్-బేస్డ్ డి2సి ఉత్పత్తులను అందిస్తుందని ఆమె అంటున్నారు. ఢిల్లీ కేంద్రంగా కుకీలు, చిప్స్, కేకులు, బ్రెడ్‌తో పాటు మరెన్నో ఉత్పత్తుల అందిస్తుంది. 'స్వీట్లంటే నాకు చాలా ఇష్టం. నా ఇష్టాన్నే వృత్తిగా మార్చుకున్నాను' అని ఆమె చెప్పింది.

వంట పట్ల ప్రేమతో...

ఆమె జీవితంలో ఆహారం ఓ అంతర్భాగమైంది. 'నా కుటుంబంలో అందరూ వంట బాగా చేస్తారు. అందరూ ఉత్తర భారత వంటకాలను చేస్తుంటే, నేను ఎడారి ప్రాంత వంటలపై దృష్టి పెట్టాను. ముఖ్యంగా స్వీట్లను ఎక్కువగా తయారు చేస్తాను' అని ఆమె అంటుంది. ప్రియాషా పాఠశాలలో చదివేటపుడు తన స్నేహితురాలి కోసం మొదటి సారి కేక్ తయారు చేయడానికి ప్రయత్నించింది. ఆ కేక్ సరిగా తయారు కానప్పటికీ ఆ సంఘటన ఆమె జీవిత గమనాన్ని మార్చేసింది. అప్పటి నుంచి వెనక్కి తిరిగి చూడలేదు. ఒక్క కేక్ మాత్రమే కాదు పట్టుదలతో ఘేవార్, మలై పెధాతో పాటు రకరకాల వంటకాలతో ప్రయోగాలు చేస్తూనే ఉంది.

ఉద్యోగం నచ్చలేదు

నోయిడాకు చెందిన సలుజా ఢిల్లీ యూనివర్సిటీలో బిజినెస్ మేనేజ్‌మెంట్ పూర్తి చేసింది. గ్రాడ్యుయేషన్ తర్వాత పిడబ్ల్యూసి పన్నుల విభాగంలో చేరింది. క్రియేటివ్‌గా ఏదైనా చేయాలని అనుకుంటున్న సమయం ఇది. అందుకే మార్కెటింగ్, అడ్వర్టైజింగ్‌లోకి వెళ్లాలనుకుంది. వెంటనే Denstu Inc.లో చేరింది. అక్కడ పార్లే, ఐటిసి మొదలైన బ్రాండ్‌లతో పనిచేసింది. 'నచ్చిన మార్కెటింగ్‌లో చేరినప్పటికి నా ఆలోచనలకు అక్కడ ప్రాధాన్యం లేదు. నా అభిప్రాయాలకు చోటు లేదు. దాంతో నాకు స్వేచ్ఛకావాలనిపించింది' ఆమె చెప్పింది. 2019లో సోషల్ మీడియా ద్వారా ముంబైకి చెందిన ఒక బ్రాండ్ గురించి తెలుసుకుంది. వారు తమ ఈవెంట్‌లో ఫుడ్ స్టాల్‌ను ఏర్పాటు చేయవల్సిందిగా ఆమెను కోరారు. ఎంతో ఉత్సాహంగా ఆ ఈవెంట్‌లో పాల్గొంది. తర్వాత ఆమెకు చాలా ప్రశంసలు వచ్చాయి. ఆ ధైర్యంతో తన ఉద్యోగాన్ని విడిచిపెట్టి తన సొంత వ్యాపారాన్ని ప్రారంభించాలనుకుంది.

సవాళ్లు ఉన్నప్పటికీ...

కేవలం రూ.50,000 పెట్టుబడితో ఇంటి వంటగదిలోనే తన కంపెనీని ప్రారంభించింది. మొదట్లో వారానికి రెండు, మూడు ఆర్డర్లు వచ్చేవి. దీంతో భవిష్యత్‌లో వ్యాపారం ఎలా నడుస్తుందో అని కాస్త కంగారు పడింది. 'నేను ఒకపక్క నా ఉద్యోగాన్ని విడిచిపెట్టాను. మరోపక్క ఆర్డర్లు సరిగా రాలేదు. ఇది క్లిష్ట పరిస్థితిగా అనిపించింది' అంటూ ఆమె గుర్తు చేసుకుంది. ఇలాంటి సవాళ్లు ఉన్నప్పటికీ తన ప్రయత్నాలను కొనసాగించింది. తర్వాత కాలంలో రోజుకు రెండు, మూడు ఆర్డర్‌లకు పెరిగి ఆపై పది ఆర్డర్‌లకు ఆమె వ్యాపారం వృద్ధి చెందింది. 'వ్యాపార వేత్తగా ఉండటం అంటే ఎన్నో బాధ్యతలు ఉంటాయి. నిరంతరం అభివృద్ధి చెందుతున్న పాత్ర మనది. ఈ పని అత్యంత సవాలుగా ఉన్నప్పటికీ మంచి గుర్తింపునిస్తుంది' అని ఆమె జతచేస్తుంది. మహిళా వ్యాపారవేత్తగా తాను ఎదుర్కొన్న సవాళ్ల గురించి మాట్లాడుతూ 'లింగ వివక్ష నాకు వ్యక్తిగత సవాలుగా అనిపించలేదు. అందరినీ సమానంగా చూడాలి అనే వాతావరణంలో నేను పెరిగాను. దానికి తోడు నాతో వ్యాపారం చేస్తున్న వ్యక్తులు కూడా నన్ను స్వాగతించి సహకరించారు' అని చెప్పింది.

రుచితో పాటు ఆరోగ్యం

ప్రారంభంలో ఆమె నట్ బటర్ వంటి ప్యాక్ చేసిన ఆహారాలను అందిస్తూ తన వెంచర్‌ను ప్రారంభించింది. అయితే దీని కోసం కష్టమర్లు రెండు రోజులు ఎదురు చూడాల్సి వచ్చేది. దాంతో వాళ్ళు మరోసారి ఆర్డర్ ఇవ్వడానికి ఇష్టపడేవారు కాదు. అందువల్ల ది సిన్నమోన్ కిచెన్ కింద బేకరీ ప్రారంభించాలని ఆమె నిర్ణయించుకుంది. ఇప్పుడు ఆమె ఢిల్లీ అంతటా తన కేక్‌లను అందిస్తుంది. కంపెనీ తొలి ఏడాది రూ.1,40,000 వ్యాపారం చేసింది. తర్వాతి ఏడాది ఇది రూ. 12,50,000 అమ్మకాలను చూసింది. ఈ ఏడాది సుమారు రూ. 6 కోట్ల విక్రయాలు జరగొచ్చని అంచనా వేస్తోంది. 'ఇన్‌స్టాగ్రామ్‌లో మా బ్రాండ్‌గా ప్రారంభించాము. కస్టమర్లకు అసలు ఏమి అవసరమో తెలుసుకోవడానికి వారితో ఇంటరాక్ట్ అవ్వడానికి ఇది నాకు సహాయపడింది' ఆమె చెప్పారు.



బేకింగ్ వర్క్‌షాప్‌లు

'చక్కెర లేని, ప్రిజర్వేటివ్‌లు లేని' ఉత్పత్తులను అందించడమే కాకుండా తన వినూత్న వంటకాల పట్ల ఆమె గర్వంగా ఉంది. ఈమె వ్యాపారంలో 80% పైగా మహిళా శ్రామిక శక్తి కూడా ఉంది. ఇంకా మహిళల కోసం ఆమె బేకింగ్ వర్క్‌షాప్‌లను నిరంతరం నిర్వహిస్తుంది. ఈ వర్క్‌షాప్‌లు మూడు గంటలు ఉంటాయి. దీనికి రూ. 1,750 ఖర్చు అవుతుంది. చాలా మంది గృహిణులు ఈ వర్క్‌షాప్‌లలో ఉత్సాహంగా పాల్గొంటున్నారని ఆమె చెబుతుంది. సిన్నమోన్ కిచెన్‌కి వెబ్‌సైట్‌తో పాటు Blinkit, Amazon, Le Marche వంటి వాటి ద్వారా ఉత్పత్తులను విక్రయిస్తోంది. అలాగే ఆఫ్‌లైన్ స్టోర్‌లలో కూడా అందుబాటులో ఉన్నాయి. రాబోయే ఏడాదిలో ఉత్పత్తుల సంఖ్యతో పాటు ఆఫ్‌లైన్ స్టోర్లను పెంచడంపై దృష్టి పెట్టాలని ఆమె భావిస్తుంది.





అన్నదాతల్ని దేశ శత్రువులుగా భావించొద్దు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పంజాబ్, ఢిల్లీ సరిహద్దుల్లోని హైవేలపై ఇనుప మేకులు, ముళ్ల తీగలు, కాంక్రీట్ బారికేడ్‌లు ఏర్పాటు చేసి ప్రజాస్వామ్యయుతంగా నిర్వహిస్తున్న రైతుల ఆందోళనలపై మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న నియంతృత్వ ధోరణి పట్ల సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం)తీవ్ర అసంతృప్తిని, ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. ఢిల్లీ, హర్యానా పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ విధించి ప్రజలకు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ట్రాఫిక్‌ను దారి మళ్లించి ప్రజలను భయాందోళనకు గురిచేస్తోందని విమర్శించింది. నిరసనకారులను మోడీ ప్రభుత్వం దేశ శత్రువులుగా చూస్తోందని ధ్వజమెత్తింది. ఈ మేరకు సోమవారం ఎస్కేఎం ప్రకటన విడుదల చేసింది. "ఎబికేఎస్ నేత రామ్ నారాయణ్ కురారియాతో సహా అతని భార్య, ఐద్వా నేత అంజనా కురారియా, కిసాన్ సంఘర్ష సమితి నాయకుడు ఆరాధనా భార్గవ, బీకేయూ (తికాయత్) నేత అనిల్ యాదవ్, ఎస్ఎపీఎం నేత రాజ్‌కుమార్ సిన్హాలు, మధ్యప్రదేశ్‌తో పాటు ఐదు రాష్ట్ర నాయకులు, ఎస్కేఎం నాయకులపై సీఆర్పీసీ సెక్షన్ 151 కింద అరెస్టు చేసి జైలులో పెట్టారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పలువురు కార్యకర్తలను అరెస్టు చేశారు" అని తెలిపింది

"ఫిబ్రవరి 13న చలో ఢిల్లీకి తాము పిలుపునివ్వలేదని, ఈ ఆందోళనతో ఎస్‌కెఎంకు ఎలాంటి సంబంధం లేదని ఎస్‌కెఎం ముందే స్పష్టం చేసింది. అయితే, ఎస్‌కెఎం కాకుండా ఇతర సంఘాలకు నిరసన తెలిపే హక్కు ఉంది. మితిమీరిన రాజ్య అణచివేతకు కట్టుబడి ఉండే బదులు ఇటువంటి నిరసనలను ప్రజాస్వామ్య పద్ధతిలో చూడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది" అని తెలిపింది.

"ప్రజల జీవనోపాధి డిమాండ్లపై ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా గ్రామీణ బంద్, పారిశ్రామిక/ సెక్టోరల్ సమ్మె పిలుపు నేపథ్యంలో రైతులు, కార్మికుల వేదికలతో చర్చలకు ప్రభుత్వం ఎందుకు సిద్ధంగా లేదో ప్రధాని మోడీ స్పష్టం చేయాలి" అని ఎస్కేఎం పేర్కొంది.

"ప్రజల జీవనోపాధి డిమాండ్లపై దేశమంతటా జరుగుతున్న పోరాటాలను, ప్రజల ఆందోళనను అణిచివేసేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించవు. పౌరులందరికీ నిరసన తెలిపే హక్కును కల్పించే రాజ్యాంగం దేశంలో ఉందని ప్రధాని నరేంద్ర మోడీ, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్‌లకు ఎస్కేఎం గుర్తు చేసింది. ఎస్కేఎం అన్ని రాజకీయ పార్టీలు, అన్ని వర్గాలకు చెందిన వర్గ, బహుజన సంఘాలు మోడీ పరిపాలన దురాక్రమణను ఖండించాలి" అని విజ్ఞప్తి చేసింది.

" బీజేపీ హయాంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాగిస్తున్న అణచివేతను ప్రజలు తిప్పికొట్టాలి. అన్ని వర్గాల ప్రజల మద్దతుతో రైతులు, కార్మికులు ఫిబ్రవరి 16 పారిశ్రామిక/ సెక్టోరల్ సమ్మె గ్రామీణ బంద్‌ను భారీగా, ఉత్సాహంగా, విజయవంతమయ్యేలా చేయాలి" అని పిలునిచ్చింది.

కేసీఆర్ హయాంలో తెలంగాణ వ్యతిరేకులకు రెడ్ కార్పెట్

- మంత్రి పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తన ప్రభుత్వ హయాంలో కేసీఆర్ తెలంగాణ వ్యతిరేకులకు రెడ్ కార్పెట్ పరిచారని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. అసెంబ్లీలో కృష్ణాజలాలపై సోమవారం జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే కేసీఆర్ ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. తెలంగాణకు సంబంధించిన నీళ్ల హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రాజెక్టులు ఏటీఎమ్‌లుగా మారాయని ఆరోపించారు. తెలంగాణ కోసం కేసీఆర్ ఒక్కరే పోరాడలేదన్నారు. పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లుపై చర్చ జరిగిన సమయంలో తానూ, రాజగోపాల్‌రెడ్డి ముందువరుసలో ఉన్నామన్నారు. అప్పుడు కేసీఆర్ ఎక్కడ పోయారని నిలదీశారు. ఇక్కడ ప్రాజెక్టులను వదిలిపెట్టి రాయలసీమలో రత్నాల సీమ చేస్తామని కేసీఆర్ ఎలా అన్నారని ప్రశ్నించారు. కృష్ణా నదీజలాల్లో జరిగిన అన్యాయంపై అడుగుతుంటే గోదావరి నీళ్ల అంటున్నారనీ, కృష్ణా అయినా, గోదావరి అయినా మన వాటా మనకు దక్కాల్సిందేనని నొక్కి చెప్పారు.

జలదోపిడీనిఅడ్డుకుంటాం

(మొదటిపేజి తరువాయి)

ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించే ప్రసక్తే లేదు..రాష్ట్ర ప్రజలకు అపోహలు కలిగేలా కొందరు మాట్లాడుతున్నారని ' అని వ్యాఖ్యానించారు.

కేసీఆర్‌ను జగన్ పొగిడారు

బచావత్ ట్రిబ్యునల్ ఎలాంటి నీటి కేటాయింపులు చేయలేదు. రాష్ట్ర నీటిహక్కుల సాధనలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైంది. గులాబీ పాలకులదీ అసమర్థతతో..అవగాహనా లోపమో అర్థంకాదు..ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలకు కేసీఆర్ ప్రభుత్వం అంగీకారం తెలిపింది. ఢిల్లీ వెళ్లి 512:299 టీఎంసీలకు ఒప్పుకున్నారు. ఆ కేటాయింపును ఏపీ ప్రభుత్వం శాశ్వతం చేస్తున్నది. కృష్ణాజలాల్లో 70 శాతం హక్కులు పొందేందుకు తెలంగాణకు అర్హత ఉంది. పదేండ్ల కేసీఆర్ పాలనలో జరిగిన అవినీతి స్వతంత్ర భారతంలో ఎప్పుడూ జరగలేదు..జగన్, కేసీఆర్ గంటలతరబడి ఏకాంత చర్చలుచేశారు. రోజుకు మూడు టీఎంసీల నీటిని తరలించాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. 797 అడుగుల వద్ద నీటి తరలింపు జీవో నెంబరు 203ను జగన్ సర్కారు ఇచ్చింది. ఈ సందర్భంగా కేసీఆర్‌కు దన్యవాదాలు చెబుతూ ఏపీ శాసనసభలో సీఎం జగన్ మాట్లాడిన వీడియో క్లిప్పింగ్‌ను పవర్ పాయింట్ ప్రజేంటేషన్ సందర్భంగా ప్రదర్శించారు.

అపెక్స్ కౌన్సిల్‌కు కావాలనే గైర్హాజరు

'రాయలసీమ లిఫ్ట్ పూర్తయితే రోజుకు ఎనిమిది టీఎంసీల నీటిని ఏపీ తరలిస్తుంది.ఆ లిఫ్ట్ టెండర్లు పూర్తయ్యాకే కేసీఆర్ కేంద్రానికి లేఖ రాశారు. పరోక్షంగా సహకరించారు. కావాలనే కేసీఆర్ అపెక్స్ కౌన్సిల్ సమావేశానికి వెళ్లలేదు. సమావేశానికి వెళ్లి అభ్యంతరం చెబితే రాయలసీమ లిఫ్ట్ నిర్మాణం ఆగి ఉండేది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టుల అప్పగింతపై ఏ నిర్ణయం తీసుకోలేదు. నల్లగొండ వెళ్లే ముందు తెలంగాణ ప్రజలకు బీఆర్ఎస్ సర్కారు, కేసీఆర్ క్షమాపణ కోరాలి' అని ఉత్తమ్ డిమాండ్ చేశారు. ఈనేపథ్యంలో వాస్తవాలకు ప్రజలకు, శాసనసభ్యులకు తెలియజేసేందుకు ప్రభుత్వ ఖర్చుతో మేడిగడ్డకు తీసుకెళుతున్నామన్నారు. అధికార, విపక్షాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు లేఖలు రాశామని, అందరికి ఇదే ఆహ్వానమని అన్నారు. అసెంబ్లీ నుంచి బస్సుల్లో వెళదామని వివరించారు.

అసెంబ్లీ తీర్మానం

తెలంగాణకు చారిత్రక అన్యాయం జరిగిందనీ, ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో షరతులకు అంగీకరించకపోతే ఉమ్మడి ప్రాజెక్టులకు అప్పగించబోమని అసెంబ్లీ తీర్మానం చేసింది. రెండు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపిణీ,పరివాహక ప్రాంతం, కరువు ప్రాంతం,బేసిన్‌లోని జనాభా, సాగు ప్రాంతాలను పరిగణనలోకి తీసుకుని చేయాల్సి పేర్కొంది. ఈ వివాదం ట్రిబ్యునల్ ప్రకారం బేసిన్‌లోని అవసరాలకే మొదటి ఇవ్వాలని చెప్పింది. 1962లో శ్రీశైలం ప్రాజెక్టులను జలవిద్యుత్ కేంద్రంగా మంజూరు చేసిన ప్రణాళిక సంఘం, నాగార్జునసాగర్‌కు 264 టీఎంసీలు విడుదల చేయాలని చెప్పినట్టు గుర్తు చేసింది. దీంతోపాటు శ్రీశైలంలో కనీస నీటి వినియోగ మట్టం 830 అడుగులుగా ఉండాలని చెప్పింది. శ్రీశైలం జలాశయం నుంచి బేసిన్ వెలుపలకు కేవలం 34 టీఎంసీలు మాత్రమే తరలించాలనీ, తాగునీటి అవసరాలను కేవలం 20 శాతంగానే పరిగణనలోకి తీసుకోవాలని వివరించింది. బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం రాష్ట్రాలకు క్యారీ ఓవర్ అవకాశం ఉండాలనీ, కృష్ణాజలాలు తరలించేలా బేసిన్ వెలుపల అనుతుల్లేని ప్రాజెక్టులు, విస్తరణ, పనులు చేపేట్టకుండా చూడాలని తీర్మానంలో పేర్కొంది.

పద్మారావుకు బాధ్యతలు అప్పగించాలి
కేసీఆర్‌కు రేవంత్ సలహా

కేసీఆర్ సభకు రాకపోవడంపై రేవంత్ స్పందిస్తూ 'తెలంగాణ సమాజానికి నీళ్ల ప్రాణప్రదాయిని.ముఖ్యంగా దక్షిణ తెలంగాణలో మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్లగొండ, ఖమ్మం వరకు కృష్ణానదీ జలాల మీదనే ఆధారపడి జీవితాలు కొనసాగిస్తున్నాం. మహబూబ్‌నగర్ నుంచి 10 లక్షలకుపైగా తట్టపని, మట్టిపని,బొగ్గుపనులకోసం వలసలు వెళ్లారు. ఇందుకు కారణం ఒక వ్యక్తి అని అన్నారు. కృష్ణాజలాలపై చర్చ జరుగుతుంటే, ఆ హానుభావుడు ఒక్కడకు రాకుండా ఫామ్‌హౌస్‌లో ఉన్నాడు. తెలంగాణ సమాజాన్ని అవమానిస్తున్నాడు. ఇంతకంటే కీలకమైన అంశం ఈ తెలంగాణకు ఏమైనా ఉందా ? కృష్ణా నదీ పరివాహక ప్రాంతం ప్రకారం 68 శాతం శాటా నీళు తెలంగాణకు ఇవ్వాలని ప్రత్యేక తీర్మానం తీసుకొచ్చినప్పుడు హుందాగా ప్రధానప్రతిపక్ష నాయకులు వచ్చి ఇక్కడ కూర్చొని ఈ తీర్మానానికి మద్దతు పలికి తెలంగాణ హక్కుల మీద, నీళ్ల మీద ఒకే మాట మీద నిలబడ్డామని ఆంధ్రప్రదేశ్ నుంచి కేంద్ర ప్రభుత్వం వరకు ఒక సందేశాన్ని పంపాల్సిన సమయం, సందర్భంలో సభకు రాకుండా ఫామ్‌హౌస్‌లో దాక్కుని ప్రజలను తప్పుదోవ పట్టించడానికి మిగతావారిని పంపించి అబద్దాలు ఆడిస్తున్నారని అన్నారు. అయినా సభలో హరీశ్‌రావు, ఇతరులు మాట్లాడే మాటలకు విలువ లేదని వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష నాయకుడిగా పద్మారావుకు బాధ్యతలు ఇవ్వాలి. ఆయన నిజమైన తెలంగాణ ఉద్యమకారుడు. తెలంగాణ కోసం కోట్లాడేవారు. వారిలాంటివారికి నిర్వహణ బాధ్యతను ఇస్తే సమాజానికి మేలు జరుగుతుందని సీఎం అన్నారు.

సభకు రాకుండా..
నల్లగొండకు వెళ్తారా ? భట్టి

ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చర్చలోకి వస్తూ కృష్ణా జలాలపై అసెంబ్లీలోచర్చ చేపట్టి, తీర్మానం చేసి డిల్లీకి పంపుదామంటే, ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ భకు రాలేదని అన్నారు. అసెంబ్లీకి రాని వ్యక్తి, మంగళవారం నల్లగొండ సభకు ఎలా వెళతారని ప్రశ్నించారు. ఈఎన్సీ మురళీధర్‌రావును బీఆర్ఎస్ తమకు అనుకూలంగా మాట్లాడించిందని ఆరోపించారు. ఆయన రిటైరైనా పదేండ్లు బీఆర్ఎస్ సర్కారు కొనసాగించిందన్నారు. ఎమ్మెల్యే హరీశ్‌రావు సభను తప్పుదోవపట్టిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వంలో బీఆర్ఎస్ ఏజెంట్లు చాలా మందే ఉన్నారనీ, వారిపై త్వరలోనే చర్యలు తీసుకుంటామని అన్నారు.

అడుగడుగునా నిర్బంధం

(మొదటిపేజి తరువాయి)

ఉంటాయి. ప్రజా రవాణా వాహనాలను నగరంలోకి అనుమతించడం లేదు. ఎవరూ ఆయుధాలు ధరించి తిరగకూడదని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాలలో ప్రమాదకరమైన వస్తువులతో తిరగడాన్ని కూడా నిషేధించారు. అనుమతి లేకుండా లౌడ్‌స్పీకర్లను వాడకూడదని చెప్పారు. రెచ్చగొట్టేలా సందేశాలను వ్యాప్తి చేస్తే కఠిన చర్యలు తప్పవని హుకుం జారీ చేశారు. అయితే ప్రభుత్వం ఏర్పాటు చేసే కార్యక్రమాలకు మాత్రం ఇవేవీ వర్తించవు. పోలీసులు జారీ చేసిన ఆదేశాల ప్రకారం...రోడ్లను దిగ్బంధించకూడదు. ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమిగూడకూడదు. ర్యాలీలు, సమావేశాలు నిర్వహించకూడదు. ప్రదర్శనలు నిర్వహించడం, వాటిలో పాల్గొనడం నేరం.

సరిహద్దు జిల్లాల నుండి రాజధానికి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. కర్రలు, బ్యానర్లు వంటి వస్తువులతో సంచరించడాన్ని పూర్తిగా నిషేధించారు. వివాహాలు, అంత్యక్రియలు, ఇతర మతపరమైన కార్యక్రమాల కోసం సంబంధిత అధికారుల నుండి ముందుగా అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఢిల్లీకి తరలి వచ్చే రైతులను అడ్డుకునేందుకు తిక్రి సరిహద్దు మెట్రో స్టేషన్ సమీపంలో ఐదంచెల బారికేడ్లను ఏర్పాటు చేశారు. సింఘు, ఘాజీపూర్ సరిహద్దుల వద్ద కూడా పోలీసులు జాతీయ రహదారులను మూసేశారు. రాజధాని సరిహద్దుల వద్ద పెద్ద ఎత్తున పోలీసులు, పారా మిలటరీ దళాలను మోహరించారు. సరిహద్దుల వద్ద నిఘా కోసం డ్రోన్లను ఉపయోగిస్తున్నారు. అనేక చోట్ల ట్రాఫిక్‌ను దారి మళ్లించారు.

ఢిల్లీ వెళుతున్న కర్నాటక రైతులను భోపాల్‌లో అరెస్ట్ చేయడాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఖండించారు. వారిని వెంటనే విడుదల చేయాలని కోరారు. పలు రాష్ట్రాల నుండి రాజధాని వైపు వస్తున్న రైతులను పోలీసులు ఎక్కడికక్కడ నిర్బంధిస్తున్నట్లు వార్తలందుతున్నాయి. ఓ వైపు రైతులతో చర్చలు జరుపుతామని చెబుతూనే మరోవైపు వారిని అరెస్ట్ చేస్తున్నారని, అలాంటప్పుడు సంప్రదింపులు ఎలా సాధ్యమని రైతు సంఘాల నేతలు ప్రశ్నిస్తున్నారు. అంబాలా, జింద్, ఫతేహాబాద్, కురుక్షేత్ర వద్ద పంజాబ్‌తో ఉన్న సరిహద్దులను హర్యానా ఇప్పటికే మూసేసింది. రాష్ట్రంలోని 15 జిల్లాల్లో 144వ సెక్షన్ విధించింది.

ఇదిలావుండగా ఢిల్లీ ఛలో కార్యక్రమంలో పాల్గొనేందుకు పంజాబ్ నుండి పెద్ద సంఖ్యలో ట్రాక్టర్ ట్రాలీలు బయలుదేరాయి. ఈ ఆందోళనలో 200కు పైగా రైతు సంఘాలు భాగస్వాములవుతున్నాయి. పంటలకు కనీస మద్దతు ధరలు కల్పిస్తామన్న హామీకి చట్టబద్ధత కల్పించాలని రైతులు ప్రధానంగా డిమాండ్ చేస్తున్నారు.

కార్పొరేట్ శక్తుల కోసమే సాగు నల్ల చట్టాలు

(మొదటిపేజి తరువాయి)

వాయిదా వేసిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర చెల్లించలేకపోయిందన్నారు. వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. దేశంలో ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్నారు. నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చి కార్మికుల హక్కులను కాలరాశారన్నారు. పెంచిన ధరలను అరికట్టకుండా పేదలపైన భారాలు మోపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. 16న జరిగే గ్రామీణ భారత్ బంద్‌లో పెద్దఎత్తున రైతులు, వ్యవసాయ కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.శోభన్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పి.అంజయ్య, మండల అధ్యక్షుడు కె.జంగయ్య, నాయకులు బి.శ్రీశైలం, ఎస్.జంగారెడ్డి, లింగం తదితరులు పాల్గొన్నారు.

రాచకొండ కమిషనర్ ఆకస్మిక బదిలీ

(మొదటిపేజి తరువాయి)

కోసం ఎదురు చూస్తున్న ఎస్పీ మురళీధర్‌ను రాష్ట్ర పోలీసు అకాడమీ డిప్యూటీ డైరెక్టర్‌గా నియమించి.. ఇక్కడున్న డాక్టర్ బి. నవీన్ కుమార్‌ను డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. రాజేంద్రనగర్ అదనపు డీసీపీ సాధన రశ్మీ పెరుమాల్‌ను బదిలీ చేసి నగర టాస్క్‌ఫోర్స్ డీసీపీగా నియమించారు.

బల పరీక్ష నెగ్గిన నితీశ్ సర్కాం

(మొదటిపేజి తరువాయి)

అనుకూలంగా తుది స్కోర్ 129-0గా మారింది. జేడీయూకి 45మంది ఎంఎల్‌ఎలు వుండగా, బీజేపీకి 79, హెచ్ఎఎంఎకి నలుగురు వున్నారు. అంటే మొత్తం 128మంది వున్నారు. ముగ్గురు ఆర్జేడీ ఎంఎల్‌ఎలు పాలక ఎన్డీఏ వైపునకు ఫిరాయించి, అనుకూలంగా ఓటు వేసినట్లు వార్తలందాయి. జేడీయూకి చెందిన ఒక ఎంఎల్‌ఎ బలపరీక్షకు గైర్హాజరయ్యారు. మరో ఎంఎల్‌ఎ హజారి డిప్యూటీ స్పీకర్‌గా సమావేశానికి అధ్యక్షత వహిస్తున్నందున ఆయన ఓటు వేయలేరు. అందువల్ల ఎన్డీఏకి 126మందే సభ్యులు వున్నారు. ముగ్గురు ఆర్జేడీ సభ్యులు కూడా ఓటు వేయడంతో 129మంది మద్దతిచ్చినట్లైంది.

భారతరత్న అవార్డులపై ఒప్పందం కుదుర్చుకున్నారు : తేజస్వి యాదవ్

భారతరత్న అవార్డులపై బీజేపీ ఒక ఒప్పందాన్ని కుదుర్చుకుందని బీహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ కేంద్రంపై విరుచుకుపడ్డారు. సోమవారం ఆయన విధాన సభలో మాట్లాడుతూ.. 'కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న అవార్డు లభించినందుకు నేను సంతోషిస్తున్నాను. అయితే బీజేపీ వాళ్లు మాతో ఒప్పందం కుదుర్చుకుంటే.. మీకు భారతరత్న అవార్డును ఇస్తాం అనే విధంగా వారు ఒప్పందం కుదుర్చుకున్నారు.' అని తేజస్వియాదవ్ విమర్శించారు.

రేషన్ షాపుల్లో మోడీ పోస్టర్లు, బ్యానర్లు పెట్టం

(మొదటిపేజి తరువాయి)

లేని విధంగా మోడీ ప్రభుత్వం నూతన ప్రచార పోకడను చేపట్టడం అభ్యంతరకరమని పేర్కొన్నారు. జాతీయ ఆహార భద్రతా చట్టం (ఎన్ఎఫ్ఎస్ఎ) కింద పనిచేస్తున్న రేషన్ పంపిణీ వ్యవస్థను ఎన్నికల ప్రచారానికి వాడుకోవడం సరైంది కాదని విజయన్ కేరళ అసెంబ్లీ వేదికగా కేంద్ర ప్రభుత్వ తీరును దుయ్యబట్టారు. ప్రచారం కోసమే మోడీ ప్రభుత్వం ఇలా వ్యవహరిస్తోందనేది సుస్పష్టమని, ఈ తరహా ప్రచారం సరైంది కాదని తమ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తుందని, ఇలా చేయడం కష్టమని కూడా వివరిస్తామని తెలిపారు. ఈ విషయాన్ని ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లాలా, లేదా అనే నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందన్నారు.

రేషన్ షాపుల్లో 14 వేలకుపైగా ప్రధాని మోడీ పోస్టర్లు, బ్యానర్లు ఏర్పాటు చేయాలని, ఆహారోత్పత్తులతో కూడిన క్యారీ బ్యాగ్‌లపై కేంద్ర ప్రభుత్వం లోగోలను ముద్రించాలని కూడా ఎఫ్‌సీఐతోపాటు కేరళ ఆహార శాఖకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి జీఆర్ అనిల్ పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన 550 రేషన్ షాపుల్లో ప్రధాన మంత్రి సెల్ఫీ పాయింట్లను నెలకొల్పాలని కూడా కేంద్ర ప్రభుత్వం ఆదేశించిందని మంత్రి తెలిపారు.

టార్గెట్ రంజీ ట్రోఫీ

- హైదరాబాద్‌కు రంజీ టైటిల్ సాధించటమే లక్ష్యం
- రానున్న రెండు సీజన్లలో టైటిల్ కొడతాం
- నవతెలంగాణతో హైదరాబాద్ కెప్టెన్ తిలక్ వర్మ

భారత సీనియర్ జట్టు నుంచి జూనియర్ జట్ల వరకు అన్నింటా హైదరాబాద్ క్రికెటర్ల ప్రాతినిథ్యం కనిపిస్తుంది. ఏ స్థాయి క్రికెట్‌లో జాతీయ జట్టు బరిలో నిలిచినా.. అందులో ఓ హైదరాబాదీ ఆటగాడు మెరుస్తున్నాడు. జాతీయ జట్లకు ప్రతిభావంతులైన ఆటగాళ్లను అందిస్తున్నా.. ప్రతిష్టాత్మక దేశవాళీ టోర్నీల్లో హైదరాబాద్ ఆశించిన ఫలితాలు సాధించటం లేదు. ఇటీవల హెచ్‌సీఏలో పరిపాలన పగ్గాలు మారినట్టే.. మైదానంలో ఆట సైతం మారుతున్నట్టే అనిపిస్తుంది!. రానున్న రెండు సీజన్లలో హైదరాబాద్‌ను రంజీ ట్రోఫీ చాంపియన్‌గా నిలుపటమే లక్ష్యమని కెప్టెన్ తిలక్ వర్మ అన్నారు. రంజీ ట్రోఫీ ప్లేట్ లీగ్‌లో హైదరాబాద్ ఫైనల్స్‌కు చేరుకున్న సందర్భంగా భారత స్టార్ క్రికెటర్ తిలక్ వర్మతో 'నవతెలంగాణ'తో ప్రత్యేక ఇంటర్వ్యూ..

నవతెలంగాణ-హైదరాబాద్



నిరాశకు లోనయ్యాం!

రంజీ ట్రోఫీ ఐదుసార్లు ఫైనలిస్ట్ హైదరాబాద్ ప్లేట్ లీగ్‌కు పడిపోవటంతో జట్టంతా నిరాశకు లోనయ్యాం. ఈ సీజన్ ప్లేట్ లీగ్‌లో ఏం చేయాలనే అంశాన్ని అందరం ఒక సవాల్‌గా తీసుకున్నాం. ప్లేట్ లీగ్‌లో జట్లపై విజయాలు మా లక్ష్యం కాదు. గ్రూప్ దశలో ప్రతి మ్యాచ్‌ను వీలైనంత వేగంగా ముగించటమే మా ప్రణాళిక. ఐదు మ్యాచుల్లోనూ అదే ఫార్ములా అమలు చేశాం. రెండు రోజుల్లోనే విజయాలు నమోదు చేశాం. ఇప్పుడు ఎలైట్ గ్రూప్‌లోకి అడుగుపెడుతున్నాం. ఇక్కడ్నుంచి కథ మారుతుంది.

బ్యాటింగ్ మెరుగుపడాలి

రంజీ ట్రోఫీలో ఎలైట్, ప్లేట్ లీగ్‌లకు ఎంతో వ్యత్యాసం. క్రికెట్ ఆడే స్థాయి, నాణ్యత పూర్తి భిన్నం. ప్లేట్ లీగ్ జట్లు చాలా పురోగతి సాధించాల్సి ఉంది. బౌలింగ్ పరంగా చూసినప్పుడు ప్లేట్ లీగ్ జట్లు మంచి పోటీ ఇవ్వగలుగుతున్నాయి. బౌలర్లు అంచనాలను అందుకుంటున్నారు. కానీ బ్యాటింగ్ పరంగా ఎంతో మెరుగుపడాలి.

ఆ అవకాశం కోసం చూస్తున్నా

ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో మంచి ప్రదర్శన చేయటంతోనే నాకు భారత టీ20, వన్డే జట్లలో అవకాశాలు లభించాయి. నేను బాగా ఆడేది రెడ్ బాల్ ఫార్మాటే. ప్రస్తుతం బాగా ఆడుతున్నాను. మంచి స్కోర్లు సాధిస్తున్నాను. రానున్న సీజన్‌లోనూ ఇలాగే నిలకడగా పరుగులు చేస్తూ ఉంటే కచ్చితంగా టెస్టు జట్టులోనూ అవకాశం వస్తుందని అనుకుంటున్నాను. అందుకోసం నేను చేయాల్సిన పని చేస్తూంటే ఉంటాను.

డ్రెస్సింగ్‌రూమ్‌లో గౌరవం

హైదరాబాద్ డ్రెస్సింగ్‌రూమ్‌లో నా కంటే సీనియర్లు ఉన్నారు. అయినా, కెప్టెన్‌గా నాకు అన్ని విధాలుగా మద్దతుగా నిలిచారు. ఓ సోదరుడిగా భావించటంతో పాటు భారత్, ఐపీఎల్‌కు ఆడిన ఆటగాడిగా గౌరవం ఇస్తున్నారు. మ్యాచ్‌లో కొన్ని సందర్భాల్లో కాస్త కఠినంగా ఉండాల్సి వస్తుంటుంది. ఆ సమయంలోనూ సీనియర్లు అర్థం చేసుకుంటూ సహకారం అందిస్తున్నారు. డ్రెస్సింగ్‌రూమ్ వాతావరణం బాగుంది. అందుకు సహచర క్రికెటర్లకు, సహాయక సిబ్బంది, అడ్మినిస్ట్రేటర్స్‌కు ధన్యవాదాలు.

అదే అత్యంత కీలకం

ఐపీఎల్ భిన్నమైన అనుభూతి. అశేష అభిమానుల నడుమ ఎంతో ఒత్తిడి ఉంటుంది. ఆ సమయంలో ప్రశాంతంగా ఉండటం ప్రధానం. ముంబయి ఇండియన్స్ డ్రెస్సింగ్‌రూమ్‌లో నేర్చుకున్న విషయాలను ఇక్కడ హైదరాబాద్ జట్టులో సహచరులతో పంచుకుంటాను. ప్రత్యేకించి టీ20 ఫార్మాట్‌లో ఆడుతున్నప్పుడు ప్రశాంతంగా ఉండటం అత్యంత కీలకం. ఈ ఏడాది సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీలో హైదరాబాద్ అద్భుతంగా ఆడింది.

టైటిల్ కొడతాం

హైదరాబాద్ చివరగా 1987లో రంజీ ట్రోఫీ టైటిల్ సాధించింది. ఇన్నేండ్ల నిరీక్షణకు తెరదించాలనే పట్టుదలతో ఉన్నాం. రానున్న రెండేండ్లలో హైదరాబాద్‌ను రంజీ విజేతగా నిలుపుతాం. రంజీ ట్రోఫీ టైటిల్ సాధించటమే నా లక్ష్యం. హెచ్‌సీఏ అడ్మినిస్ట్రేషన్, సెలక్షన్ కమిటీ, సహాయక సిబ్బంది నుంచి గొప్ప సహకారం ఉంది. ఇది ఇలాగే కొనసాగితే హైదరాబాద్‌ను రంజీ చాంపియన్‌గా చూసేందుకు ఎంతో సమయం పట్టదు.

కెఎల్ రాహుల్ అవుట్

- గాయంతో మూడో టెస్టుకు దూరం
- పడిక్కల్‌కు సెలక్టర్ల పిలుపు



ముంబయి : ఇంగ్లాండ్‌తో మూడో టెస్టు ముంగిట టీమ్ ఇండియాకు మరో ఎదురుదెబ్బ. ఇప్పటికే విరాట్ కోహ్లి గైర్హాజరీతో బ్యాటింగ్ లైనప్ సతమతం అవుతుండగా ఫామ్‌లో ఉన్న మిడిల్ ఆర్డర్ బ్యాటర్ కెఎల్ రాహుల్ వరుసగా రెండో టెస్టుకు దూరమయ్యాడు. కండరాల గాయంతో విశాఖ టెస్టుకు దూరమైన రాహుల్ తాజాగా మోకాలి నొప్పితో గురువారం నుంచి ఆరంభం కానున్న రాజ్‌కోట్ టెస్టుకు అందుబాటులో ఉండటం లేదు. 'కెఎల్ రాహుల్ 90 శాతం మ్యాచ్ ఫిట్‌నెస్ సాధించాడు. బెంగళూర్‌లోని ఎన్‌సీఏలో రాహుల్ కోలుకునే ప్రక్రియ కొనసాగుతుంది. రాంచి, ధర్మశాల టెస్టులకు రాహుల్ పూర్తి ఫిట్‌నెస్ సాధిస్తాడని ఆశాభావంతో ఉన్నామని' బీసీసీఐ ఓ ప్రకటనలో తెలిపింది. మిడిల్ ఆర్డర్‌లో శ్రేయస్ అయ్యర్‌పై సెలక్టర్లు వేటు వేయటంతో మూడో టెస్టుకు ఆతిథ్య భారత్ బ్యాటింగ్ కష్టాలు కాస్త పెరగనున్నాయి. కెఎల్ రాహుల్ స్థానంలో యువ ఆటగాడు దేవదత్ పడిక్కల్ (కర్ణాటక) జట్టులోకి ఎంపికయ్యాడు. తాజా రంజీ ట్రోఫీ సీజన్లో 92.66 సగటుతో 556 పరుగులు చేసిన దేవదత్ పడిక్కల్ సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. దేశవాళీలో నాణ్యమైన స్పిన్‌పై పరుగుల వరద పారించిన పడిక్కల్ రాజ్‌కోట్ టెస్టులో ఇంగ్లాండ్ స్పిన్నర్లపై పైచేయి సాధించే అవకాశాలు ఉన్నాయి. గాయంతో రెండో టెస్టుకు దూరమైన ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా జట్టుతో కొనసాగనున్నాడు. సొంత మైదానంలో జరిగే టెస్టు మ్యాచ్‌కు టీమ్ సెలక్షన్‌కు జడేజా అందుబాటులో ఉండనున్నాడు.

హైదరాబాద్‌లో ఎఫ్‌ఐఎం వరల్డ్‌కప్ ఫైనల్

నవంబర్ 29 నుంచి తుది రేసుకు ఆతిథ్యం



హైదరాబాద్ : మరో ప్రతిష్టాత్మక స్పోర్ట్స్ ఈవెంట్‌కు హైదరాబాద్ వేదిక కానుంది. ఎఫ్ఐఎం ఈ ఎక్స్‌ప్లోరర్ వరల్డ్‌కప్ సీజన్ 2 ఫైనల్స్‌కు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వనుంది. ఫెడరేషన్ ఆఫ్ ఇంటర్నేషనల్ మోటార్‌సైకిల్ (ఎఫ్ఐఎం) ఈ మేరకు 2034 సీజన్ షెడ్యూల్ విడుదల చేసింది. ఎనిమిది జట్లు పోటీపడుతున్న వరల్డ్‌కప్‌లో ఈ ఏడాది ఐదు రౌండ్ల రేసులు నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 16-17న ఒసాక (జపాన్) తొలి రేసు జరుగనుండగా, నవంబర్ 29-డిసెంబర్ 1 వరకు హైదరాబాద్‌లో ఫైనల్స్ జరుగుతాయి. నార్వే, ఫ్రాన్స్, స్విట్జర్లాండ్‌లు వరుసగా 2, 3, 4 రౌండ్ల రేసులకు వేదిక కానున్నాయి.

ఎలక్ట్రిక్ మోటార్‌సైకిల్స్‌తో జరిగే ఈ రేసులో ప్రతి జట్టు నుంచి ఇద్దరు రేసర్లు బరిలోకి దిగుతారు. ప్రతి జట్టు నుంచి ఒక పురుష, ఒక మహిళా రేసర్ పోటీ పడాల్సి ఉంటుంది. మెన్, ఉమెన్ కలిసి ఒకే రేసులో పోటీపడటం ఎఫ్ఐఎం ఈ ఎక్స్‌ప్లోరర్ ప్రత్యేకత. భారత్ నుంచి కంకణాల స్పోర్ట్స్ గ్రూప్ 'ఇండీ రేసింగ్' పోటీపడనుంది. స్టార్ రేసర్లు శాండ్రా గోమెజ్, స్పెన్సర్ విల్టన్‌లు ఇండీ రేసింగ్ జట్టు తరఫున రయ్ రయ్ అనిపించనున్నారు.

చాలెంజర్స్‌కు ఏటీపీ నిధులు!

చెన్నై : 2015 తర్వాత భారత్ తొలిసారి ఓ ఏడాదిలో నాలుగు చాలెంజర్ (100) టూర్ టోర్నీలను నిర్వహించనుంది. అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) ఈ నాలుగు ఈవెంట్లకు ఆర్థికంగా సహకారం అందిస్తున్నట్టు తమిళనాడు టెన్నిస్ సంఘం అధ్యక్షుడు, మాజీ ఆటగాడు విజయ్ అమృత్‌రాజ్ తెలిపారు. చెన్నై చాలెంజర్ టోర్నీ ఆదివారంతో ముగియగా.. బెంగళూర్, పుణె, న్యూఢిల్లీలు వరుస వారాల్లో జరుగుతాయి. 'నాలుగు చాలెంజర్ టోర్నీలకు ఏటీపీ ఆర్థిక సహకారం ఉంది. అందుకే చాలెంజర్ టీవీని ప్రవేశపెట్టారు. మ్యాచుల ప్రసారం ద్వారా లభించిన ఆదాయాన్ని ఏటీపీ టోర్నీల ఖర్చులకు కేటాయిస్తుంది. అన్ని చాలెంజర్ టోర్నీలకు ప్రొడక్షన్ ఖర్చును ఏటీపీ భరిస్తుంది. చాలెంజర్ టోర్నీలకు ఏటీపీ నిధులు కేటాయించటం ఇదే తొలిసారి' అని అమృత్‌రాజ్ తెలిపారు. ఇక చెన్నై చాలెంజర్ టోర్నీలో విజేతగా నిలిచిన సుమిత్ నాగల్ ఏటీపీ ర్యాంకింగ్స్‌లో టాప్-100లోకి అడుగుపెట్టిన సంగతి తెలిసిందే.

లగడపాటి శ్రీధర్‌కు టెన్నిస్ టైటిల్

- మెన్స్ డబుల్స్ చాంప్స్ అనిరుధ్, సిద్దార్థ్ జోడి
- ముగిసిన హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్





హైదరాబాద్ : 16వ హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్ జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్ (జెహెచ్ఐసి) స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సోమవారం ఘనంగా ముగిసింది. మెన్స్ 50 ప్లస్ సింగిల్స్‌లో లగడపాటి శ్రీధర్ 10-8తో వహీద్‌పై విజయం సాధించి టైటిల్ సాధించగా.. 30 ప్లస్ డబుల్స్‌లో అనిరుధ్, సిద్దార్థ్ జోడి 10-8తో విజయ్, ఈశ్వర్‌లను ఓడించి విజేతలుగా నిలిచారు. నంద్యాల నర్సింహారెడ్డి, వహీద్‌లు పురుషుల డబుల్స్ విజేతలుగా నిలిచారు. మెన్స్ 50 ప్లస్ డబుల్స్‌లో నంద్యాల, వహీద్‌లు 10-6తో సుధాకర్ రెడ్డి, దినకర్‌లపై విజయం సాధించారు. పురుషుల సింగిల్స్‌లో సూర్య పవన్ (30 ప్లస్), రాజ (40 ప్లస్), రామ్‌రెడ్డి (60 ప్లస్), సేతు (70 ప్లస్) టైటిల్స్ సాధించగా.. డబుల్స్ విభాగంలో సేతు, రాంబాబు (70 ప్లస్), పాల్ మనోహర్, జోజి రెడ్డి (60 ప్లస్), విజయ్ వర్మ వెంకట శివకుమార్ (40 ప్లస్) విజేతలుగా నిలిచారు. తెలంగాణ ఏసీబీ అదనపు డైరెక్టర్ ఏఆర్ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ అసోసియేషన్ (హెచ్ఓటీఏ) అధ్యక్షుడు నంద్యాల నర్సింహారెడ్డి, ఆఫీస్ బేరర్లు వాసుదేవరెడ్డి, ఏఆర్ రావు, ఎల్ శ్రీనివాస్, అనిరుధ్, సందీప్, సుబ్రమణ్యం, సదాశివ రెడ్డి సహా జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్ అధ్యక్షుడు సురేందర్ రెడ్డి, కార్యదర్శి రాజేశ్వర్ రావు, స్పోర్ట్స్ కన్వీనర్ ప్రవీణ్ రెడ్డి, ప్రసాదరావు, వర్మ తదితరులు టోర్నమెంట్ ముగింపు వేడుకల్లో పాల్గొన్నారు.

అందరికీ కనెక్ట్ అయ్యే సినిమా


వివి ఆనంద్

సందీప్ కిషన్ నటించిన ఫాంటసీ అడ్వెంచర్ మూవీ 'ఊరు పేరు భైరవకోన'. వివి ఆనంద్ దర్శకత్వం వహిస్తున్నారు. కావ్య థాపర్, వర్ష బొల్లమ్మ కథానాయికలుగా నటించారు. హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా నిర్మించారు. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై అనిల్ సుంకర సమర్పిస్తున్నారు. బాలాజీ గుత్తా ఈ చిత్రానికి సహ నిర్మాత. ఈ చిత్రం ఈనెల 16న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ నేపథ్యంలో దర్శకుడు విఐ ఆనంద్ ఈ చిత్ర విశేషాలని విలేకరుల సమావేశంలో పంచుకున్నారు.

- సందీప్ 'ఊరు పేరు భైరవకోన' కథకు చాలా ఎగ్జైట్ అయ్యారు. నాకు కూడా ఈ కథ చేస్తే చాలా కొత్త ఉంటుంది. ఒక ట్రెండ్ సెట్ చేసేలా ఉంటుదని ఫిక్స్ చేశాం. ఇప్పటివరకూ సందీప్ కూడా సూపర్ నేచురల్ ఫాంటసీ జోనర్ చేయలేదు. ఆయనకి కూడా ఇది చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. బిగ్ స్క్రీన్ పై విజువల్, సౌండ్ పరంగా ఒక గొప్ప ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమా ఇది. హాస్య మూవీస్‌లో ప్రొడక్షన్ నెం.1 ఈ సినిమా. మా మంచి కోరే వ్యక్తి అనిల్ సుంకర. ఆయన ఈ ప్రాజెక్ట్‌లోకి వస్తే బావుంటుందని కోరుకున్నాం. అలా ఆయన జాయిన్ అవ్వడంతో ఈసినిమా జర్నీ స్టార్ట్ అయ్యింది.
- ఈ కథకి 'ఊరు పేరు భైరవకోన' యాప్ట్ అనిపించి ఫిక్స్ చేశాం. టైటిల్‌లో మైథాలజీ టచ్ వుంది. ఈ కథలో కూడా కర్మ సిద్ధాంతం, గరుడపురాణం, శివదండం లాంటి నేపథ్యాలు ఉన్నాయి కాబట్టి ఈ టైటిల్ సరిగ్గా నప్పుతుంది. కర్మ సిద్ధాంతం నియమంలోనే ఈ కథ ఉంటుంది. మనం చేసిన కర్మ వేరే విధంగా తిరిగివస్తుంది. స్టోరీ లైన్‌లోనే ఈ ఫిలాసఫీ ఉంది. లైఫ్, డెత్ గురించి నాకు చాలా ఆసక్తి. చనిపోయిన తర్వాత ఆత్మ ప్రయాణం గరుడపురాణంలో వివరంగా ఉంది. ఈ జర్నీ చాలా ఆసక్తిని కలిగించింది. ఈ సినిమాని ఎక్కడా రాజీపడకుండా చాలా గ్రాండ్‌గా రూపొందించాం. అనిల్, రాజేష్ కథని చాలా బలంగా నమ్మి కావాల్సిన ప్రతీదీ సమకూర్చారు. ఇది యూత్, ఫ్యామిలీతో పాటు అందరికీ కనెక్ట్ అయ్యే సినిమా ఇది.
- ఇందులో వెన్నెల కిషోర్ ట్రాక్ భలే వర్క్ అవుట్ అయ్యింది. డాక్టర్ నారప్ప అనే హిలేరియస్ క్యారెక్టర్ చేశారు. అలాగే వైవా హర్ష పాత్రలో కూడా ఫన్ ఎలిమెంట్ బాగా వచ్చింది. కావ్య థాపర్ పాత్రలో కూడా చాలా ఫన్నీగా ఇంట్రెస్టింగ్ ఉంది. ఆడియన్స్ ఖచ్చితంగా ఎంజాయ్ చేస్తారు. సినిమా ఫన్ రైడ్‌లా ఉంటుంది.
- అలాగే ఇందులో రెండు పెద్ద ట్విస్ట్‌లు ఉన్నాయి. వీటితో పాటు చిన్న చిన్న ట్విస్ట్‌లు కూడా అంటే ప్రతి పదినిమిషాలకు ప్రేక్షకులు ఊహించని మలుపులు చోటు చేసుకుంటాయి. స్క్రీన్ ప్లే చాలా ఎంగేజింగ్‌గా ఉంటుంది. థియేటర్‌లో ఎంజాయ్ చేసి చూసే సినిమా ఇది. సందీప్‌లో ఫైర్, ప్యాషన్ బాగా ఉంది. ప్రతి సినిమాని మొదటి సినిమాలా నమ్మి పని చేస్తున్నారు. నటన పరంగా చాలా పరిణతి సాధించారు.
- ఈ సినిమా కచ్చితంగా మంచి విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది. నిఖిల్ తో ఓ సినిమా చర్చల్లో ఉంది. దీంతోపాటు అలాగే ఓ పెద్ద హీరోకి కథ రాస్తున్నాను. వాటి వివరాలు త్వరలోనే తెలియజేస్తాను.

నవచిత్రం

ఈగల్‌కు విశేష ప్రేక్షకాదరణ



రవితేజ నటించిన స్టయిలిష్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఈగల్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వ ప్రసాద్ నిర్మించగా, వివేక్ కూచిభొట్ల సహ నిర్మాతగా వ్యవహరించారు. ఈనెల 9న విడుదలై అన్ని వర్గాల ప్రేక్షకులని అలరించి పబ్లిక్ బ్లాక్ బస్టర్ సక్సెస్‌ని అందుకుంది. ఈ నేపథ్యంలో ఈగల్ మేకర్స్ పబ్లిక్ బ్లాక్ బస్టర్ సక్సెస్ మీట్ ని నిర్వహించారు.

రవితేజ మాట్లాడుతూ,'ప్రేక్షకుల నుంచి వస్తున్న రెస్పాన్స్‌కు చాలా ఆనందంగా ఉంది. నా పాత్ర మేకోవర్‌కి చాలా మంచి ప్రశంసలు వస్తున్నాయి. కార్తిక్ ఈ కథ చెప్పినప్పుడే ఆ క్యారెక్టర్‌కి చాలా ఎగ్జైట్ అయ్యాను. పీపుల్ మీడియా ఫ్యాక్టరీకి అభినందనలు. హరీష్ శంకర్‌తో వచ్చే 'మిస్టర్ బచ్చన్'తో హ్యాట్రిక్ కొడుతున్నాం. దేవ్ జాండ్ సౌండ్ ఇరగదీశాడు. తనకి చాలా మంచి భవిష్యత్ ఉంటుంది. అలాగే మణి చాలా పవర్ ఫుల్ మాటలు రాశాడు. తన పద ప్రయోగం చాలా బావుంది. కావ్య థాపర్ పవర్ ఫుల్ క్యారెక్టర్ చేసింది. తనకి బ్రైట్ ఫ్యూచర్ ఉంటుంది. కాళికాదేవి ఎపిసోడ్ అయితే నన్ను నేను నమ్మలేకపోయాను. ఎవరినో చూస్తున్న అనుభూతి కలిగింది. చాలా అద్భుతమైన ప్రశంసలు వస్తున్నాయి. కార్తిక్ అద్భుతమైన విజన్ కలిగిన దర్శకుడు. చెప్పినదాని కంటే అద్భుతంగా తీశాడు. తను టాప్ డైరెక్టర్ అవుతాడు. అనుపమ, అజయ్ ఘోస్, వినయ్ రాయ్ అందరూ తమ పాత్రలని పర్ఫెక్ట్ గా చేశారు' అని తెలిపారు.

తండ్రీ కొడుకుల అనుబంధంతో లవ్ యువర్ ఫాదర్



మనీషా ఆర్ట్స్ అండ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, అన్నపరెడ్డి స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'లైఫ్ లవ్ యువర్ ఫాదర్'. శ్రీ హర్ష, కషిక కపూర్ హీరో హీరోయిన్లుగా పవన్ కేతరాజు దర్శకత్వంలో కిషోర్ రాఠీ, మహేష్ రాఠీ నిర్మిస్తున్న ఈ మూవీ పూజా కార్యక్రమం మల్లారెడ్డి కాలేజీలో ఘనంగా జరిగింది.

ఎస్‌పి చరణ్, శ్రీహర్ష పై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి నెంబర్ ఆఫ్ మల్లారెడ్డి గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ కామకూర శాలిని కెమెరా స్విచ్ ఆన్ చేయగా, సిఎంఆర్ గ్రూప్ చైర్మన్ గోపాల్ రెడ్డి క్లాప్ కొట్టారు. గోపాల్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, శ్రీశైలం రెడ్డి, సంతోష్ రెడ్డి చిత్ర బృందానికి స్క్రిప్ట్‌ని అందించారు. ఈ సందర్భంగా నిర్మాత మహేష్ రాఠీ మాట్లాడుతూ, 'ఈ సినిమా ఒక మంచి తండ్రీ కొడుకుల మధ్యనున్న ఎమోషన్‌ని, బాండింగ్‌ని చూపించే విధంగా ఉంటుంది. మణి శర్మ మ్యూజిక్ అందిస్తున్నారు' అని తెలిపారు. 'ఇది నా మొదటి సినిమా. 100% కష్టపడి అందరికీ నచ్చే విధంగా చేస్తాను' అని హీరో శ్రీహర్ష అన్నారు. ఏ రామస్వామి రెడ్డి మాట్లాడుతూ, 'మా అబ్బాయి శ్రీహర్షాన్ని లాంచ్ చేయడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమాలో అన్ని ఎలిమెంట్స్ ఉంటాయి. శివుడి పై మంచి పాట కూడా ప్లాన్ చేసాం' అని తెలిపారు. దర్శకుడు పవన్ కేతరాజు మాట్లాడుతూ, 'గతంలో కో డైరెక్టర్‌గా చాలా సినిమాలకు వర్క్ చేశాను. కిషోర్ రాఠీ నన్ను పిలిచి ఈ సినిమా ఇచ్చారు'అని చెప్పారు.

ఆద్యంతం నవ్వించే చారి..


వెన్నెల కిశోర్

చారి... బ్రహ్మచారి... రుద్రనేత్ర సీక్రెట్ సర్వీస్ ఏజెంట్. సైలెంట్‌గా హ్యాండిల్ చేయాల్సిన కేసును వయలెంట్‌గా హ్యాండిల్ చేయడం అతని నైజం. అతడిని 'ఏజెంట్ 111' అని పిలుస్తారు. 'బాండ్... జేమ్స్ బాండ్' టైపులో తనను తాను 'చారి... బ్రహ్మచారి' అని పరిచయం చేసుకోవడం చారికి అలవాటు. ఒక సీరియస్ ఆపరేషన్‌ను కామెడీగా మార్చేస్తాడు అతడు. ఆ తర్వాత ఏమైందనేది సిల్వర్ స్క్రీన్ మీద చూడాలి. 'వెన్నెల' కిశోర్ హీరోగా నటించిన సినిమా 'చారి 111'. సంయుక్తా విశ్వనాథన్ హీరోయిన్. టీజీ కీర్తి కుమార్ దర్శకుడు. బర్కత్ స్టూడియోస్ పతాకంపై అదితి సోనీ నిర్మిస్తున్నారు. మార్చి 1న థియేటర్లలో విడుదల కానుంది. సోమవారం ట్రైలర్ విడుదల చేశారు. ట్రైలర్ జస్ట్ శాంపిల్ మాత్రమేనని, సినిమాలో దీనికి మరింత వినోదం ఉంటుందని దర్శకుడు టీజీ కీర్తి కుమార్, నిర్మాత అదితి సోనీ తెలిపారు. ప్రేక్షకుల్ని 'చారి 111' కడుపుబ్బా నవ్విస్తుందని చెప్పారు. ఆదిత్య మ్యూజిక్ ద్వారా ఈ చిత్రంలోని పాటలు విడుదల కానున్నాయి. మురళీ శర్మ, బ్రహ్మాజీ, సత్య, రాహుల్ రవీంద్రన్, పావని రెడ్డి, 'తాగుబోతు' రమేష్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

23న తెలుగులో సైరన్ రిలీజ్


జయం రవి

'తని ఒరువన్', 'కోమాలి' 'పొన్నియిన్ సెల్వన్' లాంటి చిత్రాలతో తెలుగులో మంచి ఆదరణ పొందిన హీరో జయం రవి. ఆయన తాజాగా 'సైరన్' అనే మాస్ ఎంటర్టైనర్‌తో రానున్నారు. ఆంథోని భాగ్యరాజ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని తెలుగులో గంగ ఎంటర్టైన్మెంట్స్ పతాకంపై మహేశ్వర్ రెడ్డి మూలి ఈనెల 23న విడుదల చేయనున్నారు. కీర్తి సురేష్, అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్లుగా కనిపించనున్న ఈ చిత్ర తెలుగు టీజర్ ఇటీవల విడుదలై మంచి స్పందన రాబట్టుకుంది.

చిత్ర నిర్మాత సుజాత విజయకుమార్ మాట్లాడుతూ, 'ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో ఫ్యామిలీ, కమర్షియల్ ఎలిమెంట్స్ కుదిరేలా తెరకెక్కించాం. జయం రవి మునుపెన్నడూ కనిపించని లుక్, పాత్రలో కనిపించనున్నారు. కీర్తి, అనుపమ మొదటి సారి ఆయనతో కలిసి నటించారు' అని అన్నారు. 'ఈ చిత్రం నాకొక కలలా జరిగిపోయింది. ఒక కొత్త దర్శకుడి మొదటి చిత్రం అదీ పెద్ద హీరోతో అయినప్పుడు, కచ్చితంగా హిట్ అవ్వాలనుకుంటారు. తెలుగు ప్రేక్షకులకి నచ్చుతుందని ఆశిస్తున్నాం' అని దర్శకుడు ఆంథోని భాగ్యరాజ్ అన్నారు. హీరో జయం రవి మాట్లాడుతూ, 'ఈ చిత్రంలో ఎమోషన్స్ చాలా ముఖ్య పాత్రలు వహిస్తాయి. మా 'సైరన్' తమిళ - తెలుగు ప్రేక్షకులని ఆద్యంతం ఆకట్టుకుంటుందనే నమ్మకం పూర్తిగా ఉంది' అని అన్నారు

ఎయిర్‌ఫోర్స్ పైలట్ తాన్య శర్మ


రుహాని శర్మ

వరుణ్ తేజ్ బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తూ నటిస్తున్న ప్రాజెక్ట్ 'ఆపరేషన్ వాలెంటైన్'. ఎడ్జ్ ఆఫ్ ది సీట్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ సినిమా ఇప్పటికే గ్రిప్పింగ్ టీజర్, వందేమాతరం, గగనాల చార్ట్ బస్టర్ సాంగ్స్‌తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది.

ఈ చిత్రంలో వరుణ్ తేజ్ ఐఏఎఫ్ ఆఫీసర్‌గా నటిస్తుండగా, మానుషి చిల్లర్ రాడార్ ఆఫీసర్‌గా కనిపించనుంది. రుహాని శర్మ కూడా ఈ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తోంది. తాజాగా మేకర్స్ రుహాని శర్మను తాన్య శర్మగా పరిచయం చేశారు. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో ఎయిర్ ఫోర్స్ పైలెట్ యూని ఫాంలో డైనమిక్‌గా కనిపించింది రుహాని శర్మ. ఈ చిత్రం దేశంలోని వైమానిక దళ వీరుల అలుపెరగని పోరాటాన్ని, దేశాన్ని రక్షించడంలో వారు ఎదుర్కొనే సవాళ్లను అద్భుతంగా చూపించబోతుంది. ఈ చిత్రానికి శక్తి ప్రతాప్ సింగ్ హడా దర్శకత్వం వహించారు. వరుణ్‌తేజ్ కెరీర్‌లోనే ది బెస్ట్ మూవీగా ఇది నిలుస్తుందని మేకర్స్ నమ్మకం వ్యక్తం చేశారు. దేశభక్తి స్ఫూర్తిని కలిగించే ఈసినిమా అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరిస్తుందంటున్నారు. ఇందులోని ప్రతి పాత్ర ప్రేక్షకుల మనసుల్ని తాకుతుందని, మంచి కంటెంట్‌తో ఉన్న ఇలాంటి సినిమాని నిర్మించడం గర్వంగా ఉందన్నారు. సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్, సందీప్ ముద్దా రినైసన్స్ పిక్చర్స్ నిర్మించారు, గాడ్ బ్లెస్ ఎంటర్‌టైన్‌మెంట్ (వకీల్ ఖాన్), నందకుమార్ అబ్బినేని సహ నిర్మాతలు. మార్చి 1న తెలుగు, హిందీ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది.

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.